ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 11.09.2026 | సంపుటి : 13 సంచిక : 53 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ Simultaneously Published from Hyderabad & Karimnagar ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

బుల్లెట్ ట్రైన్ హబ్‌కు

## తొలి అడుగు

- ప్రాజెక్టు భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ
- శంషాబాద్ విమానాశ్రయ సమీపంలో 796.28 ఎకరాల
- భూమిని సేకరించనున్న రెవెన్యూ అధికారులు

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న బుల్లెట్ ట్రైన్ హబ్‌కు తొలి అడుగు పడింది. సమీకృత సమగ్ర రవాణా కేంద్రం(ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్) పేరుతో శంషాబాద్ విమానాశ్రయ సమీపంలోని బహదూర్ గూడలో 796.28 ఎకరాల భూమిని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు సేకరించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి మిగతా 2లో..



తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల

## బెయిల్ రద్దు చేయండి

నాంపల్లి కోర్టులో పోలీసుల పిటిషన్

2లో..



నేడు 22ఏ భూములపై

## సభలో చర్చిస్తాం

వెయి రోజుల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి
- అధికారం పోయినా అహంకారం వీడలేదు
- పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి
- సభను సజావుగా జరగకుండా చేశారు.
- కాంగ్రెస్‌కు నష్టం చేసేందుకు కుట్ర జరుగుతోంది
- సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలి
- హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలి
- సర్‌పై అప్రమత్తంగా ఉండండి
- ప్రతీ ఒక్కరు ఓటు హక్కును కాపాడే అంశాన్ని
- సీరియస్‌గా తీసుకోవాలి
- మనం చేసిన జనగణన దేశానికి రోల్ మోడల్
- సీఎల్పీ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు. "వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి" అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.

**బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత ఉంది**

అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మిగతా 2లో..

### బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత

ఫ్లాష్ సర్వేలో ఇదే ఇదే వెల్లడైంది: సీఎం

వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధు లను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి'

"గత మూడు రోజులుగా జరిగిన పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే చేయించింది. బీఆర్ఎస్ నేతల తీరునే ప్రజలు తప్పుబట్టినట్లు సర్వేలో తేలింది. ప్రభుత్వంపై వ్యతిరేకత లేనట్లు తేలింది. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా తేల్చారు. కానీ ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లుగా చూపుతున్నారు. దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి"
- సీఎల్పీ సమావేశంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు


పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లుకు

## శాసనసభ ఆమోదం

ఇకనుంచి గ్రామ పంచాయతీల సొంత ఆదాయం సమీపంలోని నేషనల్ బ్యాంకులో జమ చేసుకునేలా రూపకల్పన

- కేంద్రం నుంచి రూ.619 కోట్లు రావాలి
- స్థానిక సంస్థలు సంక్షోభంలో పడ్డాయి
- రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి:మంత్రి సీతక్క

హైదరాబాద్(జనంసాక్షి):పంచాయతీల సొంత వనరుల ద్వారా వచ్చే ఆదాయం, ప్రభుత్వ ట్రెజరీలో కాకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3ను సవరించేలా మంత్రి సీతక్క నిన్న ప్రవేశపెట్టిన బిల్లుపై గురువారం చర్చ జరిపి ఆమోదించింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా నిధులను నిర్దిష్టమైన ప్రక్రియ ద్వారా డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు, అవసరమైన పత్రాల వల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ఫైనాన్సు కమిషన్ నిధులను బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లుగానే జీపీ సొంత ఆదాయం కూడా బ్యాంకు ఖాతాలో మిగతా 2లో..






## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం
- పీఎం ఈడ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు
- తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం
- అసెంబ్లీలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్(జనంసాక్షి):గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల)కు గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. మిగతా 2లో..



## సీఎం రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులకే లబ్ది

నిబంధనలకు విరుద్ధంగా కొండల్ రెడ్డికి అక్రమంగా భూకేటాయిపులు

- రూ.200 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే ఇచ్చారు
- ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాం
- అందుకే మా ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు
- 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్'తో అక్రమ ఒప్పందాలు
- ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో అంత దోపిడీ
- సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి
- నిజాయతీ ఉంటే వెంటనే కేంద్రం స్పందించాలి
- సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు వెలికితీయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- ఫ్యూచర్ సిటీలో కొండల్ రెడ్డి భూముల పరిశీలన

రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు లబ్ది చేకూరుస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికా పర్యటన పేరిట సొంత సోదరులతోనే ఒప్పందాలు చేసుకుంటూ రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. మహేశ్వరం మండలం రావిర్యాల రెవెన్యూ పరిధిలోని ఫ్యాబ్ సిటీ భూముల్లో బీఆర్ఎస్ మిగతా 2లో..

### కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

ఫేక్ సోషల్ మీడియా ద్వారా మాపై దాడిచేస్తోంది
ఫేక్‌వార్తను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారు
సభకు, ప్రజలకు సిఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి
ముఖ్యమంత్రిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం: హరీశ్



చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై

## హద్దులు ఉండాల్సిందే

- ఆన్‌లైన్ వేధింపుల నుంచి వారిని రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలపండి
- కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు డిజిటల్ వేదికలను సులభంగా వినియోగించే అవకాశం ఉందని, అందుకే వారికి రక్షణ కల్పించేలా హద్దులు ఉండాల్సిందేనని సూచించింది. మైనర్లు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే విషయంలో రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ వేధింపుల మిగతా 2లో..

## మా ఉద్యోగులు.. మా ప్రాధాన్యత

ఉద్యోగులకు రూ.కోటి బీమా..

దేశంలోనే తొలిసారిప్రభుత్వంపై, ఉద్యోగులపై రూపాయి భారం లేకుండా అమలు

- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం..
- రూ.కోట్లలో చెల్లింపులు
- ఉద్యోగుల కోసం హెల్త్‌కార్డు కూడా తీసుకొచ్చాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తూ మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన సభకు చెప్పారు. గురువారం నాడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరణాత్మకంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో సర్క్యులర్ జారీ చేసింది. పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొంది. మిగతా 2లో..



## 'బ్రిక్స్'కు భారీ భద్రత

- 15వేల మంది పోలీసులు.. 500 సీసీటీవీలు..
- హాజరుకానున్న ప్రపంచ దేశాల అగ్రనేతలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):బ్రిక్స్ సదస్సుకు దేశ రాజధాని ఢిల్లీ నగరం సిద్ధమైంది. ఈనెల 12, 13 తేదీల్లో ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాల అగ్రనేతలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో భారీగా భద్రతను పెంచారు. దాదాపు 15 వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. 200 పారామిలటరీ కంపెనీలను మోహరించారు. విమానాశ్రయాలు, హోటళ్లు, భారత్ మండపం సహా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నేతలు బస చేసే పలు హోటళ్ల వద్ద ప్రత్యేక బలగాలను ఏర్పాటు మిగతా 2లో..

## నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

- పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు
- 2,000కు పైగా కంపెనీలతో ఎకోసిస్టమ్
- వ్యాక్సిన్ల తయారీలో గ్లోబల్ లీడర్‌గా హైదరాబాద్
- లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల్లో నూతనాధ్యాయం
- ఎంఎస్‌డీ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఈ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌డీ డిజిటల్ హ్యూమన్ హెల్త్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రితేష్ శ్రీవాస్తవ, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, మిగతా 2లో..



## విద్యార్థులూ.. మీ సమస్యలు చెప్పండి

- 19న రాహుల్ 'ఛాత్రోం కీ గూంజ్' క్యాంపెయిన్
- కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ కీలక ప్రకటన
- విద్యార్థుల సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకోవడమే ప్రచార లక్ష్యమని వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ముఖ్యంగా జెన్ జీ ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన తదుపరి పోరాటానికి సమరశంఖం పూరించారు. ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గొంతుక/ విద్యార్థుల ప్రతిధ్వని) పేరుతో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని మిగతా 2లో..

అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన తర్వాతే

## ఇరాన్ యుద్ధం ముగుస్తుంది

100 డాలర్లకు చేరిన చమురు ధరలు కూడా అప్పుడే తగ్గుతాయి

టెహ్రాన్ ఇక ఎక్కువకాలం దాడులను తట్టుకోలేదు: ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన తర్వాతే ఇరాన్‌తో యుద్ధం ముగుస్తుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 100 డాలర్లకు చేరిన చమురు ధరలు కూడా అప్పుడే మిగతా 2లో..



## స్పేస్ పరిశోధనల్లో కలిసిరండి

- అంతరిక్షం అందరిదీ..
- బాధ్యత కూడా సమిష్టిగా ఉండాలి
- పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ వర్చువల్ ప్రసంగం
- అంతర్జాతీయ చట్టాల ఆధారంగా సురక్షిత, శాంతియుత, సుస్థిర అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు



న్యూఢిల్లీ(జనంసాక్షి):అంతరిక్ష రంగంలో భారత్ వైఖరిని వ మరోసారి స్పష్టం చేశారు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం మిగతా 2లో..

## తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి..

హైదరాబాద్(జనంసాక్షి):స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో భారాస ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్‌రెడ్డికి లభించిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ సైఫాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు విధించిన బెయిల్ షరతులను నిందితులు ఉల్లంఘించారని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం కోర్టు నిబంధనలను బేఖాతరు చేస్తూ వారు మీడియా పాయింట్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లు, డిజిటల్ ఆధారాలను సమర్పించారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు వెంటనే బెయిల్ రద్దు చేయాలని కోరారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు నమోదై ఉన్నాయని పోలీసులు గుర్తుచేశారు. అందుకే ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టుకు బదిలీ చేయాలని పోలీసులు నాంపల్లి కోర్టును కోరారు.

## బుల్లెట్ ట్రైన్ హబ్‌కు తొలి అడుగు

ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. హైదరా బాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై వయా అమరావతి కారిడార్ల మధ్య బుల్లెట్ ట్రైన్ల రాకపోకలు, వాటి కార్యకలా పాలను బహదూర్‌గూడ నుంచి నిర్వహించేందుకు వీలుగా ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. బుల్లెట్ ట్రైన్ హబ్ విమానాశ్రయానికి సమీపంలో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆరునెలల క్రితం

## మా ఉద్యోగులు .. మా ప్రాధాన్యత

12.91 లక్షల మందికి కవరేజీ:రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని అన్నారు. సింగరేణితో శ్రీకారం: ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.ప్రభుత్వానికి రూపాయి భారం లేదు: ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపార పరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు. ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయన్నారు. అందులో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు ప్రకటించారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా, అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు. ఉద్యోగులకు రూ.1.20 కోట్లు : ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతో పాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు. కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం:తెలంగాణలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు.ఉద్యోగులకు హెల్త్‌కార్డు:బీమా పథకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని ఆయన చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్‌ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన చెప్పారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభకు చెప్పారు.

## విద్యార్థులూ.. మీ సమస్యలు చెప్పండి

సెప్టెంబర్ 19న మధ్యప్రదేశ్ ఇండోర్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గురువారం రోజు రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో (ట్విట్టర్) ఒక పోస్ట్ చేశారు. ఇండోర్‌లో విద్యార్థులతో సమావేశం కానున్నట్లు ఆయన వెల్లడించారు. దేశంలోని విద్యార్థులు, యువత, జెన్ జీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతున్న వీడియోను కూడా ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం దేశం మొత్తం వీరి పరిస్థితిని గమనిస్తోందని అన్నారు. ఎన్నో లోపాలతో ఉన్న భారతదేశ విద్యావ్యవస్థ విద్యార్థుల ఆశల్ని ఆర్పివేసి, వారి భవిష్యత్తును చీకటిలోకి నెట్టిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నిర్వీర్యమైన విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలంటే ప్రతి విద్యార్థి ఆవేదన, అభిప్రాయాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఎంతో అవసరం అని పేర్కొన్నారు.

**విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకే క్యాంపెయిన్**

ఈ ఛాత్రోం కీ గూంజ్ ప్రచారం ద్వారా వివిధ నగరాల్లో విద్యార్థుల్ని కలిసి వారి సమస్యల్ని తెలుసుకుంటున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 19న ఇండోర్ వేదికగా మరోసారి విద్యార్థుల మధ్యకు వస్తున్నట్లు ఆయన చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల్ని నేరుగా తనతో పంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తన ట్వీట్‌లో విద్యార్థుల నుంచి సమస్యలు, సలహాల్ని స్వీకరించేందుకు ఒక డిజిటల్ లింక్‌ను కూడా షేర్ చేశారు. ఇక్కడ 'మీ సమస్యలు- మీ సలహాలు- మనమంతా కలిసి కొత్త ఆశల్ని చిగురింపజేద్దాం' అనే సందేశం ఇచ్చారు.కాంగ్రెస్ నేతలు 2026లోనే ప్రారంభించిన 'ఛాత్రోం కీ గూంజ్' ప్రచారం ద్వారా దేశవ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించిన పలు కీలక అంశాలు, సమస్యలను జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలు, పేపర్ లీకేజీలు, విద్యారంగంలో పెరుగుతున్న ఫీజులు, ఉద్యోగ నియామకాల్లో సమస్యలు, అన్నింటికంటే పెద్ద సమస్యగా ఉన్న నిరుద్యోగం వంటి అంశాల్ని ప్రస్తావిస్తున్నారు. ఈ అంశాలపై విద్యార్థులు ప్రశ్నించేందుకు, వారి ఆందోళనలకు ఒక వేదిక కల్పించడమే ఈ ప్రచారం ఉద్దేశంగా కాంగ్రెస్ పేర్కొంటోంది. విద్యార్థులు, దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం విద్యా రంగానికి మాత్రమే పరిమితం కాట్లేదని, ఇంకా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, నియామక ప్రక్రియలు వంటి ఎన్నో అంశాలతో ముడిపడి ఉన్నట్లు చెబుతోంది. ఛాత్రోం కీ గూంజ్ ప్రచారంలో భాగంగా ఇప్పటికే కాంగ్రెస్ పుణె, కోటా, దేహ్రాదూన్, ప్రయాగ్‌రాజ్ వంటి పలు నగరాల్లో క్యాంపెయిన్స్ నిర్వహించింది.

# నేడు 22ఏ భూములపై సభలో చర్చిస్తాం

ఈ భేటీలో పాల్గొన్నారు.ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని సభను నిర్వహిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభను సజావుగా జరగకుండా కుట్ర చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో డిప్యూటీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారని బీఆర్ఎస్ నేతలను రేవంత్ రెడ్డి విమర్శించారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారని, శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారని మండిపడ్డారు. నిరసన తెలిపేందుకు ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని గుర్తు చేశారు. ప్రతిపక్ష కుట్రలు బలంగా తిప్పి కొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసేందుకు సభ్యులకు సీఎం అభినందనలు తెలిపారు.సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలని, హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్‌లో రాజకీయంగా రాణించలేరని, అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌కు నష్టం చేసేందుకు కుట్ర జరుగుతోంది**

అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని గుర్తు చేశారు. సభలో నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగి కాంగ్రెస్‌కు నష్టం చేకూర్చాలని కొందరు చూస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వక పోతే సునీత లక్ష్మా రెడ్డి, సబిత ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కేటీఆర్‌కు రేవంత్ కనిపించినట్లున్నారని ఎద్దేవా చేశారు. అంత ఆక్రోశంతో అధికారులపై దాడులకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సర్‌పై అప్రమత్తంగా ఉండండి**

దేశానికి మనం చేసిన జనగణన రోల్ మోడల్ అని, ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘనత అని కొనియాడారు. తెలంగాణ నమూనాను జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని, ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతీ ఒక్కరు ఈ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు.

## పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

జమ అయ్యేలా చట్టాన్ని సవరిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.

**కేంద్రం నుంచి రూ.619 కోట్లు రావాలి**

గ్రామపంచాయతీల కోసం ప్రతీ నెల ప్రభుత్వం 50 కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగకపోవడంతో నిలిచి పోయిన కేంద్ర నిధుల్లో ఇంకా రూ.619 కోట్లు రావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం వల్ల 2 వేల కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలను నిర్మిస్తున్నామని తెలిపారు. హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను నిర్మిస్తున్నామని సీతక్క తెలిపారు.

స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయి పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్న మంత్రి సీతక్క ఎన్నికల తర్వాత పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదల అవుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని, స్టాంపుడ్యూటీని 2018లోనే తొలగించటం స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయని చెప్పారు.

**గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నాం**

గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామన్న మంత్రి సర్పంచ్‌లకు పెండింగ్ ఉన్న నిధుల్లో పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ పనులు చేసి పంచాయతీరాజ్‌శాఖను అడుగుతున్నారని తెలిపారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని సభకు వివరించారు.గ్రామపంచాయతీలకు సహకార బ్యాంకుల్లో నిధులు జమచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బీజేపీ సభ్యులు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయ రమణరావు, శంకర్ తదితరులు చర్చలో పాల్గొని సూచనలు ఇచ్చారు. "రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఎన్నికల తర్వాత పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదల అవుతున్నాయి. కేంద్రం నుంచి దాదాపు రూ.619 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉంది. స్టాంపుడ్యూటీని 2018లోనే తొలగించటం స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయి. గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నాం. పంచాయతీరాజ్ శాఖ నుంచి సర్పంచ్‌లకు పెండింగ్ ఉన్న నిధుల్లో ఏమీ లేవు. గ్రామపంచాయతీ భవనాలను పంచాయతీరాజ్ శాఖ ద్వారానే నిర్మిస్తున్నాం. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు రాష్ట్రప్రభుత్వమే నిధులు ఇస్తోంది" అని మంత్రి సీతక్క తెలిపారు.

## అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తయిన తర్వాతే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది

తగ్గుతాయని అంచనా వేశారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా బలగాలు తమ పోరాటాన్ని ఉద్ధృతం చేయడంతో.. టెహ్రాన్ ఇక ఎక్కువకాలం దాడులను తట్టుకోలేదని వ్యాఖ్యానించారు. తమ మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సరికొత్త నిబంధనలను ప్రకటించింది. అమెరికా మద్దతుతో జలసంధిలో అసురక్షిత మార్గంలో ప్రయాణిస్తోన్న నౌకలను ఆంక్షల జాబితాలో చేరుస్తామని వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇటీవల యూఎస్ నౌకలు, 8 ట్యాంకర్లపైన ఐఆర్‌జీసీ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ.. ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. మరోవైపు, అమెరికా కూడా టెహ్రాన్ నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. దాంతో జోర్డాన్‌లోని యూఎస్ స్థావరంపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ ఘటనలతో హర్మూజ్‌లో నౌకల రవాణా మరోసారి ప్రమాదంలో పడింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది. కాగా.. తాము ఇరాన్‌తో చర్చలు కోరుకోవడం లేదని, అయితే ఒప్పందం కుదుర్చుకునే అంశాన్ని మాత్రం పక్కనపెట్టలేదని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

హైదరాబాద్(జనంసాక్షి):గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈ-డ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలకు గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి, త్వరలో ఎన్నిక తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర అని తెలిపారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి. 347.47కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. మహిళలు రూ.12,171 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించాం. కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసింది. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుంది. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారని తెలిపారు.

## బ్రిక్స్ సదస్సుకు భారీ భద్రత

చేశారు.నగరంలోని కీలక ప్రాంతాల్లో నిఘా కోసం సుమారు 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వైమానిక ముప్పును ఎదుర్కొనేందుకు యాంటీ డ్రోన్ వ్యవస్థలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ సహా పలువురు దేశాధినేతలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ కాన్వాయ్‌ల రాకపోకల కోసం అధికారులు ప్రత్యేక మార్గాలను ఖరారు చేశారు.

**సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!**

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది. దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది ఈ సదస్సుకు మిగతా సభ్య దేశాల అగ్రనేతలు హాజరవుతుండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే.

## చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై హద్దులు ఉండాల్సిందే..:

నుంచి చిన్నారులను రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ ఈ పిటిషన్ వేసింది. సోషల్ మీడియా వినియోగించే విషయంలో మైనర్లకు తగిన రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. ఆటోమేటిక్‌గా కంటెంట్-ఫిల్టర్ చేసే వ్యవస్థలు ఉండాలని, వయసు ధ్రువీకరణను అమలు చేయడంలో ప్లాట్‌ఫామ్‌లు విఫలమవుతున్నాయని ఆ సంస్థ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. అల్గారిథమ్ ఆధారిత సిఫార్సులు యువతను లైంగిక వేధింపులకు గురిచేసే, వారికి వయసుకు మించిన కంటెంట్‌ను అందిస్తాయని పేర్కొంది. 18 ఏళ్లలోపు పిల్లలు తల్లిదండ్రులు లేక సంరక్షకుల అనుమతి లేకుండా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో నిమగ్నం కాకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరింది.

## స్పేస్ పరిశోధనల్లో కలిసిరండి

వర్చువల్‌గా ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దానిపై మనందరి బాధ్యత ఉమ్మడిదేనని మోదీ పేర్కొన్నారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని మోదీ ఆహ్వానించారు.' శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తికి స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత భూమిపై జీవన విధానాన్ని ప్రభావితం చేస్తోంది. వాతావరణ పరిస్థితుల అంచనా నుంచి పంటలు, సముద్రాలు, ప్రజల జీవనానికి సంబంధించిన అనేక అంశాల్లో అంతరిక్ష విజ్ఞానం కీలకంగా మారింది. అంతరిక్ష రంగంలో అవకాశాలు అపారమని, అదే సమయంలో బాధ్యత కూడా అందరిదే. కక్ష్యల్లో ఉపగ్రహాల సంఖ్య పెరుగుతున్న వేళ, సాంకేతికత మరింత శక్తిమంతంగా మారుతున్న సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. భారత్ అంతరిక్ష విధానం 'వసుధైవ కుటుంబకం' అనే భావనపై ఆధారపడి ఉంది. 'వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, వన్ ఫ్యూచర్' అనే స్ఫూర్తి ఇక భూగ్రహాన్ని దాటి అంతరిక్షానికి కూడా విస్తరించాలి. అంతరిక్షంలో లభించే శాస్త్రీయ సమాచారాన్ని పారదర్శకత, సమగ్రతతో మానవాళి ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలి' అని ప్రధాని మోదీ సూచించారు.

**రైతుల నుంచి మత్స్యకారుల వరకు ఇస్రో సేవలు**

భారత్ అంతరిక్ష ప్రయాణానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కేంద్రబిందువుగా ఉందని ప్రధాని తెలిపారు. అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యంతో పాటు తక్కువ వ్యయంతో విజయవంతమైన మిషన్లను నిర్వహిస్తూ ఇస్రో ప్రపంచ ప్రశంసలు అందుకుందని పేర్కొన్నారు. ఇస్రో సాంకేతికతలు కేవలం అంతరిక్ష పరిశోధనలకే పరిమితం కాలేదని అన్నారు. రైతులకు వ్యవసాయ సమాచారం, మత్స్యకారులకు సముద్ర సంబంధిత సమాచారం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్ వంటి అనేక రంగాలకు అవి ఉపయోగపడుతున్నాయని వివరించారు.

# రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులకే లబ్ది

మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు గూడెం మైపాల్ రెడ్డి, వెంకటేష్, ఎమ్మెల్సీ ఎల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ సత్యవతి రా థోడ్, జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మం చిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి పర్యటించిన సం దర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రం గారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల రెవెన్యూ ఫోర్త్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డికి చెందిన 'టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్' కంపెనీకి ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7 కోట్లకు కట్టబెట్టారని మండిపడ్డారు. విదేశీ పర్యటనలు, పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. "ది గ్రేట్ అనుముల రేవంత్ రెడ్డి.. తన సోదరుడు అనుముల జగదీశ్వర్ రెడ్డితో రూ.1000 కోట్ల పెట్టుబడులు తెప్పించుకున్నట్లు ప్రకటించారు. ఇలా జగదీశ్వర్ రెడ్డికి రూ.1000 కోట్లు, కొండల్ రెడ్డికి రూ.250 కోట్లు కట్టబెట్టడమేనా ప్రజాపాలన?" అని ఆయన నిలదీశారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏటీఎంగా మారిందని తరచూ విమర్శించే బీజేపీ నేతలు.. ఈ అన్నదమ్ముల దోపిడీపై ఎందుకు నోరు మెదపడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "తెలంగాణలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుంటే, దొంగను పట్టుకోవాల్సిన కేంద్ర హోంమంత్రి ఎక్కడ ఉన్నారు?" అని నిలదీశారు. ఈడీ, సీబీఐ లు ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. దొంగ రేవంత్ రెడ్డి, చీకటి బీజేపీ ఒకటై కలిసి ఆడుతున్న నాటకమని విమర్శించారు. దోచుకున్న డబ్బును దాచుకునేందుకు పొంగులేటి కూడా రాఘవ కన్స్ట్రక్షన్ పేరుతో దోచుకుంటున్నాడని ఆరోపించారు. ఇవన్నీ అడుగుతామని టిఆర్ఎస్ శాసనసభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారని దుయ్యబట్టారు. ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకున్నప్పుడు ప్రధాని మోదీని ప్రశ్నించే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వ్యవహారాలపై ఎందుకు స్పందించడం లేదని, సీబీఐ, ఈడీ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని నిలదీశారు.

ప్రశ్నల భయంతోనే సస్పెన్షన్..

సీఎం రేవంత్ రెడ్డిని చూసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా 'రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్' పేరుతో కొత్త వ్యాపారాలు ప్రారంభించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలను రాబోయే శాసనసభ సమావేశాల్లో తాము నిలదీస్తామనే భయంతోనే తమను సభ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినప్పటికీ తాము భయపడేది లేదని, ప్రభుత్వ అవినీతిని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

హైదారాబాద్(జనంసాక్షి):

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట్ భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళ్లు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు.కరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా..? కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రశ్నించారు. నీళ్లు ఉండి మోటార్లు నడపలేని చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నానన్నారు.

## నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో సర్వేశ్ సింగ్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగం పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా నూతన శకంలోకి అడుగుపెట్టిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో 2,000కు పైగా కంపెనీలతో సంపూర్ణమైన లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ ఉందని, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని తెలిపారు. అంతేకాకుండా అమెరికా వెలుపల అత్యధిక యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం కేవలం ఔషధ తయారీకే పరిమితం కాకుండా అధునాతన ఆర్ అండ్ డీ), గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల దిశగా దూసుకుపోతోందని చెప్పారు. గత రెండేళ్ల కాలంలో ఆమ్‌జెన్, ఎలీ లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, సనోఫీ, అలైన్ టెక్నాలజీ, జోయెటిస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' ద్వారా డ్రగ్ డిస్కవరీ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, క్లినికల్ రీసెర్చ్ మరియు అత్యాధునిక టెక్నాలజీల అనుసంధానానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఏర్పాటైన 75కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు తోడుగా, త్వరలోనే జీసీసీల సంఖ్యను 100కు చేరుస్తామని, దీనిద్వారా దాదాపు 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. అంతేకాకుండా భారత్ ఫ్యూచర్ సిటీలో 2,100 ఎకరాల లైఫ్ సైన్సెస్ జోన్, ప్రత్యేకంగా 100 ఎకరాల్లో బయోలాజిక్స్ హబ్‌తో పాటు 1బయో మోడల్ మౌలిక వసతులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంఎస్‌డీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి డిజిటల్ సామర్థ్యాలను విస్తరించేందుకు హైదరాబాద్‌లో విస్తారమైన ప్రతిభ, అత్యుత్తమ టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయని, అందుకే ఈ నగరాన్ని ఎంచుకున్నామని తెలిపారు. ఈ నూతన కేంద్రం ద్వారా డిజిటల్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ), ఇంజినీరింగ్ సాంకేతికతలతో ప్రపంచవ్యాప్తంగా మానవ మరియు




జంతు ఆరోగ్య రక్షణకు అవసరమైన పరిష్కారాలను అందిస్తామని సంస్థ స్పష్టం చేసింది. జీనోమ్ వ్యాలీతో పాటు ఐఐసీటీ, సీసీఎంబీ, నైపర్ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలు ఉండటం హైదరాబాద్‌కు మరింత బలాన్ని చేకూరుస్తోందని నేతలు వివరించారు.

## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి
# హైడ్రా వ్యతిరేకం కాదు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి



**హైదారాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

## అల్వాల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో
# అమావాస్య అన్నప్రసాద వితరణ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అల్వాల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై అన్నప్రసాదాన్ని భక్తులకు, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆహ్వానించిన అయిత సత్యం గుప్తాకు ఉప్పల శ్రీనివాస్ గుప్త ప్రత్యేక అభినందనలు తెలిపారు. అమావాస్య సందర్భంగా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని, సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం ఎంతో గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ గుప్త, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజినీకాంత్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఆర్య వైశ్య మహా సభ అధ్యక్షుడు రమేశ్, ఐవీఎఫ్ అల్వాల్ ప్రెసిడెంట్ నరేష్, గుప్త, వెంకటేష్ అల్వాల్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, నాయకులు, సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## 90 ఎంఎల్ వేసుకుని ఆ ఫేక్ అకౌంట్ సృష్టించారా?

- 'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని కాంగ్రెస్ సృష్టించింది
- రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం




**హైదారాబాద్, సెప్టెంబర్ 10(జనంసాక్షి) :** శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'సంధ్యా రావు' అనే ఎక్స్ ఐడీ చేసిన ట్వీట్ ను ప్రదర్శించడంపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలో ఒక నకిలీ ఖాతా ఆధారంగా సీఎం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, అసలు ఏ రాజకీయ పార్టీకైనా 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవి ఉంటుందా అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీకి కూడా అంతర్జాతీయ కార్యదర్శి అనే పదవి ఉండదని... సీపీఐ, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ ఏ పార్టీ చూసుకున్నా ఇలాంటి హోదా ఉండదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. అలాంటిది 'సంధ్యా రావు' అనే పేరుతో బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి అని రేవంత్ రెడ్డే కొత్త పదవిని సృష్టించారని దుయ్యబట్టారు. ఫేక్ ఐడీ పోస్టులను సృష్టించేటప్పుడు కాంగ్రెస్ నేతలు లేదా సీఎం ఏమైనా '90ఎంఎల్' వేసుకుని ఉన్నారా? అని ఘాటుగా ప్రశ్నించారు. ఈ డ్రామా వెనుక ఉన్న అసలు సూత్రధారి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. కాంగ్రెస్ ఐటీ సెల్ ద్వారానే 'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని సృష్టించి, దాంతో తప్పుడు పోస్టులు పెట్టించి, ఆపై అదే అంశంపై రేవంత్ రెడ్డే స్వయంగా సిట్ విచారణకు ఆదేశించడం విచిత్రంగా ఉందని ధ్వజమెత్తారు.

## అత్యంత బాధ్యతాయుతంగా
# పని చేస్తున్నారు

- తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# మరో 9 హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలు

**8 హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలు**

- అదనంగా 485 వెంటిలేటర్ల ఏర్పాటు
- వైద్య పరికరాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ
- శాసన మండలిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ హాస్పిటళ్లలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సేవలను మరింత విస్తరిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కొత్తగా 9 ఎంఆర్ఐ యంత్రాలు, 8 సీటీ స్కాన్ యంత్రాలను ప్రభుత్వ హాస్పిటళ్లలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అదనంగా 485 వెంటిలేటర్లను కూడా కొనుగోలు చేసి అవసరమైన హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గురువారం శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ హాస్పిటల్స్‌లో 9 ఎంఆర్ఐలు, 50 సీటీ స్కాన్ యంత్రాలు, 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియా, నిమ్స్, వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో ఎంఆర్ఐ సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. కొత్తగా నిజామాబాద్ జీజీహెచ్, సిద్ధిపేట జీజీహెచ్, సూర్యాపేట జీజీహెచ్, నల్గొండ జీజీహెచ్, మహబూబ్‌నగర్ జీజీహెచ్, నీలోఫర్ తదితర హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. గాంధీ, ఉస్మానియా హాస్పిటళ్లలో మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో, అక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ అదనపు ఎంఆర్ఐ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా 9 అత్యాధునిక టెక్నాలజీతో కూడిని 3టెస్లా ఎంఆర్ఐ యంత్రాలను కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం 50 ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయని, కొత్తగా మరో 8 హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రస్తుతం 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన చోట అదనంగా 485 వెంటిలేటర్లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. వైద్య పరికరాలను కొనుగోలు చేయడం మాత్రమే కాకుండా, అవి నిరంతరం పనిచేసేలా చూడటానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. వైద్య పరికరాల కొనుగోలు, సరఫరా, నిర్వహణకు సంబంధించిన వివరాలను పర్యవేక్షించేందుకు ఈ–ఉపకరణ్ అనే వెబ్ ఆధారిత పరికరాల జాబితా, నిర్వహణ వ్యవస్థను వినియోగిస్తున్నామని తెలిపారు. వైద్య పరికరాల పనితీరు, వర్కింగ్ కండీషన్, నిర్వహణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు టీజీఎంఎస్ఐడీసీలో ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. పీఎంయూ ద్వారా పరికరాలను క్రమం తప్పకుండా ఆడిట్ చేసి, వాటి పనితీరు, వర్కింగ్ కండీషన్, నిర్వహణ పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో సర్వీసింగ్, రిపేర్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రిపేర్లు తక్షణమే జరిగేలా. బయోమెడికల్ ఇంజనీర్లను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు.

### 1,500 మందికి పైగా టెక్నీషియన్ల నియామకం

వైద్య పరికరాలు నిరంతరం పనిచేయాలంటే శిక్షణ పొందిన టెక్నీషియన్లు కీలకమని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో గత రెండున్నరేళ్లలో 1,500 మందికి పైగా టెక్నీషియన్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించామని వెల్లడించారు. అవసరమైన చోట కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో టెక్నీషియన్లను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు.

# కరీంనగర్‌లో కల్తీకల్తీ

- ఆహార వ్యాపార సంస్థలపై ప్రత్యేక తనిఖీల్లో వెల్లడి
- కరీంనగర్ ఫుడ్ ఇన్స్పెక్టర్ రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో లైసెన్సులు రద్దు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లాలోని పలు ఆహార వ్యాపార సంస్థల పై కరీంనగర్ జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ రోహిత్ రెడ్డి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో గుర్తించిన వివరాల ప్రకారం.. బావుపేటలోని శ్రీ బాలాజీ మ్యాజిక్ మిఠాయి తయారీ సంస్థలో తయారయ్యే స్వీట్లు కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని పలు స్వీట్ షాపులు, బేకరీలకు సరఫరా చేయబడుతున్నాయి. తనిఖీల సందర్భంగా సంస్థలో తీవ్ర ఆహార భద్రతా, పరిశుభ్రత లోపాలు గుర్తించబడ్డాయి. తయారీ ప్రాంగణం అత్యంత అపరిశుభ్రంగా ఉండటంతో పాటు, పరిశుభ్రత ప్రమాణాలు పాటించబడటం లేదని గుర్తించారు. తనిఖీలో అత్యంత తీవ్రమైన ఉల్లంఘనగా, పాలతో తయారు చేయాల్సిన స్వీట్లను పాలు ఉపయోగించకుండా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అజ్మేరి కలాకండ్ను పాలకు బదులుగా మైదాతో తయారు చేస్తుండగా, మిల్క్ మైసూర్ పాక్ ను కూడా పాలు ఉపయోగించకుండా అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితుల్లో తయారు చేస్తున్నట్లు గుర్తించారు. సుమారు 40 కిలోల కల్తీ స్వీట్లు (అజ్మేరి కలాకండ్, మిల్క్ మైసూర్ పాక్)ను సంఘటనా స్థలంలోనే ధ్వంసం చేశారు. అదేవిధంగా, ఈ ఉత్పత్తుల తయారీని నిరోధించేందుకు సుమారు 1,300 కిలోల ముడి పదార్థాలు (మైదా, చక్కెర తదితరాలు)ను స్వాధీనం చేసుకున్నారు. ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించే ఈ ఉల్లంఘనలను దృష్టిలో ఉంచుకొని, ఆహార వ్యాపార సంస్థను వెంటనే మూసివేసి, ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం సంస్థ ఎఫ్ఎస్ఎస్ ఎఐ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను సస్పెండ్ చేయుటకు చర్యలు ప్రారంభించబడినవి.

కరీంనగర్‌లోని కూచిపూడి రెస్టారెంట్ వంటశాల అపరిశుభ్రంగా ఉండటం, ఆహార నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడాన్ని గుర్తించారు. అదనంగా, బట్టర్ నాన్ తయారీలో ఫ్యాట్ స్ప్రెడ్ వినియోగిస్తున్నట్లు గుర్తించగా, సంబంధిత ఆహార ప్రమాణాలు, లేబులింగ్ నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో నిర్ధారించేందుకు పరిశీలన చేపట్టబడింది. గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశిస్తూ, సంబంధిత ఆహార వ్యాపారికి ఇంప్రూవ్‌మెంట్ నోటీస్ జారీ చేయబడింది.

కరీంనగర్ గీతాభవన్ చౌరస్తాలోని ఫేమస్ హోటల్‌లో ఎటువంటి ఎఫ్ఎస్ఎస్ ఎఐ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించబడింది. దీంతో హోటల్‌ను వెంటనే మూసివేయడం జరిగింది. అవసరమైన ఎఫ్ఎస్ఎస్ ఎఐ లైసెన్స్ పొందిన అనంతరం మాత్రమే తిరిగి కార్యకలాపాలకు అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ గీతాభవన్ సమీపంలోని మతామ్ అల్ హబీబి అరేబియన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో పలు ఆహార భద్రతా ఉల్లంఘనలు గుర్తించబడ్డాయి. గతంలోనే ఆహార తయారీలో కృత్రిమ రంగులు ఉపయోగించవద్దని స్పష్టంగా సూచించినప్పటికీ, నిబంధనలను పాటించలేదు. వంటశాలలో బొద్దింకలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. సుమారు 8 కిలోల హాండీ రైస్ను సంఘటనా స్థలంలోనే పారవేయించారు. సంస్థ ఎఫ్ఎస్ఎస్ ఎఐ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు. సంబంధిత ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించబడినవి. ఆహార భద్రత శాఖ ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం అందించేందుకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తుందని ఫుడ్ ఇన్స్పెక్టర్ రోహిత్ రెడ్డి తెలిపారు.




# బయట బీఆర్ఎస్, సభ లోపల బీజేపీ..

- ఆ రెండు పార్టీలు సభలో అలజడి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** బయట బీఆర్ఎస్, సభ లోపల బీజేపీ గందరగోళం సృష్టిస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రెండు పార్టీలు సభా సమయాన్ని వృథా చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారాలు కనుగొనాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, రెండు పార్టీలు కుయుక్తులు పన్ని సభలో అలజడి సృష్టిస్తున్నాయి. ఇప్పటికే 3 రోజులు వృథా ప్రజా సమస్యలు కంటే ఫక్తు రాజకీయాలు చేసే యత్నం మానుకోవాలి. స్పీకర్‌పై జరిగిన అవమానంపై చర్చ జరపాలంటే బీఆర్ఎస్ చర్చించదు. 22ఏపై చర్చ జరపాలంటూ సభలో గందరగోళం సృష్టించేందుకు బీజేపీ యత్నిస్తోంది. ప్రతి ప్రజా సమస్యపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని తెలిపారు.

## రియల్టర్ ఆత్మహత్య

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, హోమ్ ల్యాండ్ సంస్థ అధినేత రామ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కందుకూరు మండలం నెదునూరు గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆయన బలవన్మరణం చెందారు. రామ్ రెడ్డి పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 280 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొందరు రాజకీయ నాయకుల నుంచి ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ ఒత్తిళ్లను తట్టుకోలేకే ఆయన ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చులో పడొద్దు

- అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవద్దు
- కుటుంబ సభ్యులతో ఆర్థిక విషయాలు పంచుకోవాలి
- సమస్యలుంటే అధికారులను సంప్రదించాలి
- పోలీసు సిబ్బందికి డిజిపి సివి ఆనంద్ సందేశం



**హైదారాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న పోలీసు సిబ్బంది ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు సిబ్బందిని ఉద్దేశించి గురు వారం నాడు ఆత్మహత్యలు వద్దు అంటూ... ఒక ప్రకటన విడుదల చేశారు. గత నాలుగు నెలల్లో తెలంగాణ పోలీసు శాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు తనను కలచివేశాయని తెలిపారు. యువ, మధ్య వయస్కులైన కానిస్టేబుళ్లు ఇటువంటి ఘటనలకు పాల్పడటం మరింత బాధాకరమన్నారు. ఈ ఘటనలపై జరిపిన విచారణలో ఆన్‌లైన్ బెట్టింగ్ మూలంగా అప్పులపాలవడమే ప్రధాన కారణంగా తేలిందని డీజీపీ పేర్కొన్నారు. కొందరు భూములు అమ్ముకోగా.. మరికొందరు స్నేహితులు, సహోద్యోగుల వద్ద అప్పులు చేశారని తెలిపారు. ఇంకొందరు అధిక వడ్డీకి డబ్బులు తీసుకున్నారని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల ఒత్తిడి కారణంగా ఆత్మహత్యే పరిష్కారమని భావించడం విషాదకరమన్నారు. తమ వద్ద తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వాలని అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని డీజీపీ తెలిపారు. ముఖ్యంగా తమ ఆర్థిక పరిస్థితి, అప్పుల వివరాలను జీవిత భాగస్వాములు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పక పోవడం సమస్యను మరింత తీవ్రం చేస్తోంద న్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే వాటిని దాచిపెట్టకుండా కుటుంబ సభ్యులతో పంచుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై శాఖ తరఫున ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని డీజీపీ తెలిపారు. బెట్టింగ్‌కు దూరంగా ఉండటంతోపాటు మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు ఉన్నతాధికారులను సంప్రదించి పరిష్కారం పొందాలని చెప్పారు.

### ఆత్మహత్యలు వద్దు అంటూ రూ.93 వేల మంది సిబ్బందికి విజ్ఞప్తి

ఆత్మహత్యలు వద్దు అంటూ...తెలంగాణ పోలీసు శాఖలోని 93,000 మంది సిబ్బందికి డీజీపీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం, డ్రగ్స్, గంజాయి తదితర సామాజిక దురలవాట్లకు కూడా దూరంగా ఉండాలని కోరారు. మీపై పూర్తిగా ఆధారపడి ఉన్న మీ కుటుంబాన్ని, మీ పిల్లల కు మీ తల్లిదండ్రులకు మీ ఆత్మహత్యతో బాధను మిగిల్చవద్దన్నారు.. మీరు లేక పోతే మీ కుటుంబం బాగోగులను ఎవరు చూస్తారని అంటూ దయచేసి ఆలోచించండి అని డీజీపీ సి.వి. ఆనంద్ పోలీసు సిబ్బందికి హత్య ఆత్మహత్యలు చేసుకోవద్దు ధైర్యంగా జీవించాలి... అంటూ సిబ్బందికి పిలుపునిచ్చారు.

## మంత్రాల నెపంతో
# మహిళ దారుణ హత్య

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** మంత్రాలు చేస్తున్నారనే అనుమానం ఓ మహిళ ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగతి లక్ష్మి (42)ను ఆమె మరిది అర్ధరాత్రి సమయంలో దారుణంగా నరికి హత్య చేసిన ఘటన కలకలం రేపింది. తాజాగా ఈ కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. గ్రామంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో లక్ష్మిపై దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతోనే ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దారుణంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, మంత్రాలపై ఉన్న అనుమానం, నిందితుల పాత్ర వంటి అంశాలపై ఆరా తీశారు. దర్యాప్తులో ఇద్దరిని నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి కేసుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించినట్లు భావిస్తున్న ఒక గొడ్డలితో పాటు సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులను కేసు దర్యాప్తులో కీలక ఆధారాలుగా పరిగణిస్తున్నారు. హత్య వెనుక మరేదైనా కారణం ఉందా? మంత్రాలపై ఉన్న అనుమానమే అసలు కారణమా? అనే కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మూఢనమ్మకాల కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం నెల్కి వెంకటాపూర్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. 42 ఏళ్ల లక్ష్మి దారుణ హత్యకు గురికావడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. తాజాగా ఇద్దరు నిందితుల అరెస్టుతో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నారు.

# పెద్దన్న ప్రజాస్వామ్యాన్ని డాలర్లతో వేలం వేస్తున్నాడా?

*గెలిపిస్తే ఐదు వేల డాలర్లు.. ఓటరుకు నగదు ఎర! ప్రజాస్వామ్య విలువలకు ప్రపంచానికి పాఠాలు చెప్పే అమెరికా.. తన ఎన్నికలనే డాలర్ల బేరసారంగా మార్చుకుంటుందా?*

సంపాదకీయం

ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజలు తమ ఆలోచనలు, ఆకాంక్షలు, అభిప్రాయాలు, భవిష్యత్తు ఆశయాలకు అనుగుణంగా పాలకులను ఎన్నుకునే పవిత్రమైన ప్రక్రియ. కానీ ఆ పవిత్ర ప్రక్రియను డాలర్లతో ముడిపెట్టి, ఓటరును పౌరుడిగా కాకుండా కొనుగోలు చేయగల వస్తువుగా చూడటం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే అమెరికాలో బహిరంగంగా కనిపించడం తీవ్ర ఆందోళన కలిగించే పరిణామం. రిపబ్లికన్ పార్టీ మధ్యంతర ఎన్నికల్లో గెలిస్తే ప్రతి వయోజన అమెరికన్‌కు ఐదు వేల డాలర్లు ఇస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ఈ నేపథ్యంలో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

దానికి 'ట్రంప్ డివిడెండ్' అనే ఆకర్షణీయమైన పేరు పెట్టవచ్చు. కానీ పేరు ఎంత ముద్దుగా ఉన్నా.. రాజకీయ సందేశం మాత్రం ప్రశ్నించకుండా ఉండలేనిది. 'మమ్మల్ని గెలిపించండి.. మీకు ఐదు వేల డాలర్లు ఇస్తాం' అంటే ప్రజాస్వామ్యమా? లేక ఓటుకు డాలర్ల ఎరా?

ఇదే ఇప్పుడు అమెరికా ముందున్న అసలు ప్రశ్న. ఓటరు తన దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలి. ప్రభుత్వ విధానాలను పరిశీలించాలి. అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేయాలి. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎవరు మెరుగైన మార్గం చూపగలరో నిర్ణయించాలి. కానీ ఈ మొత్తం ప్రక్రియను పక్కనపెట్టి.. 'గెలిస్తే మీ ఖాతాలో ఐదు వేల డాలర్లు' అనే ఆశ చూపితే, ఓటరు విచక్షణను ఏ స్థాయిలో గౌరవించినట్టు?

ఇంత భారీ మొత్తాన్ని ఎలా సమకూరుస్తారన్నది మరో కీలక ప్రశ్న. ఎవరు అర్హులు? ఎప్పుడు చెల్లిస్తారు? ప్రభుత్వానికి ఎంత భారం పడుతుంది? ఆర్థిక లోటుపై దాని ప్రభావం ఏమిటి? ఇప్పటికే భారీ ప్రభుత్వ రుణభారంతో ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ ఈ భారాన్ని ఎలా మోయగలదు? ఇలాంటి మౌలిక ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకుండానే ఎన్నికల వేదికపై భారీ నగదు హామీ ఇవ్వడం ఆర్థిక విధానమా? లేక రాజకీయ ఎత్తుగడా?

అమెరికాలో కోట్లాది మంది వయోజనులకు ఒక్కొక్కరికి ఐదు వేల డాలర్లు చెల్లించాలంటే ఖర్చు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉంది. టారిఫ్‌ల ద్వారా వచ్చిన ఆదాయంతో దీనిని సమకూర్చవచ్చన్న వాదన ఉన్నప్పటికీ, ఆ మొత్తంతో ఇంతటి భారీ చెల్లింపును పూర్తిగా భరించడం సాధ్యమేనా అన్నదానిపై ఆర్థిక నిపుణులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

అంటే.. డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు. కానీ ఓటు ఎటు రావాలో మాత్రం చెప్పేస్తున్నారు! ఇదే ఈ ప్రకటనలోని అత్యంత ప్రమాదకరమైన అంశం.

ప్రజల సొమ్మే కదా? ప్రభుత్వ ఖజానా ప్రజలదే కదా? మరి అదే ప్రజల డబ్బును చూపించి తిరిగి వారి ఓట్లను ఆకర్షించాలనుకోవడం ఏ ప్రజాస్వామ్య నీతి? ఎన్నికల సమయంలో సంక్షేమ పథకాలు ప్రకటించడం, ఆర్థిక విధానాలను వెల్లడించడం, ప్రజలకు ఉపశమనం కల్పిస్తామని హామీ ఇవ్వడం రాజకీయ ప్రక్రియలో భాగమే. కానీ 'మమ్మల్ని గెలిపిస్తే మీకు నగదు' అనే సందేశం మాత్రం మరో ప్రమాదకరమైన సరిహద్దును తాకుతోంది. ఎన్నికల తీర్పును విధానాలపై కాకుండా వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనంపై ఆధారపడేలా చేసే రాజకీయ సంస్కృతి బలపడితే ప్రజాస్వామ్యం క్రమంగా ఓట్ల మార్కెట్‌గా మారిపోతుంది.

అక్కడ ఓటరుకు విలువ ఉండదు.. ధర ఉంటుంది.
అభిప్రాయానికి విలువ ఉండదు.. ధర ఉంటుంది.
విచక్షణకు విలువ ఉండదు.. ధర ఉంటుంది.
చివరికి ఓటుకూ ఒక ధర నిర్ణయించబడుతుంది.
ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైన దశ.

ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఎన్నికల అవకతవకలు, ఓటర్ల ప్రలోభాలు, రాజకీయ అవినీతిపై అమెరికా తరచూ నైతిక ఉపన్యాసాలు ఇస్తుంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఇతర దేశాలకు సూచిస్తుంది. కానీ అదే 'పెద్దన్న' తన గడపలోనే ఓటరుకు డాలర్ల ఆశ చూపే రాజకీయ సంస్కృతిని ప్రోత్సహిస్తే, ఆ నైతిక ఆధిక్యం ఎక్కడ మిగులుతుంది ఇతరులకు ప్రజాస్వామ్య పాఠాలు చెప్పే పెద్దన్న.. తన ఓటరుకు డాలర్ల పాఠం చెబుతున్నాడా?

అమెరికా రాజకీయాల్లో డబ్బు ప్రభావం కొత్తది కాదు. ఎన్నికల ప్రచారాలకు అపారమైన నిధులు, సంపన్న వర్గాల ప్రభావం, కార్పొరేట్ శక్తుల పాత్రపై ఎన్నో దశాబ్దాలుగా చర్చ జరుగుతోంది. ఇప్పుడు సాధారణ ఓటరునే నేరుగా నగదు ప్రలోభంతో ఆకర్షించే ప్రయత్నాలు సాధారణ రాజకీయ ఆయుధాలుగా మారితే, అది ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలహీనపరుస్తుంది.

డబ్బున్న వ్యాపారవేత్త ఒకరు అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాలను కూడా వ్యాపార లావాదేవీగా చూడటం మొదలైతే పరిస్థితి మరింత ప్రమాదకరం. అధికారం పెట్టుబడిగా.. ఓటు రాబడిగా.. ప్రజలు వినియోగదారులుగా మారితే ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంటుంది?

ప్రజాస్వామ్యం అంటే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడం. రాజ్యాంగ విలువలను కాపాడటం. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి విలువలకు అండగా నిలవడం. కానీ ఓటరును డబ్బుతో ఆకర్షించగలమనే ఆలోచన బలపడితే, రాజకీయాలు ప్రజాసేవ నుంచి వ్యాపారంగా దిగజారే ప్రమాదం ఉంది.

అమెరికా ప్రపంచానికి పెద్దన్న కావచ్చు. ఆర్థికంగా, సైనికంగా, సాంకేతికంగా అగ్రస్థానంలో ఉండవచ్చు. కానీ ప్రజాస్వామ్యానికి పెద్దన్నగా నిలవాలంటే ముందుగా తన ఓటరును గౌరవించాలి.

ఓటరును కొనడం కాదు.. అతని విశ్వాసాన్ని గెలుచుకోవాలి.
డాలర్లను విసరడం కాదు.. విధానాలను చూపాలి.
నగదు హామీలు ఇవ్వడం కాదు.. మంచి పాలనకు హామీ ఇవ్వాలి.
ఎన్నికల గెలుపు కోసం ఖజానాను ఆశచూపే సాధనంగా మార్చడం మొదలైతే, అది ఒక్క పార్టీకి సంబంధించిన విషయం కాదు. రేపటి రాజకీయ సంస్కృతికి ప్రమాదకరమైన దారి.

ఈ రోజు ఐదు వేల డాలర్లు.. రేపు ఎంత? ఓటుకు ధర పెరుగుతూనే పోతే చివరికి ప్రజాస్వామ్యానికి ధర ఎంత?

ఎన్నికల్లో గెలవడానికి హామీలు ఇవ్వడం రాజకీయ వ్యూహం కావచ్చు. కానీ ప్రజల ఓటును నగదు ఆశతో ప్రభావితం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని అవమానించే చర్యగా మారకూడదు.


ప్రజాస్వామ్యం ఓట్ల లెక్క కాదు.. ప్రజల విశ్వాసం.

ఓటు కరెన్సీ కాదు.. ప్రజల సార్వభౌమాధికారం.

దానిని డాలర్లతో కొలవడం మొదలైతే.. ప్రజాస్వామ్య పతనం అక్కడి నుంచే మొదలవుతుంది. పెద్దన్నా.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతావా? లేక డాలర్లతో వేలం వేస్తావా? ఓటును కొనగలిగినవాడు ఎన్నికల్లో గెలవొచ్చు.. కానీ ఓటు విలువను డాలర్లతో కొలిచిన రోజు ప్రజాస్వామ్యం మాత్రం ఓడిపోతుంది.

# సత్యం కోసం పోరాటమా?

## సంజీవ్ భట్ కేసు లేవనెత్తుతున్న ప్రశ్నలు



ఒక వ్యక్తి జైలులో గడిపిన సంవత్సరాలను లెక్కించడం సులభం. కానీ ఆ సంవత్సరాల వెనుక ఉన్న కుటుంబ వేదనను, న్యాయం కోసం సాగుతున్న న్యాయపోరాటాన్ని, అధికార వ్యవస్థలపై ప్రజాస్వామ్యం ఉంచిన నమ్మకాన్ని కొలవడం అంత సులభం కాదు. మాజీ ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్ జైలులో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన కుమార్తె ఆకాశి భట్, కుమారుడు శంతను భట్ రాసిన బహిరంగ లేఖ ఈ ప్రశ్నలనే ముందుకు తెచ్చింది. అయితే ఈ భావోద్వేగపూరిత లేఖను చర్చించేటప్పుడు సంజీవ్ భట్‌పై నమోదైన కేసులు, కోర్టుల తీర్పులను కూడా విస్మరించలేం.

భట్ కుటుంబం దృష్టిలో ఆయన కథ అధికారాన్ని ప్రశ్నించిన ఒక పోలీసు అధికారి కథ. అధికారానికి అనుకూలంగా మౌనం వహించడం ద్వారా వ్యక్తిగత భద్రతను, కెరీర్‌ను కాపాడుకోవచ్చు; కానీ మనస్సాక్షికి విరుద్ధంగా జీవించకూడదని సంజీవ్ భట్ తమకు నేర్పారని వారు చెబుతున్నారు. ప్రశ్నించే స్వరాన్ని అణచివేయడం ఒక్క వ్యక్తిపై జరిగే దాడి మాత్రమే కాదని, మిగిలిన పౌరుల్లో భయాన్ని, నిస్సహాయతను పెంచడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచవచ్చని వారి వాదన.

ఈ వాదనలో ఒక ముఖ్యమైన ప్రజాస్వామ్య సత్యం ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే హక్కు, అధికారాన్ని ప్రశ్నించే హక్కు, న్యాయమైన విచారణ కోరే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రాథమికమైనవి. అదే సమయంలో ప్రజాస్వామ్యం అంటే ఎవరైనా అధికారంలో ఉన్నప్పుడు చేసిన చర్యలను విమర్శించకుండా ఉండటం కాదు. పోలీసు అధికారులపై కూడా చట్టం వర్తించాలి. నిందితుడికి న్యాయమైన విచారణ ఎంత ముఖ్యమో, బాధితుడికి న్యాయం జరగడం కూడా అంతే ముఖ్యమైనది.

సంజీవ్ భట్ విషయంలో ఈ రెండింటి మధ్య ఉన్న ఉద్రిక్తత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. 1990లో జామ్‌నగర్‌లో పోలీసు కస్టడీలో ఉన్న ప్రభుదాస్ వైష్ణాని మరణించిన కేసులో భట్‌కు 2019లో జీవిత ఖైదు విధించబడింది. గుజరాత్ హైకోర్టు కూడా ఆ శిక్షను సమర్థించింది. 2025 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఆయన బెయిల్, జీవిత ఖైదు నిలిపివేత అభ్యర్థనను తిరస్కరించినప్పటికీ, ఆయన అప్పీల్‌ను త్వరగా విచారించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆ దశలో చేసిన వ్యాఖ్యలు కేసు తుది మెరిట్‌పై తీర్పుగా పరిగణించరాదని కూడా స్పష్టం చేసింది.

మరో కేసులో 1996లో ఒక రాజస్థాన్ న్యాయవాదిని తప్పుడు మాదకద్రవ్యాల కేసులో ఇరికించేందుకు ఆధారాలు సృష్టించారనే ఆరోపణలపై భట్‌ను 2024లో పాలన్‌పూర్ కోర్టు దోషిగా తేల్చి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ శిక్ష జీవిత ఖైదు అనంతరం అమలయ్యేలా కోర్టు ఆదేశించింది. 2025 డిసెంబరులో ఈ 20 ఏళ్ల శిక్షను తాత్కాలికంగా నిలిపివేయాలన్న ఆయన అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది.

అయితే కథలో మరో ముఖ్యమైన కోణం కూడా ఉంది. 1997లో కస్టడీలో హింసించారనే మరో కేసులో భట్‌ను గుజరాత్ కోర్టు 2024లో నిర్దోషిగా విడుదల చేసింది. ప్రాసిక్యూషన్ ఆరోపణలను సందేహానికి అతీతంగా నిరూపించలేకపోయిందని, ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న భట్‌పై విచారణకు అవసరమైన అనుమతి కూడా పొందలేదని కోర్టు పేర్కొంది. అంటే భట్‌పై ఉన్న ప్రతి ఆరోపణను కోర్టులు ఒకే విధంగా అంగీకరించాయని చెప్పడం కూడా వాస్తవానికి సరిపోదు.

ఇక్కడే అసలు ప్రజాస్వామ్య ప్రశ్న మొదలవుతుంది. ఒక వ్యక్తి రాజకీయంగా వివాదాస్పదుడై ఉండవచ్చు. ఆయనపై తీవ్రమైన కేసులు ఉండవచ్చు. కోర్టులు కొన్ని కేసుల్లో దోషిగా తేల్చి ఉండవచ్చు. అయినప్పటికీ ఆయనకు రాజ్యాంగం కల్పించే న్యాయపరమైన హక్కులు తగ్గిపోవు. అదే సమయంలో ఆయనను విమర్శించేవారికి కూడా ఆయన చర్యలను ప్రశ్నించే హక్కు ఉంటుంది. వ్యక్తిని దేవుడిగా మార్చడం ఎంత ప్రమాదకరమో, అధికారంలో ఉన్న వ్యవస్థను తప్పులేనిదిగా చూడటం కూడా అంతే ప్రమాదకరం.

ఆకాశి, శంతను భట్‌ల లేఖలోని అత్యంత ముఖ్యమైన సందేశం ఈ సందర్భంలో వ్యక్తిగత విషాదాన్ని దాటి వెళ్తుంది. ప్రజాస్వామ్య సంస్థలు అధికారాన్ని నియంత్రించాల్సిన సమయంలో అవే అధికారానికి లోబడితే ఏమవుతుంది? న్యాయవ్యవస్థ చివరి రక్షణగా ఉండాల్సిన సమయంలో దానిపై ప్రజల నమ్మకం దెబ్బతింటే ఏమవుతుంది? పౌరులు అన్యాయాన్ని చూసి "మనకెందుకు?" అని మౌనంగా ఉండటం ప్రారంభిస్తే ప్రజాస్వామ్యం ఎంతకాలం నిలబడుతుంది?

ఈ ప్రశ్నలకు సమాధానం సంజీవ్ భట్ కేసు ఒక్కటే ఇవ్వదు. కానీ ఈ కేసు ఒక విషయాన్ని మాత్రం గుర్తు చేస్తుంది: చట్టబద్ధ పాలనలో శిక్ష కూడా చట్టం ప్రకారమే ఉండాలి, విచారణ కూడా న్యాయంగా జరగాలి, అధికార దుర్వినియోగంపై కూడా విచారణ జరగాలి. నిందితుడి హక్కులను కాపాడటం అంటే నేరాన్ని సమర్థించడం కాదు. అలాగే ఒక వ్యక్తి నేరారోపణలను ఎదుర్కొంటున్నాడనే కారణంతో అతని పౌర హక్కులను పూర్తిగా నిరాకరించడం కూడా ప్రజాస్వామ్యం కాదు.

ఎనిమిదేళ్ల జైలు జీవితం ఒక కుటుంబానికి ఎంతటి భారమో ఊహించడం కష్టం. అదే సమయంలో కోర్టుల తీర్పులను పక్కనపెట్టి సంజీవ్ భట్‌ను కేవలం "అధికారాన్ని ఎదిరించిన హీరో"గా చిత్రించడం కూడా పూర్తి చిత్రాన్ని ఇవ్వదు. నిజమైన ప్రజాస్వామ్య దృక్పథం రెండింటినీ ఒకేసారి చూడాలి–అధికార దుర్వినియోగంపై అప్రమత్తత, న్యాయ ప్రక్రియపై గౌరవం.

చివరికి సంజీవ్ భట్ కథ ఒక వ్యక్తి గురించి మాత్రమే కాదు. అధికారం ఎంత పెద్దదైనా అది చట్టానికి లోబడి ఉండాలా? నిందితుడు ఎంత వివాదాస్పదుడైనా అతనికి న్యాయం లభించాలా? సంస్థలు ప్రభుత్వానికి కాదు, రాజ్యాంగానికి జవాబుదారీగా ఉండాలా? ఈ ప్రశ్నలకు సమాధానం "అవును" అయితేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది.

ప్రజాస్వామ్యానికి నిజమైన పరీక్ష అధికారాన్ని ప్రశ్నించేవారిని మనం ఇష్టపడుతున్నామా లేదా అన్నది కాదు. మనకు నచ్చని వ్యక్తి హక్కులను కూడా మనం కాపాడగలమా అన్నదే అసలు పరీక్ష.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# అగ్రవర్ణ రాజకీయంలో దళిత-బహుజనులు పావులా?

అధికార-ప్రతిపక్షాల రాజకీయ దాహానికి దళిత-బహుజనులను ఎగదోసి బలిచేసే రాజకీయ సంస్కృతి తెలంగాణలో విపరీతంగా పెరుగుతోంది. అధికారం కోసం ఒక వర్గం, రాజకీయ మైలేజ్ కోసం మరో వర్గం బహుజనుల భావోద్వేగాలను ఉపయోగించుకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో బీసీ-ఎస్సీ-ఎస్టీలంత తమ విముక్తినీ పక్కన పెట్టీ అగ్రకుల నాయకుల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. పోలీసుల లాఠీ దెబ్బలు, కేసులు, అరెస్టులు ఎదుర్కొంటున్నారు.

నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో "నీళ్లు-నిధులు-నియామకాలు" నినాదంతో తెలంగాణ ఉద్యమం సాగింది. ఈ ఉద్యమంలో అణగారిన కులాల భావోద్వేగాలను కదిలించి వారిని పెద్దఎత్తున ఉద్యమంలోకి తీసుకువచ్చారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజ్యాధికారం మాత్రం ఆధిపత్య కులాల చేతుల్లోకి వెళ్ళింది. నేడు కూడా తమ అధికారాన్ని అగ్రకులాల మధ్య మార్పిడి చేసుకునేందుకు అదే ఎత్తుగడలు చేస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలు ఎన్నుకున్న ప్రతిపక్ష నాయకత్వం అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. ప్రతిపక్ష హోదా కేవలం రాజకీయ గుర్తింపు కాదు, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించే బాధ్యత. అదే సమయంలో అధికార పక్షం కూడా ప్రతిపక్షాలను విమర్శించడానికే పరిమితం కాకుండా, తన పాలనపై ప్రజలకు జవాబు చెప్పాలి. ఇందుకు భిన్నంగా అధికార వర్గం తన వెయ్యి రోజుల పాలనను విజయవంతమైన ప్రజాపాలనగా ప్రచారం చేసుకుంటే...ప్రతిపక్షం అదే పాలనను విఫల పాలనగా విమర్శిస్తూ ఇరువురు తమ పొలిటికల్ మైలేజ్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఇది అగ్రవర్ణ రాజకీయ వ్యూహంలో భాగం. ఈ వ్యూహంలో బీసీ ఎస్సీ ఎస్టీలు బలి పశువులు అవుతున్నారు.

**బీసీ ఎస్సీ ఎస్టీలకు శత్రువు ఎవరు?**

జనాభా దామాషా ప్రకారం భూమి ,సంపద, అధికారం దక్కడమే భారత రాజ్యాంగ సామాజిక న్యాయ సూత్రం. ఇదే బహుజనుల అసలైన సమస్య. కానీ తెలంగాణలో పది శాతం లేని అగ్రకుల అధికార-ప్రతిపక్ష పార్టీల రాజకీయ పోరులో 90 శాతం బీసీ-ఎస్సీ-ఎస్టీలను భావోద్వేగాలతో ఎగదోస్తూ వారి అసలు సమస్యలను ప్రస్తావించకుండా చేస్తున్నారు. ప్రస్తుత అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యల కంటే అధికార-ప్రతిపక్షాల నాయకుల ఆధిపత్య పోరు, పరస్పర ఆరోపణలు-వాగ్వాదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో బీసీ-ఎస్సీ-ఎస్టీలు భావోద్వేగాలకు లోనై, నాయకుల రాజకీయ ప్రయోజనాలకు పావులుగా మారుతున్నారు. ఇటీవల అధికార పార్టీ దళిత మాదిగ కార్యకర్తలను కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పంపి చావు డప్పు కొట్టిస్తే, బీఆర్ఎస్ నాయకులు వారు వెళ్లిన దారిని పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఇక్కడ దళితుల్ని ఫామ్ హౌస్ కు పంపింది అగ్రకులమే, అవమానించింది కూడా అదే అగ్రకులం. అదేవిధంగా అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను తల్లిని అవమానించింది ఇద్దరు బిఆర్ఎస్ అగ్రకుల ప్రజా ప్రతినిధులే. సమసమాజం గురించి మాట్లాడిన కమ్యూనిస్టు నక్సలైట్ ఉద్యమం సైతం అగ్రకుల నాయకత్వంలో నడిచి, బీసీ ఎస్సీ ఎస్టిలను దారి తప్పించారు. ఈ విధంగా మన తాతను, తండ్రిని, ఇప్పుడు మనల్ని కులం పేరుతో అవమానించి అణిచివేసినా.. అదే ఆధిపత్య శక్తుల పక్కన చేరి మనం వారిని అందలం ఎక్కించడానికి పోరాటం చేస్తున్నాం. అసలు బీసీ ఎస్సీ ఎస్టీలు తమ అవమానానికి, అణచివేతకు శత్రువు ఎవరో నిజంగా గుర్తించారా? అనే ప్రశ్నను వేసుకోవాల్సిన సందర్భం ఇది.

**అధికారం కోసం ఆత్మగౌరవంగా ఉద్యమించాలి.**


చారిత్రకంగా అణిచివేతకు గురైన దళిత-బహుజనలది పోరాటాల చరిత్ర. తమ హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం, విద్య కోసం, సామాజిక సమానత్వం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. అయితే ఆ పోరాట శక్తిని స్వశక్తి, స్వధర్మ రాజకీయ చైతన్యంగా మలచాల్సిన చోట భావజాల స్పష్టత కోల్పోయి, అగ్రవర్ణ రాజకీయ ప్రేరేపణలకు, ప్రలోభాలకు లోనైతే అసలు బహుజన విముక్తి దారి తప్పుతుంది. ఇప్పటివరకు అదే జరిగింది. అగ్రకుల నాయకులు బీసీ-ఎస్సీ-ఎస్టీల సమస్యల గురించి మాట్లాడినా సామాజిక న్యాయం జరగదు. నిజమైన నాయకులుగా ఎదగనివ్వరు. పావులుగా కాదు.. పాలకులుగా ఎదగాలి. అడిగే స్థాయి నుంచి ఆదేశించే స్థాయికి రావాలి. ఇదే భారత రాజ్యాంగ అంబేద్కర్ సూత్రం. ఈ క్రమంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో తెలంగాణ గడ్డపై భూమి, బడ్జెట్, ఉద్యోగాల్లో, పరిశ్రమల్లో, రాజకీయంలో 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం దక్కాలనే మహాపోరాటం కొనసాగుతుంది. ఇది పూలే, అంబేద్కర్, కాన్సిరాం ఉద్యమానికి కొనసాగింపు. అంబేద్కర్ చెప్పిన "బోధించు-సమీకరించు-పోరాడు" అనే నినాదం మన విముక్తి-ఆత్మగౌరవం-అధికారం కోసం ఇచ్చిన మహాపిలుపు. కావున మన హక్కులు, అధికారం కోసం 90శాతం బీసీ-ఎస్సీ-ఎస్టీలు అగ్రవర్ణాల జెండా, ఎజెండాలకు బలికాకుండా, తమ హక్కులు-వాటా-అధికారం కోసం ఐక్యంగా నిలబడాలి.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

## తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు

# మల్లు స్వరాజ్యం






*నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్య నూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగి పోయింది. 'బాంచెన్ దొరా ... నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారు ల అరాచకాలను అంతమొందించారు. వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందాయి. పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. కాని ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరులు కావడం కడు విషాదకరం.*

తెలంగాణ సాయుధ పోరాటయోధులలో ఒకరుగా నిలిచిన మల్లు స్వరాజ్యం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని (ప్రస్తుత సూర్యాపేట జిల్లా) తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం గ్రామంలో వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో భీంరెడ్డి రాంరెడ్డి, చొక్కమ్మ దంపతులకు 1931వ సంవత్సరంలో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో 'స్వరాజ్' అనే నినాదం పట్ల ఆమె తల్లిదండ్రులు ఎంతగానో ప్రభావితులై ఆ స్వరాజ్యోద్యమ కాలాన్ని గుర్తుచేసే విధంగా ఆమెకు 'స్వరాజ్యం' అని పేరు పెట్టడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు.

మల్లు స్వరాజ్యం భూస్వామ్య కుటుంబంలో జన్మించినను ఆలోచనలు, ఆశయాలు మాత్రం సమ సమాజం వైపుగా పయనింపజేశాయి. ఆమె తన సోదరుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి (బి.ఎన్.రెడ్డి) అడుగుజాడల్లో నడిచి క్రమంగా ఆమె తెలంగాణ సాయుధ పోరుబాట దిశగా ముందుకు సాగారు. స్థానిక భూస్వామ్యుల, జమీందారుల నిరంకుశత్వానికి, వెట్టిచాకిరి విధానానికి వ్యతిరేకంగా మరియు రజాకారుల అరాచకాలకు, ఆకృత్యాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం పదమూడేళ్లకే తుపాకీ పట్టి 'తెలంగాణ ఉద్యమానికి సాయుధ దన్ను'గా నిలిచి ఉద్యమించారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో భాగంగా మల్లు స్వరాజ్యం మహిళ కమాండర్ గాను ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలలో ఉద్యమాలు నిర్వహించారు. 1947 లో రజాకార్లు తన ఇంటిని తగులబెట్టిననూ, నిజాం ప్రభుత్వం తనని పట్టించిన వారికి పదివేల రూపాయల జరిమానాని ప్రకటించిననూ ఏమాత్రం అధైర్యపడకుండా మరింతగా ముందుకు సాగి తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె ఒక వ్యక్తిగా కాకుండా 'ప్రజాశక్తి'గా ప్రజ్వలించి చివరి దశ వరకు వీరోచిత పోరాటం సాగించారు.



భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) తరపున ఉమ్మడి నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నుంచి మల్లు స్వరాజ్యం రెండు పర్యాయాలు (1978-1983 నుంచి 1983-1984) శాసన సభ్యురాలుగా కొనసాగారు. కార్మిక - కర్షక సమస్యలపై ఆమె ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి ఆయా సమస్యల పరిష్కారాల దిశగా ఉద్యమించారు.

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ( ఐద్వా) లో రాష్ట్ర మరియు జాతీయ స్థాయి నాయకురాలిగా మల్లు స్వరాజ్యం అనేక మహిళా సమస్యల పరిష్కారాల కోసం అహర్నిషలు ఉద్యమించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన మద్యపాన నిషేధ వ్యతిరేక పోరాటంలోనూ ఆమె క్రియాశీలంగా ఉద్యమించారు. 'నా మాటే తుపాకీ తూటా' అన్న పేరుతో మల్లు స్వరాజ్యం ఆత్మకథ వెలువడి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం నిర్వహించిన పాత్ర చారిత్రాత్మకంగా నిలిచింది. అంతేగాకుండా అనేక ప్రజా



పోరాటాల్లో ఆమె నడుం బిగించి కష్టజీవుల అభ్యున్నతి కోసం అహర్నిశలు ఉద్యమించారు. పీడిత ప్రజానీకానికి పోరాట స్ఫూర్తిని రగిలించిన మల్లు స్వరాజ్యం తన 91 సంవత్సరాల వయసులో 2022, మార్చి 19 నాడు మరణించారు. 'దాదాపు ఎనిమిది దశాబ్దాల పాటు ఎర్రజెండాతో మమేకమైన మల్లు స్వరాజ్యం జీవితం కడవరకు పోరాట స్ఫూర్తితో ఉద్యమించడం ఎందరికో చెరగని పోరాట స్ఫూర్తిని రగిలిస్తూనే ఉంది.

( తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా )



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690



## జిల్లా కలెక్టర్ ను కలిసిన ట్రేసా బృందం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి)** నూతనంగా ఎన్నికైన ట్రేసా బృందం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు అనంతరం జిల్లా కలెక్టర్ ను శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ట్రేసా రాష్ట్ర అధ్యక్షులు గౌతంకుమార్ ప్రధాన కార్యదర్శి రామన్ రెడ్డి చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగమణి ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు సంయుక్త కార్యదర్శి కృష్ణయ్య జిల్లా అధ్యక్షులు జనార్దన్ తాహాసిల్దారులు నాగయ్య అన్వర్ సైదులు డిప్యూటీ తాహాసిల్దారు జంగయ్య ప్రియాంక ట్రేసా కార్యవర్గ సభ్యులు సరిత విక్రంరెడ్డి పాండు నవీన్ శ్రీనయ్య సురేష్ నవీన్ ఉదయ్ పాల్గొన్నారు.

## హిట్ అండ్ రన్

### ఉదయపు నడకకు వెళ్లిన వ్యక్తిని ఢీకొన్న వాహనం.. మృతి

**అంబర్‌పేట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి)** : ఉదయపు నడకకు వెళ్లిన ఓ వృద్ధుడిని వేగంగా వచ్చిన వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీరమణ చౌరస్తా వద్ద కురుమబస్తీ, అంబర్‌పేటకు చెందిన బి. అనంతయ్య (82) ఉదయపు నడకకు వెళ్లగా, వేగంగా వచ్చిన బయోలాజికల్ కంపెనీకి చెందిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనంతయ్య కాలికి తీవ్ర గాయమై, అధిక రక్తస్రావం జరిగింది. వెంటనే అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వాహన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.



## కూల్చివేతలంటూ ప్రకటనలు.. ఇక్కడెందుకు మౌనం?

- అక్రమ నిర్మాణాలకు కొమ్ముగాస్తున్న అధికారులు...!?
- ప్రభుపాద లేఔట్‌లో వెలుగు చూస్తున్న భారీ అక్రమం
- అధికారుల చర్యలు శూన్యమంటూ స్థానికుల ఆగ్రహం

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజు అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ పేరుతో సిఎంసి ఎన్ఫోర్స్మెంట్ విభాగం అధికారులు విస్తృత తనిఖీలు మూడు జోన్ల పరిధిలో పలు కూల్చివేతలను చేపడుతున్నప్పటికీ... అక్కడక్కడ చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లు, కనబరుస్తున్న ఉదాసీన వైఖరి సిఎంసి అధికారుల చిత్తశుద్ధిపై అనేక అనుమానాలను రేకెత్తిస్తుంది. ప్రభుత్వమైనా, పాలనాపరమైన యంత్రాంగమైనా కాలం గడుస్తున్న కొద్దీ పొందుతున్న అనుభవాల నుంచి తప్పులను సవరించుకొని ఉన్నతమైన పరిపాలన వైపు అడుగులేయడం అందరికీ ఆమోదయోగ్యం. అయితే శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో అనాదిగా నాటుకున్న అవినీతి మరకలు ఇంకా అధికారులను వదలిపోవడం లేదో... లేక శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో విధినిర్వహణకు వచ్చే అధికారులకు అది వంట పడుతుందో తెలియదు కానీ... కాలగమనంలో ఎన్నో పరిణామాలను అందిపుచ్చుకున్న శేరిలింగంపల్లి అధికార గణంమాత్రం తమ ఆలోచన ధోరణిని, వక్రబుద్ధిని మార్చుకోకపోవడం సర్వత్ర విమర్శలకు ఊతమిస్తోంది.

**ప్రభుపాద లేఅవుట్‌లో 2 వేల గజాల అక్రమం మాటేమిటి...?**

శేరిలింగంపల్లి డివిజన్ పరిధి ప్రభుపాద లేఅవుట్ లో నిబంధనలకు విరుద్ధంగా లేఔట్ ప్రధాన రహదారిని ఆక్రమించిమరీ దాదాపు 2 వేల గజాల పరిధిలో ఓ భారీ అక్రమ షెడ్డు రూపుదిద్దుకుంటుంది. ఏ రకంగా కొలిచి చూసుకున్నా, నిబంధనలను అన్వయించి చూసినా ఆ అక్రమ షెడ్డు కు ఒక్క అనుమతి లభించే పరిస్థితి లేదు. అయినా సరే నెలల తరబడి సదరు నిర్మాణం యదేచ్ఛగా కొనసాగుతున్నా శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, శేరిలింగంపల్లి జోన్ అధికారులు చివరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సైతం సదరు నిర్మాణంపై కనీస పర్యవేక్షణ నిర్వహించిన దాఖలాలు కనిపించకపోవడం తీవ్ర అనుమానాలను రేకెత్తిస్తోంది. ఒకటి కాదు రెండు కాదు దాదాపు 2 వేల గజాల స్థలంలో భారీ నిర్మాణం చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఎందుకు అధికారులు దాని విషయంలో చర్యలు తీసుకోవడం లేదని స్థానికులనుండి వస్తున్న ప్రశ్నలకు సంబంధిత అధికారుల వద్ద కనీస సమాధానం లేకపోగా మరోవైపు సామాన్యుడు, నిరుపేద కొద్దిపాటి స్థలాన్ని ఆక్రమించి చిన్న గుడిసె వేసుకున్నా ఆగ మేఘాల మీద బయలుదేరి వచ్చి దానిని పీకి పారేసి జబ్బలు సరుచుకోవడం ఎన్నో సందర్భాలలో జరిగిన విషయం విధితమే.





**అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తారా లేదా... స్థానికుల డిమాండ్**

శేరిలింగంపల్లి డివిజన్ పరిధి ప్రభుపాద లేఅవుట్ లో గత కొంతకాలంగా పురుడు పోసుకుని ప్రస్తుతం తుదిమెరుగులు దిద్దుకుంటున్న 2 వేల గజాల భారీ అక్రమ షెడ్డు ను ఇకనైనా తొలగిస్తారా లేదా అంటూ ప్రభుపాద లేఅవుట్ వాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజనను మీడియా ద్వారా ప్రశ్నిస్తున్నారు. 100 గజాలకే అల్లకల్లోలం చేసే సీఎంసి అధికారులు ఏకంగా 2 వేల గజాల స్థలంలో అక్రమ షెడ్డును ఓ వ్యక్తి దర్జాగా నిర్మించగలుగుతున్నాడు అంటే అతని వెనుక ఉన్న ధైర్యం రాజకీయ పలుకుబడియా, లేక సిఎంసి అధికారుల అండదండలా నిజాలు నిగ్గు తేలాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాజికవేత్తలు, డివిజన్ ప్రజలు నిలదీస్తున్నారు. నిత్యం అక్రమ నిర్మాణాల పేరుతో శేరిలింగంపల్లి ని వడపోస్తున్న అధికారులకు మరి ప్రభుపాద లేఅవుట్ ఎందుకు కనిపించడం లేదని దుయ్యబడుతున్నారు. తక్షణమే స్పందించి అధికారులు సదరు అక్రమ నిర్మాణాన్ని తొలగించకుంటే త్వరలోనే తీవ్రస్థాయి ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తామని పలువురు ట్రేడ్ యూనియన్ నాయకులు స్పష్టం చేస్తున్నారు.



## రిజిస్ట్రేషన్, జిపిఆర్ నిబంధనల్లో సడలింపులు కల్పించాలి

### క్వారీస్ పరిశ్రమ సమస్యలపై మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన ఎమ్మెల్యే బీఎంఆర్

**తాండూరు సెప్టెంబర్ 10(జనంసాక్షి)** రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, తాండూరు క్వారీస్ పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తాండూరు క్వారీ స్టోన్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే బీఎంఆర్‌తో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. క్వారీస్ పరిశ్రమలో వాహనాల రిజిస్ట్రేషన్, జిపిఆర్ నిబంధనల్లో సడలింపులు కల్పించాలి. స్లాబ్ రాయితీని అమలు చేయడంతో పాటు రాయల్టీ రేట్లను తగ్గించాలి. తాండూరు ప్రాంత క్వారీస్ పరిశ్రమను దృష్టిలో ఉంచుకుని మేజర్ మినరల్ నుంచి మైనర్ మినరల్‌గా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాండూరు క్వారీస్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, వ్యాపారులు, అనుబంధ వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బీఎంఆర్ మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి క్వారీస్ పరిశ్రమ సమస్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులతో అతిత్వరలో చర్చించి, సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

## వైద్యం వికటించి వ్యక్తి మృతి

### శవంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన

**శంకర్ పల్లి, సెప్టెంబర్ 10 (జనం సాక్షి)**




వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన నరేష్ గౌడ్(40) గురువారం ఉదయం చాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్నేహితులు చికిత్స నిమిత్తం శంకర్ పల్లి లోని శ్రీ ఐరా ఆసుపత్రికి తరలించారు. కాగా వైద్యులు రెండు గంటల పాటు వైద్యం చేశారు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు నరేష్ గౌడ్ ను గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ఆయనను పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. దీంతో కుటుంబీకులు బంధువులు మృతదేహాన్ని శంకర్ పల్లి ఆస్పత్రి వద్దకు తిరిగి తీసుకొచ్చి ఆసుపత్రి ఎదుట శవంతో ఆందోళన నిర్వహించారు. సరైన వైద్యం అందకపోవడంతోనే నరేష్ గౌడ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు స్నేహితులు ఆరోపించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు అయితే మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని ఆసుపత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న శంకర్ పల్లి పోలీసులు ఆసుపత్రి వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

## నేడు మేడ్చల్ జిల్లాలో తెలంగాణ ఆహార కమిషన్ పర్యటన

### కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్, సభ్యులు నేడు శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లాలోని రేషన్ దుకాణాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, జాతీయ ఆహార భద్రతా చట్టం--2013 అమలు తీరును పరిశీలించనున్నారు. అలాగే ఎంసిహెచ్ కిట్ పంపిణీ, జాతీయ ఆహార భద్రతా చట్టం సెక్షన్ 4(బి) కింద ప్రసూతి ప్రయోజనాల అమలు తదితర అంశాలను సమీక్షించనున్నారు. పర్యటన సందర్భంగా ప్రజలు తమకు ఉన్న సమస్యలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను ఆహార కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు. అనంతరం అదే రోజు మేడ్చల్--మల్కాజిగిరి సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయం లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు అవసరమైన సమాచారం, నివేదికలు, రికార్డులతో పర్యటన, సమీక్షా సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## లగచెర్ల సురేష్ అరెస్టు

### రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**కొడంగల్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** భారత రాష్ట్ర సమితి దుద్యాల మండల యువజన విభాగం అధ్యక్షుడు లగచెర్ల సురేష్‌ను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేసి రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి వెంటనే స్పందించారు. తన అనుచరులు, పార్టీ నాయకులతో కలిసి రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా లగచెర్ల సురేష్‌ను అరెస్టు చేసిన కారణాలు, ఆయనపై నమోదైన కేసుల వివరాలు, పోలీసుల చర్యలకు సంబంధించిన అంశాలపై నరేందర్ రెడ్డి పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సురేష్‌కు అండగా నిలిచేందుకు ఆయన పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, నరేందర్ రెడ్డి అనుచరులు తదితరులు పాల్గొన్నారు

## గిరిజనులకు ఇంటి స్థలం.. రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్ రాములు



**బొంరాస్‌పేట, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** మండల పరిధిలోని ఊరేనికి తండాలో ఇటీవల ఫారెస్ట్ అధికారులు గిరిజనులకు చెందిన ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసిన ఘటనా స్థలాన్ని గురువారం సిపిఎం రాష్ట్ర,జిల్లా కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ అక్రమంగా ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసిన కొడంగల్ ఫారెస్ట్ ఎఫ్ఆర్ఓ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, గిరిజనులకు ఇంటి స్థలం రూ. 50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఫారెస్ట్ రెవిన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి గిరిజనులకు పట్టాలు అందజేయాలని, లేనిపక్షంలో వారికి మద్దతుగా పోరాటాలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ ఈ పాలకులు 2006 ఫారెస్ట్ అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా ఎలాంటి సమాచారం నోటీసు ఇవ్వకుండా పోలీసు బలగాలు పెట్టి గిరిజనులను నిర్బంధించి ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా ఫారెస్ట్ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉప్పలి మల్కయ్య, రాములు నాయక్ ,రవి నాయక్, సుశీల బాయి, విజయ్, చందు,ముఖేష్,రుక్కి బాయి, రమేష్, యాదయ్య, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ తైక్వాండో పోటీలకు సిఆర్‌పిఎఫ్ స్కూల్ విద్యార్థి



**జవహర్‌నగర్, సెప్టెంబర్ 10: (జనంసాక్షి) :** సిఆర్‌పిఎఫ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఆదిత్య కుష్వాహ్ తక్వాండో క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థికి అభినందన సభ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి. అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు తమ పాఠశాల యాజమాన్యం నిరంతరం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. తమ పాఠశాల నుంచి ఇప్పటికే ఎంతో మంది విద్యార్థులు క్రీడా రంగంలో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ ఆదిత్య కుష్వాహ్ ఈ నెల 19వ తేదీ నుంచి హర్యానా రాష్ట్రంలోని పానిపట్‌లో జరిగే సీబీ ఎస్ ఇ జాతీయ స్థాయి తక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఆదిత్య మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరీశంకర్, హెచ్‌ఎం ఆశా జి. కుమార్, ఉపాధ్యాయులు కిషోర్, గోపాలకృష్ణ, నూర్జహాన్, పీఈటీలు భాస్కర్‌రెడ్డి, మన్మథరావు తదితరులు పాల్గొని విద్యార్థి ఆదిత్యను అభినందించారు.

## భక్తుల భద్రతకు పెద్దపీట

### గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై ఎంఎంసి కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి)**



గణేష్ నిమజ్జనాన్ని సురక్షితంగా, సజావుగా, పర్యావరణహితంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఎంఎంసీ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శామీర్‌పేట్ లేక్, సఫిల్‌గూడ, బండ చెరువు బేబీ పాండ్లతో పాటు మౌలాలి సర్కిల్ పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో శిక్షణ పొందిన ఈతగాళ్లు, వైద్య బృందాలు, అంబులెన్సులు, క్రేన్లు, సహాయక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అప్రోచ్ రోడ్లు, లైటింగ్, ట్రాఫిక్ సైన్‌బోర్డులు, పారిశుద్ధ్య ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు. సఫిల్‌గూడ, బండ చెరువు బేబీ పాండ్లలో చిన్న విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని, పెద్ద విగ్రహాలను నిర్దేశిత ప్రధాన నిమజ్జన ప్రాంతాలకు మళ్లించాలని ఆదేశించారు. బేబీ పాండ్లలో పూడిక తొలగించి, శుభ్రపరిచి తాజా నీటితో నింపాలని సూచించారు. నిమజ్జనం అనంతరం పూలు, ఇతర సేంద్రియ పూజా సామగ్రిని ప్రత్యేకంగా సేకరించి, సహజ ఎరువుగా ప్రాసెస్ చేయాలని, ఇతర వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. పోలీసు, ఇతర శాఖల సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి భక్తుల భద్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.



## టీజీఎస్ ఆర్టీసీకి అవార్డుల పంట

**హైదరాబాద్** : సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన 40వ వార్షిక కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ సెప్టెంబర్ 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని హోటల్ మేరీగోల్డ్‌లో ఘనంగా ముగిసింది. ఈ రెండు రోజుల సదస్సులో వివిధ సంస్థల నుండి 200 కంటే ఎక్కువ బృందాలు పాల్గొని నాణ్యతా ప్రమాణాల పెంపు, పని ప్రదేశంలో వినూత్న మార్పులు, ఉత్పాదకత పెరుగుదల , అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించాయి. ఈ కన్వెన్షన్‌లో టీజీఎస్ ఆర్టీసీ ఉప్పల్ జోనల్ వర్క్‌షాప్ నుండి పాల్గొన్న 4 బృందాలు విశేష ప్రతిభ కనబరిచాయి. నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా వ్యయ నియంత్రణ (కాస్ట్ కంట్రోల్) పై టీజీఎస్ ఆర్టీసీ అవలంబిస్తున్న ఉత్తమ విధానాలను ప్రదర్శించి, 4 బృందాలు ప్రతిష్టాత్మక గోల్డ్ అవార్డులను గెలుచుకున్నాయి.

## బొరబండలో విషాద ఘటన

**అమీర్పేట్/బొరబండ (జనంసాక్షి):** భవనం పై నుంచి పడటంతో రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ, ఇంటికే పరిమితమైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన బొరబండలో చోటుచేసుకుంది. బొరబండ రాజ్‌నగర్‌కు చెందిన బొరుల్ల దుర్గాప్రసాద్ (22) పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అతని తండ్రి బి. బాలరాజ్ (50) రెండేళ్ల క్రితం భవనం పై నుంచి పడిపోవడంతో పక్షవాతానికి గురయ్యాడు. అప్పటి నుంచి ఇంటికే పరిమితమై జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో పాటు జీవితంపై విరక్తి చెందడంతో తరచూ చనిపోవాలని కుటుంబ సభ్యులతో చెబుతుండేవాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 9న రాత్రి సుమారు 11 గంటల సమయంలో దుర్గాప్రసాద్ నిద్రిస్తున్న సమయంలో పెద్దగా కేకలు వినిపించాయి. వెంటనే ప్రార్థనా గదిలోకి వెళ్లి చూడగా.. బాలరాజ్ తన ఒంటిపై టర్పెంటైన్ ఆయిల్ పోసుకుని, వెలిగించిన దీపం వద్దకు కుడి చేతిని తీసుకెళ్లడంతో మంటలు అంటుకున్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు వెంటనే మంటలను ఆర్పివేసి తీవ్ర కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

## అంబులెన్స్‌లో అత్యవసర వైద్యం

### తాపీ మేస్త్రి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



**కీసర, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడిన తాపీ మేస్త్రికి కీసర 108 సిబ్బంది సకాలంలో అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన నాగారం నేతాజీనగర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. కాలనీలో ఓ ఇంటికి తాపీ పనులు చేస్తున్న బ్రహ్మయ్య రెండో అంతస్తు నుంచి జారిపడటంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో ఆయన స్పృహ కోల్పోయి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న కీసర 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈఎంటీ చిత్రం రవి సమయస్ఫూర్తితో బ్రహ్మయ్యకు అత్యవసర వైద్యం అందించారు. ఆక్సిజన్ అందించడంతో పాటు, గ్లూకోజ్ ద్రవాలు ఎక్కించారు. రక్తస్రావాన్ని అరికట్టి, మెడ కదలకుండా సీ--కాలర్, విరిగిన చేతికి స్ప్లింట్ అమర్చారు. అనంతరం సకాలంలో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. బ్రహ్మయ్య ప్రాణాలు కాపాడటంలో కీలకపాత్ర పోషించిన ఈఎంటీ చిత్రం రవి, పైలట్ వరప్రసాద్‌లను ఆస్పత్రి వైద్యులు అభినందించారు. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## సాయిలక్ష్మి లేఅవుట్ పార్క్ స్థలాన్ని రక్షించాలి

### నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలి పార్క్ జేఏసీ



**నిజాంపేట్ సెప్టెంబర్ 10 (జనంసాక్షి)** కుతుబుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్‌లోని సాయి లక్ష్మీ లేఅవుట్‌లో సర్వే నంబర్లు 181, 183, 186లో ఉన్న సుమారు 1,800 నుంచి 2,000 చదరపు గజాల పార్క్ స్థలాన్ని అధికారులు తక్షణమే రక్షించాలని పార్క్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పార్క్ స్థలంలో గత వారం రోజులుగా రెండు జేసీబీలతో మట్టి తవ్వకాలు, నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వెంటనే వాటిని నిలిపివేసి స్థలాన్ని రెవెన్యూ అధికారులతో సర్వే చేయాలని కోరారు. గతంలో ప్రజల కోసం కేటాయించిన ఈ స్థలానికి ప్రగతి నగర్ గ్రామపంచాయతీ సుమారు రూ. 10 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించిందని తెలిపారు. 2021లో తమ ఫిర్యాదుల ఆధారంగా అప్పటి ఐఏఎస్ అధికారి గోపీ పార్క్ స్థలాన్ని రక్షించి, నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని హెచ్ఎండీఏకు లేఖ రాసినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ నిర్మాణ కార్యకలాపాలు కొనసాగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి స్థలాన్ని పరిశీలించి డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు హైడ్రా , బాచుపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పార్క్ స్థలాన్ని రక్షించి రాజీవ్ గాంధీ నగర్, సాయి లక్ష్మీ లేఅవుట్ తదితర పరిసర కాలనీల ప్రజల అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే చుట్టుపక్కల కాలనీ ల ప్రజలతో కలిసి పార్క్ స్థలం వద్ద భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్, తోట బిక్షపతి, రవి నాయక్, ఎల్ల స్వామి,గోపాల్ నాయక్, హనుమయ్య, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్లేట్లలో పురుగులు



కోహెడ సెప్టెంబర్ 10 (జనంసాక్షి): మండలంలోని నాగసముద్రాల శివారులోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో వడ్డించడానికి సిద్ధంగా ఉన్న అన్నంలో పురుగులు బయటపడటం పాలకుల నిర్లక్ష్యానికి ప్రత్యక్ష రుజువు అని ఏఐఎస్ఎఫ్ చిట్యాల శేఖర్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మండిపడ్డారు. స్టోర్‌రూమ్‌లో ఎక్కువ శాతం విరిగిన బియ్యం కనిపించడంతో, దీనిని అధికారికంగా నిర్ధారించేందుకు తక్షణమే నమూనాలు సేకరించి ల్యాబ్ టెస్టింగ్ చేయాలని, అన్నం, బియ్యం నమూనాలను వెంటనే ల్యాబ్‌కు పంపాలని ఎ ఐ ఎస్ ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాసూరి యుగేందర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు,రాకేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**చాకలి ఐలమ్మ ఘనంగా వర్ధంతి నివాళులర్పించిన ఎంపీ డీకే అరుణ, కలెక్టర్**




**మహబూబ్ నగర్, ప్రతి నిది సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నగర మేయర్ జి.మమత, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని వారు స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్య సాహసాలతో పోరాడి, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రజక సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?

**విద్యుత్ శాఖపై రైతుల ఆగ్రహం**



**రాజోళి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** రెక్కలు ముక్కలు చేసుకుని పంటలు సాగు చేసిన రైతులకు కరెంటు కోతలు కన్నీళ్లు మిగులుస్తున్నాయి. రాజోళి మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు గురువారం విద్యుత్ ఉపకేంద్రం ఎదుట బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల విద్యుత్ సరఫరా కూడా సక్రమంగా అందడం లేదని, బోర్ల నుంచి నీరు పూర్తిస్థాయిలో రాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. కళ్లముందే పంట ఎండిపోతుంటే చూస్తూ ఉండలేకే రోడ్డెక్కామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ ఫోన్ ద్వారా రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

**ఆరు గంటలు కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని ఆగ్రహం**



**వనపర్తిరూరల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామం పెద్దగూడెం రైతులు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా అందడం లేదని గురువారం కడుకుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కడుకుంట్ల--వనపర్తి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ప్రభుత్వం 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని చెబుతున్నప్పటికీ కనీసం ఆరు గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలతో బోర్లు, మోటార్లు పనిచేయక పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. గతంలో విద్యుత్ కొరత ఉన్నప్పటికీ మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించారని గుర్తుచేశారు. రైతుల ఆందోళనతో విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యుత్ డిమాండ్ పెరగడంతో సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని డీఈ శ్రీనివాసులు వివరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈ శ్రీనివాసులు రైతులతో చర్చించి వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను మెరుగుపరుస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కే. మాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, ధర్మనాయక్, దేగ మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము, లక్ష్మీకాంత్‌రెడ్డి, సర్పంచ్ తిరుపతయ్య, మాజీ సర్పంచులు హరిత బాలకృష్ణ, కొండయ్య, కృష్ణనాయక్, మనీష్, వెంకటేష్, అశోక్‌తో పాటు రైతులు, నాయకులు పాల్గొన్నారు.





## ఆర్టీసీ బస్సులు ఆపాలని విద్యార్థుల ధర్నా

**మక్తల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** మక్తల్ మండలంలోని టేకులపల్లి గేటు వద్ద పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంతో తాము సమయానికి కళాశాలలు, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని, దీనివల్ల చదువు కోల్పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ?ఈ ఆందోళనకు అడ్వకేట్ నరేందర్ సాగర్, టేకులపల్లి గ్రామ సర్పంచ్ శ్రావణ్ కుమార్ మద్దతు తెలిపారు. వారు స్వయంగా రాస్తారోకోలో పాల్గొని మాట్లాడారు. టేకులపల్లి గేటు వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలని అనేకసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల చదువుకు అడ్డంకులు సృష్టించవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి గేటు పరిసర ప్రాంతాల పాఠశాల, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ధాన్యం మాయం చేసి.. వడ్ల పొట్టు నింపి..



**తూప్రాన్ సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు మిల్లింగ్ చేయమని పంపిస్తే ధాన్యాన్ని మాయం చేసి బస్తాలలో వడ్ల పొట్టు నింపడంతో అధికారులు దాడి చేసి రైస్ మిల్ సీజ్ చేసిన సంఘటన తెలిసింది. తూప్రాన్ మండలం మల్కాపూర్ సాయి బాలాజీ రైస్ మిల్ సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ తాటి నర్సింలు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్క్ పంపించడంతో ధాన్యం బస్తాలలో వడ్లకు సంచులకు బదులు వడ్ల పొట్టు ను సంచులలో నింపి అధికారులను బురిడీ కొట్టించేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. వడ్ల పొట్టు సంచులలో నింపి ధాన్యన్ని ఎలుకలు తినడం వల్ల ధాన్యం సంచులు వడ్ల పొట్టుతో నిండాయని అధికారులను నమ్మించే ప్రయత్నం చేసిన రైస్ మిల్ యజమాని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. 2022- 23 టెండర్ ధాన్యం 8268 బస్తాలు, 2025-26 ఖరీఫ్ ధాన్యం 2156 బస్తాలు తక్కువగా ఉన్నట్లు తెలిపారు. రైస్ మిల్లును సీజ్ చేసి, కేసు నమోదు చేసి, రైస్ మిల్ ను ఘనాపూర్ సాయినాథ్ రైస్ మిల్ కు అప్పగించినట్లు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

## విచారణ లేకుండా కేసులు నమోదు చేశారని.. ఆత్మహత్యాయత్నం

**ఎస్ఐ, దాయాదులే తన చావుకు కారణమంటూ సెల్ఫీ వీడియో గడ్డి మందు తాగుతూ వీడియో తీసి వాట్సాప్ గ్రూపులో షేర్ చేసిన నవీన్**



**శివ్వంపేట, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన చెల్లి నవీన్ గురువారం తన వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసి గ్రామ వాట్సాప్ గ్రూపులో షేర్ చేయడం కలకలం రేపింది. విషయం గమనించిన గ్రామస్తులు వెంటనే అక్కడికి చేరుకుని నవీన్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నాలుగు రోజుల క్రితం ఇంటి ముందు స్థలం విషయంలో తన దాయాదులు చెల్లి లక్ష్మణ్, మౌనికలకు, చెల్లి ఆంజనేయులుకు మధ్య గొడవ జరుగుతుండగా తాను అక్కడికి వెళ్లి గొడవ పడొద్దని చెప్పానని నవీన్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. తాను, తన కుమారులు విష్ణువర్ధన్, హర్షవర్ధన్ ఎవరినీ ఏమీ అనలేదని తెలిపారు. అనంతరం లక్ష్మణ్, మౌనిక శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో తనతో పాటు తన కుమారులపై ఫిర్యాదు చేశారని చెప్పారు. పోలీసుల సమాచారం మేరకు బుధవారం స్టేషన్‌కు వెళ్లగా, తనతో పాటు ఇద్దరు కుమారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిసిందని నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, గ్రామంలో విచారణ చేయకుండా ఇతరుల మాటలు విని ఎస్ఐ మధుకర్‌రెడ్డి కేసులు నమోదు చేశారని ఆరోపించారు. తన కుమారులు చదువుకుంటున్నారని, కేసులు నమోదు చేయడం వల్ల వారి భవిష్యత్ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తన చావుకు చెల్లి లక్ష్మణ్, మౌనిక, ఎస్ఐ కారణమంటూ వీడియోలో పేర్కొంటూ, ఎస్పీ, డీఎస్పీ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుని తన కుమారులకు న్యాయం చేయాలని కోరారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

**లాడ్జి నిర్వాహకుడితో పాటు 13 మంది పోలీసుల అదుపులో**



**మక్తల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** నారాయణపేట రోడ్డులోని ఎస్‌వీఎన్ లాడ్జ్‌పై టాస్క్‌ఫోర్స్, మక్తల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి వ్యభిచార కార్యకలాపాలను భగ్నం చేశారు. మక్తల్ ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మహీంద్రా షోరూమ్ సమీపంలోని సదరు లాడ్జ్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారంటూ అందిన పక్కా సమాచారంతో ఈ రైడ్ నిర్వహించారు. ఈ దాడులలో లాడ్జి యజమాని పి. భాస్కర్ రెడ్డి, అతని సహాయకులు వులిగప్ప, నవాజ్‌లతో పాటు ముగ్గురు కస్టమర్లు, ఏడుగురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 మొబైల్ ఫోన్లు, రూ. 7,800 నగదు, రెండు మోటార్ సైకిళ్లతో పాటు పెద్ద ఎత్తున కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతంలో ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

## పట్టుబడిన పిడిఎస్ బియ్యం డీసీఎం సీజ్




**కొల్చారం, సెప్టెంబర్ 10(జనం సాక్షి):** పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న పిడిఎస్ బిఆర్ ని అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని కొల్చారం పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మొహీనుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కె ఏ-32-ఏ ఏ 4947 నెంబర్ గల డీసీఎం ఆఫీస్ తనిఖీ చేయగా ఫోర్టీ ఫైడ్ రైస్ కెర్నల్ (ఎఫ్ ఆర్ కె) తో కలిపి 290 బస్తాల పిడిఎస్ బియ్యం, మొత్తం 143.10 క్వింటాళ్లు ఉన్నట్లు గుర్తించారు. వాహనం డ్రైవర్ ముజీబ్ ను విచారించగా చంద్రయనగుట్ట ప్రాంతంలోని రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి, మెదక్ మీదుగా బోధన్ కు తరలించి అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, డీసీఎం తనవేనని డ్రైవర్ చెప్పినట్లు తెలిపారు. ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, తెలంగాణ స్టేట్ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ ఆర్డర్-2016 లోని క్లాజ్ 17(ఈ) నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించగా నర్సాపూర్ మండలం లింగాపూర్ లోని తిరుమల ఆగ్రో ఇండస్ట్రీస్ లో భద్రపరచినట్లు తెలిపారు. డీసీఎం వాహనాన్ని తదుపరి ఆదేశాల మేరకు కొల్చారం పోలీస్ స్టేషన్లో ఉంచినట్లు ఎస్సై మహమ్మద్ మొహీనుద్దీన్ తెలిపారు.

## పెన్షన్ కోసం తహసీల్దార్ ఆఫీస్ ముందు వితంతువు దీక్ష




**జడ్చర్ల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** వితంతు పెన్షన్ మంజూరు చేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జడ్చర్ల మండలం నసరుల్లాబాద్‌కు చెందిన జయమ్మ అనే వితంతువు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మౌన దీక్ష చేపట్టారు. తన భర్త సత్తయ్య మరణించి 15 ఏళ్లు గడుస్తున్నా తనకు ఇంతవరకు వితంతు పెన్షన్ అందలేదని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ కోసం గత పదేళ్లుగా గ్రామ సర్పంచులు, మండల అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని వాపోయారు. అధికారులు సరైన సమాధానం చెప్పకుండా తనను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ సమయం వృథా చేస్తున్నారనీ, విసిగిపోయే చివరకు దీక్షకు దిగినట్లు జయమ్మ తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, తనకు వితంతు పెన్షన్ మంజూరు చేసి న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



## భూత్పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**అదుపుతప్పి డివైడర్ ను ఢీకొన్న డీసీఎం**
**272 గొర్రెలు సజీవ దహనం, ఒకరు మృతి**
**44వ జాతీయ రహదారిపై అగ్నిప్రమాదం**
**డీజిల్ ట్యాంక్ పేలి చెలరేగిన మంటలు**

**భూత్పూర్ సెప్టెంబర్10 (జనం సాక్షి ):**
మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో 44వ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 272 గొర్రెలతో ప్రయాణిస్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి డివైడర్ పక్కన ఉన్న నేమ్ బోర్డ్ స్తంభాన్ని బలంగా ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డీజిల్ ట్యాంక్ పేలడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో గొర్రెలు, మేకలు సజీవ దహనం కాగా, యూపీకి చెందిన అమిత్ (40) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ కు తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# గుడ్డెందొడ్డి సామర్థ్యం 15 టీఎంసీలకు పెంపు



- గద్వాల రైతాంగానికి చారిత్రాత్మక శుభవార్త
- గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం 1.19 టీఎంసీ నుండి 15 టీఎంసీలకు పెంపు
- జీవో కాపీని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డికి అందజేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**గద్వాల ప్రతినిధి,సెప్టెంబర్ 10 (జనం సాక్షి)** గద్వాల నియోజకవర్గ వ్యవసాయ రంగాన్ని మలుపు తిప్పే భారీ సాగునీటి ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గద్వాల రైతాంగం దశాబ్దాల కల నెరవేరుస్తూ, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నిల్వ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 1.19 టీఎంసీ నుండి ఏకంగా 15 టీఎంసీ లకు పెంచుతూ ప్రభుత్వం అధికారికంగా జీవో.ఆర్టి.నెం.467 జారీ చేసింది. ఈరోజు హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ చారిత్రాత్మక జీవో కాపీని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి స్వయంగా అందజేశారు.

**2 లక్షల ఎకరాలకు సాగునీరు**

సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గ రైతాంగం, ప్రజల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. క్యాబినెట్ సమావేశంలో ప్రత్యేకంగా గద్వాల నియోజకవర్గానికి సంబంధించిన గట్టు ఎత్తిపోతల పథకం, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ల సామర్థ్య పెంపునకు నిధులు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలనే దూరదృష్టితో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని,చివరి ఆయకట్టు వరకూ నీరు,ఈ ప్రాజెక్టు విస్తరణ ద్వారా గద్వాల నియోజకవర్గంలో రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు పుష్కలంగా నీరు అందుతుందని, దాదాపు 2 లక్షల ఎకరాలకు సాగునీరు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.నెంబర్ 1 స్థానమే లక్ష్యంగా భవిష్యత్తులో గద్వాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే నెంబర్ వన్ నియోజకవర్గంగా నిలబెట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రివర్గం పూర్తి సహకారం అందిస్తోందని, తన వంతుగా నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ అద్భుతమైన వరప్రసాదాన్ని అందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,జూపల్లి కృష్ణారావు గద్వాల నియోజకవర్గ ప్రజల తరపున, రైతాంగం తరపున ఎమ్మెల్యే హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## మూడు రోజుల పరిణామాలకు సీఎందే బాధ్యత : మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** రాష్ట్ర శాసనసభ వేదికగా గత మూడు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోనే జరిగిందని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆరోపించారు. గురువారం జడ్చర్లలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో చర్లకోల శ్వేతారెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రెండో రోజు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ నేతలతో ఎలాంటి సంబంధం లేని ఫేక్ సోషల్ మీడియా ఖాతా ఆధారంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి అసత్యాలు ప్రచారం చేస్తూ సభను, ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. అసెంబ్లీకి వచ్చే ఎమ్మెల్యేలను నిరోధించడం, ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టించి ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించడమే కాంగ్రెస్ కుట్రలో భాగమని పేర్కొన్నారు. సభ ప్రతిష్టకు, కేసీఆర్ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించినందుకు గాను సభలో జరిగిన పరిణామాలకు సీఎం రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## పాత బస్టాండ్ పునరుద్ధరణ, ఇళ్ల నిధులపై వినతి

**జడ్చర్ల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. జడ్చర్ల పాత బస్టాండ్ నుంచి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సుల రాకపోకలను వెంటనే పునఃప్రారంభించాలని గురువారం ఆయన అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. బస్సులు లేకపోవడంతో పాత బజార్ వాసులు మెయిన్ రోడ్డుకు వెళ్లేందుకు అదనంగా ఆటో ఛార్జీల భారం మోస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే ప్రయాణికుల భద్రత దృష్ట్యా కొత్త బస్టాండ్ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాల సంఖ్యను పెంచాలని సూచించారు. మరోవైపు జడ్చర్ల నేషనల్ దాబా వెనుక నిర్మిస్తున్న షీర్‌వాల్ టెక్నాలజీ హౌసింగ్ ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసి 528 మంది పేద లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులన్నీ పూర్తి కావడానికి ఇంకా రూ. 5.44 కోట్ల అదనపు నిధులు అవసరమని, వీటిని అత్యవసరంగా విడుదల చేసి పేదల సొంతింటి కలను సాకారం చేయాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మంత్రిని విజ్ఞప్తి చేశారు.

# విద్యలో వరుస విజయాలు



- జర్నలిజంలో డబుల్ గోల్డ్ మెడల్ సాధించిన ప్రాన్షుత

**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** హనుమకొండకు చెందిన దాసి ప్రాన్షుత విద్యా రంగంలో వరుస విజయాలతో ప్రతిభ చాటారు. ఇటీవల వెలువడిన ఉస్మానియా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఫలితాల్లో డబుల్ గోల్డ్ మెడల్ సాధించి హన్మకొండ జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జన్మించిన ఆమె ప్రాథమిక విద్యను బెంగళూరు కేంద్రీయ విద్యాలయం అభ్యసించారు. అనంతరం వరంగల్ కేంద్ర విద్యాలయంలో ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో టాపర్‌గా నిలిచారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఈ కోర్సులో డబుల్ గోల్డ్ మెడల్ సాధించి తన ప్రతిభను చాటారు. ప్రాన్షుత తండ్రి దాసి ప్రభాకర్ భారత వైమానిక దళంలో సేవలందించి, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారు. ప్రస్తుతం హనుమకొండ యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తల్లి కల్పన పర్వతగిరి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యలో ప్రాన్షుత సాధిస్తున్న విజయాలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# బాలుడిని ఆదుకోండి ప్లీజ్..!



- విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డ బాలుడు
- చికిత్స కు 25 నుండి 30 లక్షలు ఖర్చు అవుతుందంటున్న వైద్యులు
- దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్న బాలుడి తల్లిదండ్రులు

**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** ప్రార్థించే పెదవుల కన్నా.. చేయూతనిచ్చే చేతులే మిన్న అంటారు. తమ శక్తికి మించిన భారాన్ని మోయలేనప్పుడు ఎవరైనా సహాయం చేస్తే బాగుండు అని ఎదురుచూడడంలో తప్పులేదు. మానవతా దృక్పథంతో సాటి మానవుల కష్టసుఖాలలో పాలుపంచుకునే వాడే నిజమైన మనిషి అంటారు. ఈ నెల 4వ న వరంగలలోనీ కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కె. బిక్షపతి కొడుకు 11 సంవత్సరాల అభికరుణ్ కాజీపేట లోని తాము కిరాయి ఉంటున్న ఇంటిపైన ఆడుకుంటుండగా 11 కే.వి కరెంట్ తీగలు తగిలి తీవ్రంగా గాయపడడం జరిగింది. ప్రస్తుతం హైటెక్ సిటీ యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు..కనీసం 2 నుండి 3 నెలల చికిత్స అవసరం ,సుమారు 25 నుండి 30 లక్షల ఖర్చు వస్తుంది అని డాక్టర్స్ చెప్పడం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డ్స్ పనిచేయడం లేదు. వేరే ఎలాంటి వ్యాపకాలు లేకుండా కేవలం ప్రభుత్వ ఉద్యోగం మీదే ఆధారపడుతున్న ఉపాధ్యాయుడు బిక్షపతి అంత పెద్ద ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నాడు. ఈ క్రమంలో దాతల సహకారాన్ని కోరుతున్నాడు. ఇటు తగినంత డబ్బు లేక అటు హెల్త్ కార్డ్స్ పనిచేయకుండా ఉండడం వల్ల ప్రస్తుతం ఈ ఉపాధ్యాయుడు తీవ్ర మనోవేదనకు గురైవుతున్నాడు. దాతలు తమ ఆర్థిక సహాయం చేయాలని అనుకునే వారు ఈ సెల్ నంబర్:8520942727 డబ్బులు పంపించాలని ప్రాధేయ పడుతున్నాడు.

## శిలాఫలకానికి పిండ ప్రదానం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మండలం కొత్తపల్లి ఎస్ఎం గ్రామంలో గురువారం బీఆర్ఎస్ నేతలు శిలాఫలకానికి పిండ ప్రదానం చేసి నిరసన వ్యక్తం చేశారు. కొత్తపల్లి నుండి దొమ్మడిపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధుల నుండి కోటి రూపాయలు మంజూరు చేసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శిలాఫలకం వేసి శంకుస్థాపన చేసి ఏడాది గడిచినా పనులు పూర్తి కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. ఏడాదైనా రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంతో శిలాఫలకం వద్ద పిండ ప్రదానం చేసి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి గ్రామస్తుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కిర్మరే సుధాకర్‌కు డాక్టరేట్ పట్టా



**రెబ్బెన,సెప్టెంబర్10(జనం సాక్షి):** రెబ్బెన, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల, రెబ్బెనలో హిందీ జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న కిర్మరే సుధాకర్ స్మానియా ఉవిశ్వవిద్యాలయం, హైదరాబాద్ నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో పీహెచ్.డీ పట్టా అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరుకాగా, భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు, చైర్మన్ డా. కృష్ణ ఎం. ఎల్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగారం సమక్షంలో కిర్మరే సుధాకర్ డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. హిందీ భాషా సాహిత్యంపై ఆసక్తితో, నిరంతర అధ్యయనం, పరిశోధన, పట్టుదలతో పీహెచ్.డీని పూర్తి చేసి ఈ ప్రతిష్ఠాత్మక పట్టాను సాధించారు. అధ్యాపకుడిగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు హిందీ భాష పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు అభినందించారు.

# 12 తులాల బంగారం చోరీ



**పరకాల, సెప్టెంబర్ 10,(జనం సాక్షి):** పరకాలలో గురువారం రోజు మధ్యాహ్నా సమయంలో తాళం వేసిన దుకాణం దగ్గర ఎవరూ లేని విషయాన్ని గమనించిన దుండగులు వెనుక వైపు నుంచి కిటికీ ధ్వంసం చేసి,చొరబడి బీరువాను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు.ఈ ఘటనలో దుకాణ యజమాని ముక్క ప్రకాష్ వయస్సు (50)కు చెందిన సాయి చరణ్ కిరాణ దుకాణంలో సుమారు పది తులాల బంగారం,రెండు జతల పట్టగొలుసులు, రూ.20 వేల రూపాయల నగదును దుండగులు అపహరించారు.షట్టర్‌కు తాళం వేసి ఉన్నప్పటికీ వెనుక కిటికీ నుంచి లోపలికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం సుమారు 2 గంటల తర్వాత దుకాణంలో ఎవరూ లేని సమయంలో ఈ చోరీ జరిగినట్లు సమాచారం. కిరాణా షాపు యజమాని ప్రకాష్ అన్నయ్య మాసిక కార్యక్రమానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి వెనుక కిటికీ తెరిచి ఉండటాన్ని గమనించారు.లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.అనంతరం సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ దుండగులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు.

### ప్రభుత్వ నిబంధనల భారాన్ని మిల్లర్లపై మోపి..

# రైతును నష్టపరిచే పరిస్థితి తీసుకురావద్దు



- ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్

**ములుగు జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్10 (జనం సాక్షి):** ప్రభుత్వ నిబంధనల భారాన్ని మిల్లర్లపై మోపి రైతును నష్టపరిచే పరిస్థితి తీసుకురావద్దని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ విమర్శించారు. ములుగు జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ "రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.ఆ ధాన్యం మిల్లుకు వస్తుంది. మిల్లర్ మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి సిఎంఆర్ అందిస్తాడు.కానీ ఈ మొత్తం ప్రక్రియలో ప్రభుత్వం విధించిన నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు, సిఎంఆర్ స్వీకరణలో జాప్యం, తరుగుదల విషయంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరిస్తే... చివరకు నష్టపోయేది మిల్లర్ మాత్రమే కాదు, రైతు కూడా' అని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మేము ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం లేదు.ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం రైతు ప్రయోజనాలను కాపాడేలా ఉండాలన్నదే మా ఉద్దేశం. కానీ క్షేత్రస్థాయిలో సాధ్యంకాని నిబంధనలను కాగితాలపై రూపొందించి, వాటి భారాన్ని మిల్లర్లపై వేస్తే ఆర్థిక వ్యవస్థలో దాని ప్రభావం చివరకు రైతుపైనే పడుతుంది.ఈ విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని చెప్పారు.ప్రస్తుతం మిల్లర్లకు ఎదురవుతున్న ప్రధాన సమస్య మిల్లింగ్ రికవరీ, తరుగుదల విషయంలో వాస్తవ పరిస్థితులు, ప్రభుత్వ లెక్కల మధ్య ఉన్న వ్యత్యాసం చాల పెద్దది. ధాన్యం ఏ రకం? దాని తేమ ఎంత? నాణ్యత ఎలా ఉంది? విరిగిన గింజలు ఎంత? ధాన్యంలో ఉన్న మలినాలు ఎంత? ఇవన్నీ మిల్లింగ్ రికవరీపై ప్రభావం చూపుతాయి.కానీ ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా ఒక నిర్దిష్ట శాతంలో బియ్యం ఇవ్వాల్సిందేనని నిబంధనలు విధిస్తే, ఆ లోటును మిల్లర్ తన జేబులో నుంచి భరించాల్సిన పరిస్థితి వస్తుంది. మేము అదనపు ఖర్చును తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు.దాని ప్రభావం రవాణా నుంచి ధాన్యం కొనుగోలు వరకు మొత్తం వ్యవస్థపై పడుతుంది. చివరకు రైతుకు కూడా దాని ప్రభావం తప్పదు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు ఒక వైపు ఉంటే, మిల్లులోకి వచ్చే ధాన్యం నాణ్యత మరోవైపు ఉంటుంది.మిల్లర్లకు వాస్తవంగా వచ్చే రికవరీ ఎంత? ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన సిఎంఆర్ ఎంత?ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వం శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్ణయాలు చెప్పాలి.కాగితంపై ఉన్న లెక్కలతో మిల్లింగ్ జరగదు... మిల్లులో ఉన్న ధాన్యంతోనే మిల్లింగ్ జరుగుతుంది" అని బాదం ప్రవీణ్ అన్నారు.ధాన్యం నాణ్యతలో తేడా ఉంటే దానికి అనుగుణంగా రికవరీ ప్రమాణాలను నిర్ణయించాలి. ప్రతి మిల్లర్‌ను ఒకే గాటన కట్టి చూడటం సరికాదు. మిల్లర్లకు ఉన్న మరో ప్రధాన సమస్య నాన్-ఫాక్స్ ధాన్యం.నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు సరిపోని ధాన్యం మిల్లులకు వచ్చినప్పుడు దాన్ని మిల్లింగ్ చేయడం వల్ల మిల్లర్లకు అదనపు నష్టం వస్తోంది. మా సంఘం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన లెక్కల ప్రకారం, ఇలాంటి ధాన్యం వల్ల క్వింటాల్‌కు సుమారు రూ.750 నుంచి రూ.1,000 వరకు ఆర్థిక భారం పడుతున్న పరిస్థితి ఉందని మేము ప్రభుత్వానికి పేర్కొన్నాం. రైతు దగ్గర ధాన్యం కొనుగోలు చేసే దశలోనే నాణ్యతను శాస్త్రీయంగా నిర్ధారించాలి. మిల్లుకు వచ్చిన తర్వాత నాణ్యతా సమస్యలను మిల్లర్‌పై మోపితే మిల్లర్ నష్టపోతాడు. మిల్లర్ నష్టపోతే ఆ ప్రభావం మొత్తం ధాన్యం మార్కెట్‌పై పడుతుంది. చివరకు రైతే ఇబ్బంది పడతాడు. మేము ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సిఎంఆర్ బియ్యం సిద్ధం చేసి పెట్టుకున్నా, దాన్ని సమయానికి స్వీకరించకపోతే మిల్లర్ ఏం చేయాలి?మిల్లులో స్థలం ఆక్రమించబడుతుంది. నిల్వ ఖర్చులు పెరుగుతాయి. కూలీల ఖర్చు, విద్యుత్ ఖర్చు, నిర్వహణ ఖర్చు, ఆర్థిక వడ్డీ భారం పెరుగుతాయి.ఒకవైపు కొత్త సీజన్ ధాన్యం మిల్లుకు వస్తుంది. మరోవైపు పాత సిఎంఆర్ బియ్యం మిల్లులోనే ఉంటుంది. అప్పుడు మిల్లర్ కొత్త ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలి?ప్రభుత్వం సిఎంఆర్ తీసుకోకపోవడం వల్ల మిల్లర్ భరించే అదనపు ఖర్చుకు పరిహారం ఏమిటి?మిల్లర్ తన బాధ్యతను పూర్తి చేసి బియ్యం సిద్ధం చేసిన తర్వాత, ప్రభుత్వ విభాగాలు తమ బాధ్యతను కూడా అదే విధంగా పూర్తి చేయాలి.ప్రభుత్వ నిబంధనలు రైతుకు రక్షణగా ఉండాలి... మిల్లర్‌కు శిక్షగా కాదు దీనిపైన ప్రభుత్వం దృష్టి పెట్టాలి.ప్రభుత్వ నిబంధనలు అవసరమే. కానీ ఆ నిబంధనలు వ్యవస్థను సరిచేయడానికి ఉండాలి కానీ, ఒక వర్గంపై ఆర్థిక భారాన్ని మోపడానికి ఉండకూడదన్నారు .రైతు పండించిన ధాన్యం నుంచి మొదలు ప్రభుత్వ కొనుగోలు చేసి మిల్లింగ్ చేసిన సిఎంఆర్ మరియు ఎఫ్సిఐ /సివిల్ సప్లైస్ ద్వారా ప్రజలకు చేరే బియ్యం ప్రక్రియ వరకు ఈ మొత్తం గొలుసులో ఎక్కడ సమస్య వచ్చినా దాని ప్రభావం మిగతా అన్ని దశలపై పడుతుంది. మిల్లర్‌ను నష్టాల్లోకి నెట్టి రైతుకు న్యాయం చేయడం సాధ్యం కాదు. మిల్లర్‌కు న్యాయమైన నిర్వహణ సాధ్యమయ్యే విధంగా నిబంధనలు ఉండాలి. రైతుకు గిట్టుబాటు ధర, సమయానికి కొనుగోలు ఉండాలి. ప్రభుత్వానికి సిఎంఆర్ బియ్యం సమయానికి అందాలి.ఈ మూడు అంశాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. కాబట్టి మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.మిల్లింగ్ రికవరీపై వాస్తవిక అధ్యయనం చేయాలి.నాన్-ఫాక్స్ ధాన్యంపై స్పష్టమైన విధానం తీసుకురావాలి. సిఎంఆర్ బియ్యం స్వీకరణలో జాప్యాన్ని నివారించాలి.మిల్లుల వద్ద ఉన్న నిల్వలను మిల్లువారీగా పరిశీలించాలి. మిల్లర్లపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని ప్రభుత్వం సమీక్షించాలి' అని పేర్కొన్నారు.

# నకిలీ నియామక ఉత్తర్వులతో మోసం.. వ్యక్తి అరెస్ట్



- రూ.85 లక్షల వరకు నగదు, 4 తులాల బంగారం వసూలు
- ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో టోకరా

**కాజీపేట, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగ యువత నుంచి భారీ మొత్తంలో నగదు, బంగారం, అసలు విద్యా సర్టిఫికెట్లు సేకరించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ నిందితుడు మెట్టు ప్రవీణ్ కుమార్ (41), నిజామాబాద్ జిల్లా నివాసిగా గుర్తించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో టాక్సీ అసిస్టెంట్ టాక్సీ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మోసం చేసిన విధానం నిందితుడు స్పోర్ట్స్ కోట, ఎన్సిసి సి కోట సంబంధించిన పేర్లతో ఉద్యోగాలు ఇప్పిస్తానని అభ్యర్థులను ఆకర్షించినట్లు పోలీసులు తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన వెబ్‌సైట్లు చూపిస్తూ, గతంలో జారీ అయిన ఉద్యోగ నియామక ఉత్తర్వులలో పేర్లు మార్చి నకిలీ ఆఫర్ లెటర్స్ తయారు చేసి అభ్యర్థులకు చూపించినట్లు వెల్లడైంది. అంతేకాకుండా మోసం మరింత నమ్మదగినదిగా కనిపించేలా అభ్యర్థులకు మెడికల్ టెస్టులు, పోలీస్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలు నిర్వహించినట్లు నటించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఐ సి ఏ ర్ లో నిర్వహించే ఓరియంటేషన్ ఐ.టి కోర్సులను ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన శిక్షణగా నమ్మించి పలువురు యువతను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటివరకు గుర్తించిన బాధితుల నుంచి సుమారు రూ.85 లక్షల నగదు, 4 తులాల బంగారం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల నుంచి అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ సంబంధిత పత్రాలు కూడా తీసుకున్నట్లు వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.18.22 లక్షల విలువైన నగదు మరియు ఇతర ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో: లాప్టాప్ బెంజి కారు, రూ.2 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు, నకిలీ ఉద్యోగ నియామక ఉత్తర్వులు తయారు చేసేందుకు ఉపయోగించిన పారదర్శక షీట్లు/ప్లాస్టర్, ఎల్లో హైలైటర్, ఆడిట్ రిపోర్ట్ ఐడి కార్డ్ తదితర వస్తువులు ఉన్నాయి. అదనంగా పలువురు బాధితులకు సంబంధించిన ముఖ్యమైన అసలు పత్రాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జే. శ్యామ్ సుందర్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరింత మంది బాధితులు ఉన్నారా, నిందితుడి మోసాల వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని ద్వారా ఉద్యోగం వస్తుందని, ప్రత్యేక కోటాలో ఉద్యోగం ఇప్పిస్తామని లేదా ప్రభుత్వ అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన నియామక ప్రక్రియ, నోటిఫికేషన్లు, ఫలితాలు తదితర సమాచారాన్ని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్లు, అధికారిక నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే ధృవీకరించుకోవాలని సూచించారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



- పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** వినాయక చవితి, నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావర ణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. హన్మకొండ పట్టణం లో గణపతి నవరాత్రుల, నిమజ్జనం ఏర్పాట్ల మీద సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలో శాసనసభ్యులు, కలెక్టర్ రివ్యూ నిర్వహించారు ఈ సందర్భంగా శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..తక్కువ వర్షపాతం కారణంగా ఈసారి నగరంలోని చెరువులు, నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో.. నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది గతంతో పోలిస్తే వర్షపాతం తక్కువగా నమోదైనందున నిమజ్జన కార్యక్రమంపై ముందుగానే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపన కి ముందుకు రావాలని అలాగే ఈసారి ఉన్న నీటి సమస్య ను దృష్టిలో ఉంచుకొని. నిమజ్జనం సమయం లో ఇబ్బందులు తలేత్తకుండా తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ప్రతిష్టించాలన్నారు ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇవి శ్రీనివాస్ జి డబ్ల్యు ఎం సి టౌన్‌ప్లానింగ్, పోలీస్, విద్యుత్తు, ఆరోగ్య, ట్రాఫిక్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భర్త మృతి.. భార్యకు కిడ్నీ వ్యాధి.. అనాథగా ముగ్గురు పిల్లలు



- కేరమేరీలో అభాగ్యురాలి కన్నీటి కథ...
- సాయం కోసం ఎదురుచూపు.

**కెరమెరి, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** విధి చిన్న కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. నిన్నటి వరకు కలిసి కష్టపడిన భర్త క్యాన్సర్ మహమ్మారికి బలైతే, నేడు ఆ తల్లి కిడ్నీ వ్యాధితో మంచాన పడింది. ముగ్గురు పసి పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ హృదయ విదారక ఘటన కెరమెరి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన బొమ్మెన ఇస్తారి, శిరీష దంపతులు రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెతో సంతోషంగా జీవనం సాగించేవారు. కొన్ని నెలల క్రితం ఇస్తార్ కు క్యాన్సర్ సోకింది. ఉన్నదంతా అమ్ముకుని వైద్యం చేయించినా ఫలితం లేక ఇటీవల మృతి చెందాడు. భర్త మృతిని జీర్ణించుకోక ముందే శిరీషకు కిడ్నీ సమస్య తీవ్రమైంది. ఆరోగ్యశ్రీ ద్వారా కొంత వరకు వైద్యం చేయించుకున్నా, వ్యాధి తీవ్రత పెరగడంతో మరింత ఖరీదైన వైద్యం అవసరమని వైద్యులు చెబుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక, ఆపరేషన్ చేయించుకోలేక నరకయాతన అనుభవిస్తోంది. శిరీష ముగ్గురు పిల్లల వయసు పదేళ్లలోపే. అందులో కుమార్తె మానసికంగా ఎదగడం లేదు. తండ్రిని కోల్పోయి, తల్లి అనారోగ్యంతో ఉంటే ఆ పసి హృదయాలు ఏం చేయాలో తెలియక బిక్కుబిక్కు మంటున్నాయి. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లోనే ఉంటున్న ఈ కుటుంబానికి రోజువారీ తిండికే కరువొచ్చింది. పిల్లల ఆకలి తీర్చలేని నిస్సహాయ స్థితిలో ఆ తల్లి కన్నీరు మున్నీరవుతోంది. ప్రస్తుతం శిరీషకు వైద్యంతో పాటు పిల్లల పోషణ, చదువు భారంగా మారింది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని, తన వైద్యానికి, పిల్లల చదువులకు 6302493897 ఫోన్ పే ద్వారా సహాయం చేయాలని శిరీష కన్నీటి పర్యంతమవుతూ వేడుకుంటోంది.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్

**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 10 (జనం సాక్షి):** తెలంగాణ ప్రభుత్వం మరియు కమిషనర్ బి.సి వెల్ఫేర్ ఇచ్చిన సూచనలు మేరకు వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి గురువారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ అనుమతితో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్ వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణలో చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆమె చూపిన ధైర్య సాహసాలను, స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి ఇంచార్జ్ అధికారి నాగలక్ష్మి వసతి గృహ సంక్షేమ అధికారులు,జిల్లా అధికారులు, కలక్టరేట్ కార్యాలయ సిబ్బంది, జిల్లాలోని వివిధ సంఘాల నాయకులు, మాజీ జిల్లా గ్రంథాలయ సభ్యులు నిమ్మల శ్రీను పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, బస్ స్టాండ్ ప్రాంతంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ ఏ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ఏఈఎస్ మరియు జిల్లా నోడల్ అధికారి డా. శ్రీకాంత్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. పీఓపీ విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాలనే వాడాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ 300 మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భూపాలపల్లిలో జిల్లా నోడల్ అధికారి డా. శ్రీకాంత్ విద్యార్థులకు పర్యావరణ హిత మట్టి విగ్రహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు 500 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

# ఖమ్మంలో దారుణం..!

## అనుమానంతో మహిళను చంపిన వ్యక్తి

### నాలుగు నెలలుగా సహ జీవనం చేస్తున్న ఇరువురు
### మృతదేహంతో ఖమ్మం వరకు కారులో ప్రయాణం
### ఫోన్ కాల్ ఆధారంగా నిమిషాల వ్యవధిలో నిందితుడి అరెస్ట్

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** ఖమ్మంలో దారుణం జరిగింది.. ప్రేమిస్తున్న అని నమ్మ బలికాడు.. మోడుగా ఉన్న జీవితానికి అండగా ఉంటానని ప్రమాణం చేశాడు.. నమ్మిన నాలుగు నెలలకే అతనిలో అనుమానశీ పెను భూతంగా మారింది.. సహజీవనమే శాపమైన వేల.. కారులో తీసుకెల్లి గొంతు నులిమి అత్యంత కర్కశంగా హత్య చేశాడు.. ఎక్కడ చంపాడో ఏమో కానీ శవంతోనే కారులో ప్రయాణించాడు.. ఖమ్మం లోని ఒక ప్రదేశం వద్ద ఆగి స్నేహితునికి ఫోన్ చేశాడు.. సమాచారం అందుకున్న ఖమ్మం అర్బన్ పోలీసులు నిమిషాల వ్యవధిలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నరు.. బాధితురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణానికి చెందిన మేడిపల్లి విద్యాసాగర్ (44) అనే వ్యక్తి కారు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. అప్పటికే అతనికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ కుటుంబ కలహాల కారణంగా భార్యా భర్తలు విడిపోయారు. ఇటీవలే ఇల్లందుకే చెందిన చెన్నబోయిన రేణుక అతనికి పరిచయం అయ్యింది. ఆమె కూడా భర్త లేకుండా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నది. ఇరువురూ ఒకే పట్టణానికి చెందినవారు కావడంతో పరస్పర అంగీకారంతో గత నాలుగు నెలలుగా ఖమ్మంలోని సిసిఎస్ పోలీస్ స్టేషన్ సమీపంలోని అద్దె ఇంట్లో సహజీవనం చేస్తున్నారు.

**అనుమానంతో హత్య**

మృతురాలు చెన్నబోయిన రేణుక ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నట్లు తెలిసింది. ప్రేమ పేరుతో ఆమె పంచన చేరిన విద్యాసాగర్ కేవలం నెలల వ్యవధిలోనే గొడవలు పెట్టుకోవడం స్టార్ట్ చేశాడు. వేరొక వ్యక్తితో అక్రమ సంబంధాన్ని అంటగట్టి ప్రతిరోజు శారీరక, మానసిక వేధింపులకు గురి చేసేవాడు. దీనిలో భాగంగానే ఆమె పని చేస్తున్న ఆసుపత్రి వద్దకు బుధవారం సాయంత్రం వెళ్ళాడు. బయటకు వెళ్లొద్దామని నమ్మబలికి కారులో వెక్కించుకున్నాడు. ఇరువురు కలిసి ప్రయాణిస్తున్న క్రమంలో విద్యాసాగర్ అక్రమ సంబంధం గొడవను ప్రారంభించాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన అతను రేణుక గొంతు నులిమి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. రాత్రి సుమారు 10:30 గంటల సమయం లో నిందితుడైన విద్యాసాగర్ ఇల్లందుకు చెందిన తన స్నేహితుడికి జరిగిన సంఘటన గురించి ఫోన్ చేసి చెప్పాడు. తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలపడంతో కంగారు పడిన అతని స్నేహితుడు ఖమ్మం అర్బన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తక్షణమే రంగంలోకి దిగిన పోలీసులు విద్యాసాగర్ కు ఫోన్ చేశారు. అతని కాల్ డేటా ఆధారంగా ఖమ్మం, ఇల్లందు రోడ్డు లోని ప్రగతి పాఠశాల సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ క్రమంలో కారులోనే లభ్యమైన రేణుక మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.



**అనాథలుగా మిగిలిపోయిన చిన్నారులు**

కేవలం అనుమానంతో హత్యకు గురైన చిన్నబోయిన రేణుకకు ఇద్దరు చిన్న వయసు పిల్లలు ఉన్నారు. నిందితుడైన విద్యాసాగర్ తో సహజీవనానికి ముందే మొదటి భర్తతో విడాకులు తీసుకొని నర్సుగా పనిచేస్తూ బిడ్డలను పోషించుకుంటున్నది. ప్రస్తుతం తల్లి హత్యకు గురికావడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. 'పిల్లల్ని ఎలా సాకాలిరా దేవుడా' అని మృతురాలి తల్లి రోధించిన తీరు ప్రతి ఒక్కరికి కంటతడి తెప్పించింది. మొదటి నుంచి నిరుపేద కుటుంబం కావడంతో కనీసం మృతదేహాన్ని తీసుకువెళ్లడం కూడా రేణుక తల్లికి పెనుభారంగా మారడం గమనార్హం. కాగా మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం
# భానుపురి ప్రభాతభేరి ర్యాలీ




**సూర్యాపేట(జనంసాక్షి):** శంషాబాద్ నుండి చెన్నై వెళ్లే బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వెళ్లే ప్రతిపాదనలు ఇచ్చే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తి లేదంటూ సూర్యాపేట పట్టణ వర్తక, వ్యాపార, వాణిజ్య,విద్యా వైద్య,వృత్తి సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. పట్టణంలోని వివిధ సంఘాలన్ని ఒకతాట మీదికొచ్చి గురువారం సూర్యాపేట పట్టణంలో ప్రభాతభేరి ర్యాలీ నిర్వహించారు.పట్టణంలోని సద్దలచెరువు బతుకమ్మ ఘాట్ దీక్షా శిబిరం నుండి శంకర్ విలాస్ ,ఎంజీ రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ వరకు వ్యాపారులు, వాణిజ్య, విద్యా వైద్య సంఘాలు బుల్లెట్ ట్రైన్ సాధన లక్ష్యంగా భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంషాబాద్ నుండి చెన్నైకి వెళ్లే బుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి 65 మీదుగా సూర్యాపేట, కోదాడ, నందిగామ మీదుగా అమరావతి చెన్నై వెళ్లే విధంగా ప్రభుత్వం మొదటగా ఇచ్చిన అలైన్మెంట్ ప్రకారం ప్రతిపాదనలు ఖరారు చేసి సూర్యాపేట ప్రజల దశాబ్దాల రైలు కలలను నిజం చేయాలని కోరారు .బుల్లెట్ ట్రైన్ సాధన పోరాట కమిటీకి అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు, వివిధ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని అన్నారు.దశల వారీగా ఉద్యమాలను ముందుకు సాగిస్తూ బుల్లెట్ ట్రైన్ సాధన కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ ఉద్యమం దేశ రాజధాని చేరుకునేలా ముందుకెళ్తామని పేర్కొన్నారు.కొత్త బస్టాండు ఫ్లై ఓవర్ వద్ద మానవహారం నిర్వహించారు.ఈ ప్రభాతబేరి ర్యాలీ కార్యక్రమంలో పట్టణ వర్తక వాణిజ్య వ్యాపార సంఘాలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలు, వైద్యులు, వృత్తి సంఘాల నాయకులు, బుల్లెట్ రైలు సాధన ఉద్యమ నేతలు తదితరులు పాల్గొన్నారు.



# రూ.25 లక్షలు ఇస్తేనే భూములు ఇస్తాం!

### సీతారామ సబ్ కెనాల్ భూసేకరణపై రైతుల స్పష్టీకరణ
### రెండు పంటలు పండే భూములు కోల్పోతున్నామని ఆవేదన

**అన్నపురెడ్డిపల్లి సెప్టెంబర్ 10, జనంసాక్షి**

సీతారామ సబ్ కెనాల్ నిర్మాణం కోసం చేపడుతున్న భూసేకరణపై రైతులు తమ అభ్యంతరాలను, డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నర్సాపురం (రాజపురం) గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీతారామ భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ వెంకట్రావు, తహసీల్దార్ స్వర్ణ ఆధ్వర్యంలో గురువారం భూసేకరణ గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో సబ్ కెనాల్ కోసం భూములు కోల్పోతున్న రైతులు తమ సందేహాలు, అనుమానాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు భీమిరెడ్డి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రత్యేక ఉప కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు పంటలు పండే భూములను కోల్పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ సబ్ కెనాల్ నిర్మాణంలో భాగంగా తమ భూములు పోతున్నందున తగిన పరిహారం చెల్లించాలని కోరారు. ఎకరానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లిస్తేనే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, లేదంటే భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. భూసేకరణలో తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాగుకు అనుకూలంగా ఉన్న భూములను కోల్పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని రైతులు అధికారులను కోరారు. ఈ గ్రామ సభలో బన్నె ఏసుబాబు, దుబాకుల రాము, గణపతిరెడ్డి, భీమిరెడ్డి కృష్ణారెడ్డి, ఉప్పరి అశోక్, వెంకటరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.



# కెటిపిఎస్ 5, 6 దశలను సందర్శించిన శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి 'తురై రాజా'

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 10(జనం సాక్షి) :** శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తురై రాజా గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కెటిపిఎస్ 5, 6 దశల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఒక అధికారిక కార్యక్రమం నిమిత్తం ఢిల్లీ విచ్చేసిన ఆయన, అనంతరం పాల్వంచలోని ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కే టి పి ఎస్ 5, 6 దశలలోని బొగ్గు ప్లాంట్ (Coal Plant), బాయిలర్ (Boiler), టర్బైన్ (Turbine), యుసిబి (UCB), కూలింగ్ టవర్లతో పాటు వివిధ విభాగాలను ఆయన కూలంకషంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విచ్చేసిన జస్టిస్ తురై రాజాకి కే టి పి ఎస్5, 6 దశల చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర రావు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో విద్యుత్ కేంద్రంలోని పనితీరును, వివిధ విభాగాల ప్రాముఖ్యతను అధికారులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో డి ఈ/ సి హెచ్ పి మధుబాబు, ఏడిఈ సమీర్, బి. రాధాకృష్ణ, జేఏఓలు శ్రీనివాస్ రెడ్డి, రాజు (నానీ) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ తురై రాజా మాట్లాడుతూ... చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర రావు పర్యవేక్షణలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సాగుతున్న తీరును, ఇక్కడి నిర్వహణ మరియు సంప్రదాయాలను ప్రత్యేకంగా కొనియాడి ప్రశంసించారు.

# రూ.5 కోట్ల చెరువు లీజు దందా

### మత్స్యకారుల పొట్టకొడుతున్నారంటూ ఆరోపణలు
### మత్స్యశాఖ అధికారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం డిమాండ్

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి)**




నల్గొండ జిల్లాలో రూ.5 కోట్ల చెరువు లీజు వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. శాలిగౌరారం ప్రభుత్వ మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి చెందిన సుమారు 1100 ఎకరాల విస్తీర్ణంలోని భారీ చెరువును కొందరు వ్యక్తులు కుమ్మక్కై హైదరాబాద్‌కు చెందిన ఓ దలారికి రూ.5 కోట్లకు సబ్‌లీజుకు ఇచ్చారని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం (టీఆర్ఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వి. రమణ ముదిరాజ్ ఆరోపించారు.ఈ వ్యవహారంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నిజమైన మత్స్యకారులకు చేపల వేట చేసే అవకాశం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. చేపలు పట్టేందుకు ప్రయత్ని స్తున్న మత్స్యకారులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.ఈ అన్యాయంపై బాధిత మత్స్యకారులు నల్గొండ జిల్లా మత్స్యశాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేయడానికి వెళ్లగా, గంటల తరబడి కార్యాలయంలో వేచి ఉండేలా చేసి, చివరకు కనీసం వినతిపత్రం కూడా స్వీకరించకుండా అధికారి వెళ్లిపోయారని రమణ ముదిరాజ్ ఆరోపించారు. పేద మత్స్యకారుల సమస్యలను పట్టించుకోకుండా అధికారులు వ్యవహరించడం దారుణమని విమర్శించారు.అంతేకాకుండా, రూ.5 కోట్ల చెరువు సబ్‌లీజు వ్యవహారంలో సంబంధిత మత్స్యశాఖ అధికారికి కూడా వాటాలు అందుతున్నాయనే బలమైన అనుమానాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పేద మత్స్యకారుల పొట్టకొడుతూ అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని వెంటనే ఆ బాధ్యతల నుంచి తొలగించి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే చెరువు సొసైటీకి చెందిన అర్హులైన సభ్యులందరికీ చేపల వేట చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.బాధిత మత్స్యకారులకు వెంటనే న్యాయం చేయకపోతే కుటుంబ సభ్యులు, పిల్లాజల్లతో కలిసి నల్గొండ జిల్లా కేంద్రంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ఎల్.వి. రమణ ముదిరాజ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వి. రమణ ముదిరాజ్‌తో పాటు బాధిత మత్స్యకారులు, సొసైటీ సభ్యులు నూతి సత్యనారాయణ, పడాల వెంకన్న, గంధసిరి రామ్మూర్తి, వాడపల్లి శివరాజు, పడాల రవి, పడాల నరసయ్య, పడాల యాదగిరి, గొల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పాల శీతలీకరణ కేంద్రాన్ని వేగవంతం చేయాలి

### లక్ష్మీదేవిపల్లిలోని కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే అంశంపై క్షేత్రస్థాయి పరిశీలన



**భద్రాద్రి కొత్తగూడెం ,సెప్టెంబర్ 10(జనం సాక్షి):** చుంచుపల్లిలో విజయ డెయిరీ కోసం ఇప్పటికే స్థలం కేటాయించినందున, ఆ స్థలంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు లక్ష్మీదేవిపల్లిలోని ప్రస్తుత విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఉన్న స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నందున, కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే అంశంపై అధికారులతో సమీక్షించారు.

కేంద్రంలో ప్రతిరోజూ జరుగుతున్న పాల సేకరణ, శీతలీకరణ ప్రక్రియ, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పరికరాల పనితీరు తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిధిలో సుమారు 30 గ్రామాలకు చెందిన 400 మంది రైతులు పాల సేకరణకు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 లీటర్ల వరకు పాలు సేకరిస్తుండగా, పాల ఉత్పత్తి అధికంగా ఉండే సీజన్‌లో రోజువారీ సేకరణ సుమారు 4,000 లీటర్ల వరకు పెరుగుతుందని వివరించారు. ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో పాలను సేకరించి ఖమ్మం డెయిరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కేంద్రంలోని కూలింగ్ ట్యాంక్, స్టోరేజ్ వ్యవస్థ, కంప్రెసర్ తదితర పరికరాలను పరిశీలించారు. ప్రస్తుత భవనం, పరికరాల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అంశంపై అధికారులతో చర్చించారు.చుంచుపల్లిలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే స్థలాన్ని గుర్తించి, విజయ డెయిరీ అధికారులకు సూచించినందున, కేంద్రం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పాల సేకరణ మరియు శీతలీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాన్ని మార్చే సమయంలో పాల సేకరణకు ఎలాంటి అంతరాయం కలగకుండా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన కేంద్రం అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, అదే సమయంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు కూడా ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేసే పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ పరిశీలనలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, విజయ డెయిరీ మేనేజర్ సౌజన్య, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల్లేని ల్యాబ్‌లపై ఉక్కుపాదం మోపాలి

### వైద్యుల అనుసంధానం లేకుండానే రక్త పరీక్షా కేంద్రాల నిర్వహణపై ఆరోపణలు

**అశ్వాపురం సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** మండలంలో ప్రైవేట్ రక్త పరీక్షా కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నప్పటికీ సంబంధిత వైద్యశాఖ అధికారులు సరైన స్థాయిలో పర్యవేక్షించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణలోనే రక్త పరీక్ష కేంద్రాలు నిర్వహించాలని నిబంధన ఉన్న అశ్వాపురం మండలంలో అది ఎక్కడ కానరావడం లేదు. కొన్ని కేంద్రాల్లో అవసరమైన అనుమతులు, అర్హత కలిగిన సిబ్బంది, నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.ప్రైవేట్ ల్యాబ్‌ల నిర్వహణలో నిబంధనలు, అర్హతలు, వైద్యుల అనుసంధానం తదితర అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. పరీక్షలు నిర్వహించే సిబ్బందికి తగిన అర్హతలు ఉన్నాయా? రక్త పరీక్షల నివేదికలు కచ్చితంగా వస్తున్నాయా? పరీక్షలను సూచిస్తున్నది ఎవరు? వాటిని వైద్యపరంగా సమీక్షిస్తున్నది ఎవరు? అనే అంశాలపై సమగ్ర తనిఖీ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఆర్ఎంపీలు తమ పరిధిని దాటి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రాథమిక చికిత్సకు పరిమితం కావాల్సిన వారు రోగులకు వివిధ మందులు ఇవ్వడం, పరీక్షలు సూచించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో సరైన సమయంలో అర్హత కలిగిన వైద్యుడిని సంప్రదించక పోవడం వల్ల రోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**నోటీసులతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలి:**

గతంలో తనిఖీలు, నోటీసులకే పరిమితమవుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఈసారి అన్ని ప్రైవేట్ ల్యాబ్‌లు, రక్త పరీక్షా కేంద్రాలు, ఆర్ఎంపీ క్లినిక్‌లపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు లేని, నిబంధనలు పాటించని కేంద్రాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అర్హత లేని వ్యక్తులు వైద్యం చేయకుండా కఠినంగా పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. అర్హత లేని ఆర్ఎంపీలు అతి ఉత్సాహంతో పరిమితికి మించి వైద్యం చేయడంతో ఇటీవల ప్రాణాలు గాల్లో కలిసిన సందర్భాలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. అటువంటి సంఘటన పునరావతం కాకుండా చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశం కావడంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ల్యాబ్‌ల అనుమతులు, సిబ్బంది అర్హతలు, వైద్యుల అనుసంధానం, పరీక్షల నాణ్యత, ఆర్ఎంపీల వైద్య పరిధి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# టోల్గేట్ స్థల పరిశీలన చేసిన జెసి వేణుగోపాల్

### ప్రైవేటు మార్కెట్ పరిహారం ఇప్పించాలని బాధితుల విన్నపం

**టేకులపల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** వలిగొండ నుంచి కొత్తగూడెం వరకు నిర్మించనున్న 930 పి నేషనల్ హైవే రోడ్డులో టేకులపల్లి మండల పరిధిలోని సులానగర్, సీతారాంపురం గ్రామాల మధ్యన టోల్గేట్ ఏర్పాటు చేయనున్నందున ఆ గ్రామాల మధ్యన గల స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ గురువారం పరిశీలించారు. గతంలో స్థల బాధిత రైతులు పలు అభ్యంతరాలు తెలుపుతూ ఆనాటి జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు టోల్గేట్ స్థల బాధితులతో ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి సుమారు 13 లక్షల పరిహారాన్ని కొంతమంది రైతులకు ఎలాంటి గ్రామసభలు నిర్వహించకుండా, రైతులతో పరిహారం గురించి తెలియపరచకుండా అందించారని, ఆ పరిహారం తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, తీరని అన్యాయం జరుగుతుందని, ప్రస్తుత ప్రైవేటు మార్కెట్ విలువ ప్రకారం అందించాలని బాధితులు జేసీని కోరారు. దీంతో జెసి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ సూచించిన పరిహారం తీసుకున్న రైతులు కలెక్టర్ కోర్టుకు అప్పీలు చేసుకోవాలని, బాధిత రైతులకు న్యాయం జరుగుతుందని, రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని బాధిత రైతులకు జెసి హామీ ఇచ్చారు. జెసి వెంట స్థానిక తహసిల్దార్ ఎల్ వీరభద్రం, సీనియర్ అసిస్టెంట్ యాసిన్ పాషా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మంగ్య, సర్వేయర్, బాధిత రైతులు రాస మల్ల నరసయ్య, బొడ్డు ముత్తయ్య, ధారావతు బాల, కంచర్ల కన్నయ్య కంచర్ల వెంకటేష్, బొడ్డు భద్రయ్య, ధారావత్ రాందాస్, ధారావత్ బాలాజీ, పూనం వెంకన్న తదితరులు ఉన్నారు.






## పాత ఐఫోన్‌ల ధరలు పెరిగాయ్

### ఆ వేరియంట్‌పై ఏకంగా రూ.65వేల పెంపు



**ముంబై(జనంసాక్షి):**స్మార్ట్‌ఫోన్ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూసిన యాపిల్ కొత్త ఫోన్లు వచ్చేశా యి. ఐఫోన్ 18 శ్రేణితో పాటు తొలి ఫోల్డబుల్ ఫోన్ 'ఐఫోన్ డ్యుయో'ను కంపెనీ విడుదల చేసింది. అయితే, అందరూ ఊహించినట్లుగానే వీటి రాకతో పాత ఐఫోన్‌ల ధరలనూ యాపిల్ పెంచేసింది. దీంతో భారత్‌లో ఐఫోన్ 17 ధర 20శాతం మేర పెరిగింది. ఇక, యాపిల్ ఎయిర్ ధర ఏకంగా రూ.65వేలు పెరగడం గమనార్హం.సాధారణంగా యాపిల్ కొత్త ఉత్పత్తులు విడుదల చేసిన తర్వాత పాత ఐఫోన్ల ధరలను తగ్గిస్తుంది. గతంలో ఇదే విధానాన్ని అనుసరించింది. కానీ, ఈసారి మాత్రం అందుకు భిన్నంగా పాత ఐఫోన్ల ధరలను పెంచడం చర్చనీయాంశమైంది. మెమొరీ చిప్‌లు, ర్యామ్‌ల కొరత, ఏఐ డిమాండ్ వంటి కారణాలతో యాపిల్ వ్యయాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఏడాది ఆరంభంలో మ్యాక్‌బుక్‌లు, ఐప్యాడ్‌ల ధరలను కంపెనీ పెంచేసింది. ఇప్పుడు ఐఫోన్ల పెంపునకు కూడా అదే కారణమని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. పెంచిన ధరలు ఇలా ఉన్నాయి.

**ఐఫోన్ 17:**256 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర గతంలో రూ.82,900 ఉండగా.. ఇప్పుడు దాన్ని రూ.99,900కు పెంచింది. అంటే రూ.17వేలు పెరిగింది.

512 జీబీ వేరియంట్ ధర రూ.1,02,900 నుంచి రూ.1,24,900కు చేరింది.

ఐఫోన్ 18 ఫోన్లు వచ్చేశాయ్

**ఐఫోన్ ఎయిర్:**256 జీబీ వేరియంట్ ధర ఇప్పటివరకు రూ.1,19,900 ఉండగా.. దాన్ని రూ.1,49,900కు పెంచింది.

512 జీబీ వేరియంట్ ధర రూ.1,39,900 నుంచి 1,74,900కు చేరింది.

ఇక, 1టీబీ వేరియంట్ ధర అయితే ఏకంగా రూ.65వేలు పెరిగింది. గతంలో ఈ మోడల్ ధర రూ.1,59,900 ఉండగా.. ఇప్పుడు రూ.2,24,900గా కంపెనీ నిర్ణయించింది.

**ఐఫోన్ 17ఈ:**

256జీబీ వేరియంట్ ధర రూ.64,900 నుంచి రూ.79,900కు పెరిగింది.

512జీబీ వేరియంట్ ధర రూ.84,900 నుంచి రూ.1,04,900కు చేరింది.

**ఐఫోన్ 16:**

128జీబీ మోడల్ ధర గతంలో రూ.69,900 ఉండగా.. ఇప్పుడు దాన్ని రూ.89,900గా నిర్ణయించింది. అంటే రూ.20వేలు పెరిగిందన్నమాట.

యాపిల్ కొత్తగా విడుదల చేసిన ఐఫోన్ 18 శ్రేణి ధర రూ.1,64,900 నుంచి మొదలైన సంగతి తెలిసిందే. ఇక, మడతబెట్టే ఐఫోన్ డ్యుయో ప్రారంభ ధర రూ.2,99,900గా ఉంది. సెప్టెంబరు 12 నుంచి ఈ కొత్త ఐఫోన్ల కోసం ప్రీ-ఆర్డర్ చేసుకోవచ్చు. సెప్టెంబరు 18 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

# వరుస నష్టాలకు బ్రేక్..

### స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలుస్వల్ప లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చమురు ధరలు 102 డాలర్ల వద్ద కొనసాగుతున్నప్పటికీ.. బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 74,742.54 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,764.23) స్వల్ప నష్టాల్లో ఆరంభమై.. ఆ తర్వాత కాస్త కోలుకుంది. రోజంతా లాభనష్టాల మధ్య ఊగిసలాడింది. ఇంట్రాడేలో 74,598.47-74,910.96 మధ్య చలించింది. చివరికి 138.36 పాయింట్ల లాభంతో 74,902.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 46.30 పాయింట్ల పెరిగి 23,477.80 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.44గా ఉంది. సెన్సెక్స్30లో పవర్‌గ్రిడ్, యాక్సిస్‌బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, టెక్‌మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, టాటాస్టీల్, ట్రెంట్, ఐటీసీ, అదానీ పోర్ట్స్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 102.20 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,392.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ముడి చమురు భయపెట్టింది**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమై, ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లను మించడంతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆర్థిక సేవలు, చమురు-గ్యాస్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. దీంతో దేశీయ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాలపాలయ్యాయి. సెన్సెక్స్ 3 నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. నిఫ్టీ 23,450 దిగువన ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 34 పైసలు తగ్గి 95.08 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 2.99% పెరిగి 100.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై సూచీలు లాభపడగా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.01 లక్షల కోట్లు తగ్గి రూ.484.20 లక్షల కోట్ల (5.09 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 75,216.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,577.58 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ 75,251.23 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 74,764.23 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 813.35 పాయింట్లు నష్టపోయి 74,764.23 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 203.60 పాయింట్లు తగ్గి 23,431.50 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,571.55 - 23,431.50 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్ 4.55%, ఇన్ఫోసిస్ 4.43%, టెక్ మహీంద్రా 3.87%, టీసీఎస్ 2.26%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.23%, హెచ్‌యూఎల్ 1.89%, బజాజ్ ఫైనాన్స్ 1.42%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.39%, భారతీ ఎయిర్‌టెల్ 1.14%, బీఈఎల్ 1.05%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.03% తగ్గాయి. అదానీ పోర్ట్స్ 3.67%, టాటా స్టీల్ 2.42%, ట్రెంట్ 1.12%, ఎన్‌టీపీసీ 0.53% పెరిగాయి. రంగాల వారీ సూచీలకొస్తే ఐటీ 3.21%, ఫోకస్డ్ ఐటీ 2.99%, స్థిరాస్తి 2.01%, బీమా 1.49%, హౌసింగ్ ఫైనాన్స్ 1.39%, టాప్ 10 బ్యాంక్స్ 1.03%, బ్యాంకింగ్ 0.74% డీలాపడ్డాయి. కమొడిటీస్, ఇంధనం, యుటిలిటీస్, హాస్పిటల్స్, లోహ, విద్యుత్, సేవల రంగాలు రాణించాయి. బీఎస్‌ఈలో 2,600 షేర్లు ప్రతికూలంగా, 1,792 షేర్లు సానుకూలంగా ముగిశాయి. 196 షేర్లలో మార్పు లేదు.

ఐపీఓ సమాచారం

బుధవారమే 6 ఐపీఓలు ప్రారంభం కాగా రెంటోమోజో, కరమార్తా ఇంజినీరింగ్, ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఇష్యూలకు మొదటి రోజే పూర్తి స్పందన లభించింది. స్టీమ్‌హౌస్ ఇండియాకు 42%, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్‌కు 38%, మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్‌కు 17% స్పందన లభించింది. ఈ ఐపీఓలన్నీ ఈ నెల 11న ముగుస్తాయి.కనోహర్ ఎలక్ట్రికల్స్ రూ.1,056 కోట్ల ఐపీఓ రెండో రోజుకే 10.22 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 1.17 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా, 11.95 కోట్ల షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. ఈ నెల 10న ఇష్యూ ముగియనుంది. ధరల శ్రేణి రూ.601-632. గ్లాస్ వాల్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ రూ.428 కోట్ల ఐపీఓకు 8.22 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 1.64 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా, 13.53 కోట్ల షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. గురువారం ఇష్యూ ముగియనుంది. ధరల శ్రేణి రూ.172-182.

ప్రసోల్ కెమికల్స్ రూ.500 కోట్ల ఐపీఓకు రెండో రోజుకు 72% స్పందన దక్కింది. కంపెనీ 54.43 లక్షల షేర్లను ఆఫర్ చేయగా, 39.43 లక్షల షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. ధరల శ్రేణి రూ.643-676. గురువారం ఇష్యూ ముగియనుంది. స్థిరాస్తి డెవలపర్ అయిన ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ రూ.351 కోట్ల ఐపీఓ ముగిసేసరికి 121 రెట్ల అధిక స్పందన దక్కింది. కంపెనీ 2.24 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా, 272 కోట్ల షేర్లకు మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. ధరల శ్రేణి రూ.118-124.2026-27లోనే ప్రిజం ఐపీఓ: ఆతిథ్య సంస్థ ఓయో మాతృ సంస్థ ప్రిజం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో రూ.6,650 కోట్ల నిధుల సమీకరణ కోసం ఐపీఓకు రావాలని లక్ష్యం పెట్టుకుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు రితేశ్ అగర్వాల్ తెలిపారు.జిందాల్ సుప్రీమ్ ధరల శ్రేణి రూ.88-93: జిందాల్ సుప్రీమ్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.88-93గా నిర్ణయించింది. రూ.125 కోట్ల నిధుల సమీకరణ కోసం ఈ నెల 16-18 తేదీల్లో ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు రాబోతోంది.

ఎల్ అండ్ టీకి భారీ ఆర్డర్

భారత ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ నుంచి భారీ ఆర్డరు దక్కించుకున్నట్లు లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) బుధవారం తెలిపింది. కంపెనీ వర్గీకరణ ప్రకారం, భారీ ఆర్డరు విలువ రూ.2,500-5,000 కోట్ల మధ్య ఉంటుంది.

## హీరో మోటార్స్ రూ.1000 కోట్ల ఐపీఓ..

### ప్రైస్ బ్యాండ్ ఎంతంటే?

ఆటో విడిభాగాల తయారీ సంస్థ హీరో మోటార్స్ లిమిటెడ్ ఐపీఓకు సిద్ధమైంది రూ.1000 కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. సెప్టెంబర్ 16న సబ్‌స్క్రిప్షన్ మొదలై.. సెప్టెంబర్ 18న ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.79-84గా కంపెనీ నిర్ణయించింది.ఐపీఓలో భాగంగా రూ.600 కోట్లు తాజా షేర్లు, రూ.400 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. ఐపీఓ నిధులను రుణాల చెల్లింపునకు, కంపెనీ కార్యకలాపాలకు వినియోగించనుంది. కంపెనీ షేర్లు సెప్టెంబర్ 23న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. హీరో మోటార్స్ అతిపెద్ద ఆటోమెటివ్ టెక్నాలజీ కంపెనీ. ఇది అమెరికా, యూరప్, భారత్ వంటి దేశాల్లోని గ్లోబల్ వాహన తయారీ సంస్థలకు పవర్‌ట్రెయిన్ సొల్యూషన్స్‌ను రూపొందించి సరఫరా చేస్తుంది.




**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.40

వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

₹ 1,64,446 (22 క్యారెట్లు)

₹ 1,79,396 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 2,55,000

# పండగలకు తీపి కబురు

### 2.5 లక్షల టన్నుల పంచదార విక్రయానికి రిఫైనర్లు సిద్ధం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పండగలు సమీపిస్తున్నాయి. ఈ సమయంలో తీపి వంటకాలకు పంచదార వినియోగం ఎక్కువగా ఉం టుంది. అయితే అకస్మాత్తుగా చక్కెర ధర పెరగడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతుండగా, అప్రమత్తమైన ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలోనే దేశీయ చక్కెర రిఫైనరీ సంస్థలు కూడా దేశీయ విపణిలో సుమారు 2.5 లక్షల టన్నుల చక్కెర విక్రయించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు శ్రీ రేణుకా షుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ బుధవారం తెలిపారు. ఇండియన్ షుగర్ అండ్ బయో-ఎనర్జీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఇస్మా) నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా విలేకరులతో కుమార్ మాట్లాడారు. దేశంలో శ్రీ రేణుకా షుగర్స్‌తో పాటు మరొకటి మాత్రమే ప్రత్యేక చక్కెర రిఫైనరీలు ఉన్నాయి. ఇవి అడ్వాన్స్ లైసెన్సింగ్ స్కీమ్ కింద ముడి చక్కెరను దిగుమతి చేసుకుని, దానిని శుద్ధి చేసి రిఫైన్డ్ షుగర్‌గా మార్చి ఎగుమతి చేస్తాయి. 'శుద్ధి చేసిన చక్కెరను ఇకపై ఎగుమతి చేయకుండా, దేశీయ మార్కెట్లోనే విక్రయించాలని' సూచిస్తూ గత నెలలో ప్రభుత్వం ఈ రిఫైనరీలకూ ఆదేశాలు జారీ చేసింది. పండుగల సీజన్‌లో దేశీయంగా చక్కెర సరఫరా పెంచి, ధరలు అదుపులో ఉంచేందుకూ ఈ చర్య చేపట్టింది. సుంకాలు లేకుండా 10 లక్షల టన్నుల ముడిచక్కెర దిగుమతికీ ప్రభుత్వం అనుమతులిచ్చింది. భారీఎత్తున పంచదార నిల్వలపైనా ఆంక్షలు విధించింది. ప్రభుత్వ చర్యల తర్వాత, దేశీయంగా చక్కెర ధరలు తగ్గాయని కుమార్ తెలిపారు. ప్రస్తుతం మిల్లుల వద్ద ధర కిలోకు సుమారు రూ.43-44గా ఉంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పంచదార ధర (కిలో సుమారు రూ.50) కంటే ఇది తక్కువ.

**చక్కెర దిగుమతులు ఇప్పటికీ లాభదాయకమే:ఇస్మా**

దేశీయంగా చక్కెర ధరలు తగ్గుతున్నా, విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం ఇప్పటికీ వాణిజ్యపరంగా లాభదాయకమేనని ఇస్మా అధ్యక్షుడు నీరజ్ షిర్గావ్‌కర్ తెలిపారు. రెండు వారాల క్రితం కిలోకు రూ.65-67గా ఉన్న ఎక్స్-మిల్ పంచదార ధర ప్రస్తుతం కిలోకు రూ.43-44కు తగ్గిందని.. అయితే రిటెయిల్ విపణిలో ఈ ప్రభావం కనిపించడానికి ఒకటి నుంచి రెండు వారాలు పట్టొచ్చని తెలిపారు.

**8 లక్షల టన్నుల దిగుమతికి దరఖాస్తు**

సుంకాలు లేకుండా ప్రభుత్వం 10 లక్షల టన్నుల ముడిచక్కెర దిగుమతికి ప్రభుత్వం అనుమతులివ్వగా, ఇప్పటివరకు మిల్లులు 8 లక్షల టన్నుల దిగుమతికి దరఖాస్తు చేసుకున్నాయని సమాచారం. అయితే ప్రపంచ మార్కెట్లో చక్కెర సరఫరాలు తగ్గడం, మనదేశం కూడా కొనుగోలుకు ముందుకు రావడంతో అంతర్జాతీయంగా చక్కెర ధర పెరిగింది. ఇందువల్ల దిగుమతులు తమకు లాభదాయకం కావేమోనని మిల్లర్లు ఆందోళన చెందుతున్నారు. కొరత నివారణకు దేశీయంగా చక్కెర మిల్లులు సాధారణం కంటే ముందుగానే చెరకు క్రషింగ్ ప్రారంభించాల్సి వస్తే, ఎదుర్కొనే నిర్వహణాపరమైన సమస్యలను ఇస్మా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రాబోయే మార్కెటింగ్ సంవత్సరం (అక్టోబరు-సెప్టెంబరు)లో చక్కెర ఉత్పత్తి, ఇథనాల్‌కు కేటాయింపుల విషయంలో పరిశ్రమ ఆశావహంగా ఉందని నీరజ్ చెప్పారు. 2025-26 మార్కెటింగ్ సంవత్సరానికి (ఈ నెలాఖరు వరకు) చక్కెర ఉత్పత్తి అంచనాను గతంలో ప్రకటించిన 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు ప్రభుత్వం తగ్గించింది. దేశంలో వార్షిక చక్కెర డిమాండ్ సుమారు 280-285 లక్షల టన్నులుగా ఉంటుందన్నది అంచనా.

## యాపిల్ ఈవెంట్‌లో తళుక్కుమన్న టిమ్‌కుక్..

### నేను కాదంటూ సరదా వ్యాఖ్యలు

యాపిల్‌పార్క్‌లో జరిగిన 'సర్‌ప్రైజ్ అండ్ షైన్' ఈవెంట్ ఆరంభంలో యాపిల్ మాజీ సీఈఓ టిమ్ కుక్ తళుక్కున మెరిశారు. కొన్ని క్షణాల పాటు కనిపించి తనదైన శైలిలో వేదికను కొత్త సీఈఓ జాన్ టెర్నస్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఈ వీడియో అందరినీ ఆకట్టుకుంటోంది. ఈవెంట్ ఆరంభంలో స్క్రీన్‌పై టిమ్ కుక్ ముందుగా కనిపించి.. 'నో నో నో, నేను కాదు.. ఆయన మీ బాస్, మీ ఓపెనర్' అంటూ నవ్వుతూ జాన్ టెర్నస్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఆ తర్వాత టెర్నస్ ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్, ఫోల్డబుల్ డ్యుయో వివరాలను పంచుకున్నారు. అయితే, యాపిల్ ఈవెంట్‌లతో టిమ్ కుక్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. 15 ఏళ్లుగా సీఈఓ బాధ్యతలను నిర్వహించారు. ఐఫోన్ ఆవిష్కరణ, హార్డ్‌వేర్ లాంచింగ్‌లు ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. కాగా, టిమ్‌కుక్ స్థానంలో యాపిల్ కొత్త సీఈఓగా జాన్ టెర్నస్ సెప్టెంబర్ 1న బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. యాపిల్ కీలకమైన సెప్టెంబర్ ఈవెంట్‌ను జాన్ టెర్నస్ మొదటిసారి సీఈఓగా నడిపించి, కంపెనీలో కొత్త అధ్యాయానికి నాంది పలికారు.



## బ్యాంకుల దేశవ్యాప్త సమ్మె..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ బ్యాంకు యూనియన్లు సమ్మె తలపెట్టిన నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు అడ్వైజరీ జారీ చేసింది. సమ్మె కారణంగా సెప్టెంబర్ 11న బ్యాంకు సేవలు అందుబాటులో ఉండవని, అందువల్ల ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టింది. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఈ నెల 11న సమ్మె నిర్వహించనుండడంతో తమ బ్యాంకు శాఖలు మూతపడనున్నాయని ఎస్‌బీఐ తెలిపింది. నగదు అవసరాల కోసం ఏటీఎంలు, డిపాజిట్ వెండింగ్ మెషిన్లను వినియోగించుకోవాలని ఖాతాదారులకు సూచించింది. ప్రత్యామ్నాయంగా తమ కస్టమర్ సర్వీస్ పాయింట్లనూ వినియోగించుకోవాలని తెలిపింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఇతర డిజిటల్ వేదికలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని తెలిపింది. వినియోగదారులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు సహా పలు డిమాండ్లపై యూఎఫ్‌బీయూ సమ్మెకు పిలుపునిచ్చింది. బ్యాంకుల పనితీరు ఆధారంగా ఉద్యోగులకు చెల్లించే ప్రోత్సాహకాలను సమీక్షించాలని, ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిలిపివేయాలన్న డిమాండ్లతో సమ్మె చేపడుతోంది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో మరోసారి సమ్మె చేస్తామని తెలిపింది. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగి రాకుంటే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని బ్యాంక్ యూనియన్లు హెచ్చరిస్తున్నాయి.

## వచ్చే ఏడాది జులైలోగా.. పైలట్లందరికీ డ్రగ్ పరీక్షలు

### డీజీసీఏ

అన్ని విమానయాన సంస్థల పైలట్లకు డ్రగ్ పరీక్షలు నిర్వహించాలని డీజీసీఏ ఆదేశించింది. వచ్చే ఏడాది జులై నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఎయిర్‌లైన్లకు సూచించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, పైలట్ల డ్రగ్ పరీక్షలకు సంబంధించిన కొత్త నిబంధనల ముసాయిదాను సంబంధిత వర్గాలతో చర్చల అనంతరం ఈ నెలాఖరులోగా డీజీసీఏ ఖరారు చేసే అవకాశం ఉందని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు.గత నెలలో థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానం గాల్లో తీవ్ర కుదుపులకు లోనుకావడంతో 24 మంది ప్రయాణికులు గాయపడిన విషయం తెలిసిందే. అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ప్రాథమిక పరీక్షలో పైలట్-ఇన్- కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. అనంతరం సైకోయాక్టివ్ పరీక్షను నిర్వహించగా.. గంజాయి తీసుకున్నట్లు నిర్ధరణ అయ్యింది. దీంతో ఆ పైలట్‌ను ఎయిరిండియా విధుల నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలోనే అన్ని విమానయాన సంస్థల పైలట్లకు డ్రగ్ పరీక్షలు నిర్వహించాలంటూ డీజీసీఏ నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది.భారత్‌లో వివిధ విమానయాన సంస్థల్లో 12 వేలమందికి పైగా పైలట్లు ఉన్నారు. ప్రస్తుతం పైలట్లకు ర్యాండమ్ పద్ధతిలో డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీజీసీఏ సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ ప్రకారం.. ఏటా 10 శాతం మంది పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు తదితరులకు ఈ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఘటన నేపథ్యంలో.. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లలోని పైలట్లందరికీ డ్రగ్ టెస్టులు నిర్వహించాలని ఎయిరిండియా గ్రూప్ ఇప్పటికే నిర్ణయించింది.



## పెరిగిన ఎన్ఎండీసీ ఇనుప ఖనిజం ధర

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

ప్రభుత్వ రంగ గనుల సంస్థ ఎన్ఎండీసీ, అత్యధిక నాణ్యత కలిగిన ఇనుప ఖనిజం ధరలను సవరించింది. 65.5% ఐరన్ నాణ్యత ఉండే లంప్ ఓర్ ధరను టన్నుకు రూ.150 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో టన్ను లంప్ ఓర్ ధర రూ.5,400కి చేరింది. ఫైన్స్ రకం ధరల్లో మార్పు చేయకుండా రూ.4,500గా ఉంచింది.ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖప ట్నంలో నిర్మిస్తున్న నిల్వ, బ్లెండింగ్ యార్డ్ నుంచి ఇనుప ఖనిజం తీసుకునేం దుకు ఎన్ఎండీసీతో స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. విజయనగరంలోని తన ఉక్కు కర్మాగారం కోసం 61-63% నాణ్యత ఉన్న ఫైన్స్‌ను క్రమం తప్పకుండా పొందేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎస్ఈఐ ఎల్ వెల్లడించింది. విశాఖలోని నిల్వ కేంద్రం నుంచి నేరుగా ఖనిజాన్ని సేకరించడం వల్ల, తమకు రవాణా వ్యయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొంది. సమీప భవిష్యత్తులో చేపడుతున్న ఉత్పత్తి విస్తరణకు ఈ ఖనిజ సరఫరా తోడ్పడుతుందని వివరించింది.

## ఏఐ కంపెనీలు మన జీవితాలతో ఆడుకుంటున్నాయ్

### బాధ్యతా రహితంగా వినియోగం

### ఆంథ్రోపిక్ ఏఐ పరిశోధకుడు జాకబ్ కోక్సన్

**దిల్లీ:** 'ఓపెన్‌ఏఐ సహా దిగ్గజ ఏఐ (కృత్రిమమేధ) కంపెనీలు మనుషుల జీవితాలతో ఆడుకుంటున్నాయి. అవి బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తూ ఒక సూపర్‌ఇంటలిజెన్స్ అభివృద్ధి రేసులో పరుగులు తీస్తున్నాయ'ని జాకబ్ కోక్సన్ పేర్కొన్నారు. ఆంథ్రోపిక్‌లో ఏఐ పరిశోధకుడిగా ఉన్న జాక్సన్ కంపెనీకి రాజీనామా సమర్పించిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. ఓపెన్‌ఏఐ, ఆంథ్రోపిక్ సంస్థల్లో గత మూడేళ్లలో కోక్సన్ ప్రీ ట్రెయినింగ్ రీసెర్చ్ నిర్వహించారు. 'నేను ఇవాళ రాజీనామా చేశాను. ఓపెన్‌ఏఐ, ఆంథ్రోపిక్‌ల్లో మూడేళ్ల పాటు పనిచేశా. రెండు కంపెనీలూ బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదు. మన జీవితాలను ఆడుకునే, స్వయంగా తమకు తాము మెరుగయ్యే సూపర్ ఇంటెలిజెన్స్ రేసులో అవి ఉన్నాయ'న్నారు. ఏఐ ల్యాబ్‌ల మధ్య ఉన్న పోటీ రేసు హద్దులు దాటిందన్నారు. ఏదైనా హ్యాక్ చేస్తాయ్..: 'దేనినైనా హ్యాక్‌చేసే సూపర్‌హ్యూమన్ వ్యవస్థల దిశగా సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. రాత్రికి రాత్రి ఏ రంగంలోనైనా ఇది విప్లవాన్ని తీసుకొస్తుంది. మన శక్తిని, వనరులను లాగేసుకుంటుంది. ఏ ఇతర మానవ చర్య కూడా తలపెట్టలేనంత ప్రమాదాన్ని ఏఐ తీసుకురాగలద'ని జాకబ్ సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. ఇటీవలి హగ్గింగ్ ఫేస్ హ్యాకింగ్ పరిణామాన్ని గుర్తు చేశారు. ఇటీవలే ఓపెన్‌ఏఐ ముఖ్య శాస్త్రవేత్త జాకుబ్ పకోచి సైతం ఏఐ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ భద్రతా ప్రమాణాలు ఏర్పాటయ్యే వరకు, సంస్థలు తమ మోడళ్ల వేగాన్ని స్వచ్ఛందంగా తగ్గించుకోవాలనే సూచించారు. ఆంథ్రోపిక్‌లో ప్రస్తుతం అలైన్‌మెంట్ సైన్స్ లీడ్‌గా ఉన్న ఎవాన్ హబింగర్ మాట్లాడుతూ 'సూపర్‌ఇంటెలిజెన్స్ దిశగా వెళ్లే ఆలోచన కంపెనీ లేద'ని స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
11 సెప్టెంబర్ 2026

# మూడేళ్లుగా రూ.29 లక్షల బ్రేక్‌ఫాస్ట్ బిల్లులు పెండింగ్

- అప్పులు చేసి వడ్డీలు చెల్లిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు
- నెలవారీ బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్
- విద్యార్థులకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి
- పెండింగ్ బిల్లులు విడుదల చేయకుంటే ఉద్యమం



**హయత్‌నగర్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. హయత్‌నగర్‌లో గురువారం నిర్వహించిన కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో సీఐటీయూ హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా సుమారు రూ.29 లక్షల బ్రేక్‌ఫాస్ట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. టోకెన్ నంబర్లు వచ్చినప్పటికీ ఇప్పటివరకు కార్మికుల ఖాతాల్లో నగదు జమ కాలేదన్నారు. బిల్లుల జాప్యంతో కుటుంబ అవసరాలకు అప్పులు చేసి, వాటికి వడ్డీలు చెల్లిస్తూ కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇకపై నెలవారీ బిల్లులు ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా సీఐటీయూ మాజీ ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలకు సరఫరా చేస్తున్న బియ్యంలో పురుగులు వస్తున్నాయని, నాణ్యతను అధికారులు నిరంతరం పరిశీలించాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యుడు ముషం నరహరి మాట్లాడుతూ కార్మికులు సొంత డబ్బుతో సరుకులు సమకూర్చుకుని విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని తెలిపారు. పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించి, భవిష్యత్తులో జాప్యం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

# బౌరంపేట దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు

**మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్**



**నిజాంపేట్ సెప్టెంబర్ 10 జనం సాక్షి :** బౌరంపేట్ దళితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.గురువారం ఆయన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దుండిగల్ గండి మైసమ్మ మండలం లోని బౌరంపేట ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక దళితులు సర్వే నెంబర్ 472 ఎకరాలను పొందిన స్థలాన్ని సందర్శించారు. బుధవారం బౌరంపేట్ మాజీ సర్పంచ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బౌరంపేట దళితులను ఉద్దేశించి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా వ్యవసాయం జీవనాధారంగా చేసుకొని జీవించిన దళితులకు ప్రభుత్వం ఏ పరిహారం ఇవ్వకుండానే అసైన్మెంట్ స్థలాలను ప్రభుత్వం తిరిగి తీసుకోవడం ధర్మం కాదని అన్నారు. దుండిగల్ లో అసైన్మెంట్ స్థలాలను ప్రభుత్వం తీసుకుంటున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఎకరాకు 700 గజాల స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రభుత్వం ఇవ్వడానికి ఒప్పుకుందని అన్నారు. అలాగే బౌరంపేట్ లో సర్వే నెంబర్ 472 లో కూడా ఇదే విధానాన్ని పాటించి ప్రతి ఎకరా నుంచి అసైన్డ్ దారులకు 1000 గజాల స్థలాన్ని అన్ని హక్కులతో అసైన్మెంట్ దారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బౌరంపేట్ సర్వే నెంబర్ 166 కు చెందిన అసైన్డ్ భూమి దారులు కూడా హాజరై తమకు కూడా ఎలాంటి పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదని ఈటెల రాజేందర్ కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 166 లో మొత్తం 450 ఎకరాలు స్థలం ఉండగా అందులో పోలీస్ డిపార్ట్మెంట్ కు 50 ఎకరాలు, స్మశాన వాటికకు 10 ఎకరాలు, డంపింగ్ యార్డ్ కు 10 ఎకరాలు, డబల్ బెడ్రూమ్ ఇళ్లకు 10 ఎకరాలు కేటాయించినట్లు వారు ఎంపీ ఈటెల రాజేందర్ కు వివరించారు. సుమారు 140 ఎకరాలు ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్న రైతుల అదుపులో భూమి ఉన్నట్లు తెలిపారు. దీంతో సర్వే నెంబర్ 166 అసైన్మెంట్ దారులకు కూడా న్యాయం జరిగే వరకు పోరాటం చేద్దామని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు. కార్యక్రమానికి బౌరంపేట దళితులు వందలాదిగా హాజరయ్యారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ఈ సమావేశానికి రానున్నారని ప్రచారం జరిగిన ఆయన ఈ సమావేశానికి రాలేదు. ఈ సమావేశంలో బౌరంపేట దళిత నేతలు డప్పు కృష్ణ, బాలా గారి నరసింహ, కొమ్ము యాదయ్య, చింతకింది రమేష్, చింతకింది ముత్తమ్మ, కొమ్ము వీరయ్య, బలగారి మల్లేష్, చింతకింది రాములమ్మ, అగ్రి నరసింహ, తదితరులు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

# ఫేక్ అకౌంట్లతో బీఆర్‌ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం

- 'సంధ్యా రావు' ఫేక్ ఐడీ వెనుక ఉన్నది ఎవరు?
- ఫేక్ అకౌంట్ సృష్టికర్తను వెంటనే అరెస్ట్ చేయాలి
- ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎంజీఆర్



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంపై ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజీఆర్) తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.బీఆర్‌ఎస్‌పై తప్పుడు ప్రచారం చేసేందుకు నకిలీ సోషల్ మీడియా ఖాతాలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ వేదిక గా సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఫేక్ నాటకానికి తెరలేపారని ఎంజీఆర్ విమర్శించారు. 'సంధ్యా రావు' పేరుతో నకిలీ సోషల్ మీడియా ఖాతాను సృష్టించి, దాని ద్వారా బీఆర్‌ఎస్‌పై బురద చల్లే ప్రయత్నం చేయడం దౌర్భాగ్యకరమన్నారు.ఫేక్ పోస్టులను అసెంబ్లీలో చదువుతూ ముఖ్యమంత్రి పాలనపై మాట్లాడాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నా రని విమర్శించారు. 'ఓటుకు నోటు' కేసులో రేవంత్ రెడ్డి దొరికి పోయిన చరిత్ర ఉందని మన్నె గోవర్ధన్ రెడ్డి అన్నారు.ఇప్పుడు ఫేక్ ఐడీల వ్యవహారం లోనూ మళ్లీ దొరికిపోయారని విమర్శించారు. ప్రజ లకు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక ఇలాంటి రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించా రు. కేసీఆర్ పై విషప్రచారం చేసేందుకు 'సంధ్యా రావు' పేరుతో ఫేక్ ఐడీ సృష్టించి, దానికి 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవిని జోడించ డం వెనుక ఉన్న ఉద్దేశాన్ని బయటపెట్టాలని ఎంజీఆర్ డిమాండ్ చేశారు.అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఆ ఖాతా గురించి ప్రస్తావించిన వెంట నే అది మూసివేయడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.ఈ ఫేక్ అకౌంట్‌ను ఎవరు సృష్టించారు? ఎవరు నిర్వహించారు? ఎవరి ఆదేశా లతో పోస్టులు పెట్టారు? అనే అంశాలపై పోలీసులు వెంటనే దర్యాప్తు చేసి వాస్తవాలను ప్రజల ముం దుంచాలని కోరారు. 'సంధ్యా రావు' పేరుతో ఉన్న నకిలీ అకౌంట్ క్రియేటర్ ను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని మన్నె గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఖాతాను నిర్వహించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిజాలు బయట కు వస్తాయనే భయంతో అకౌంట్‌ను మూసివేశా రన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని సవాల్ చేశారు. ఎన్ని ఫేక్ అకౌంట్లు సృష్టించినా, ఎన్ని నకిలీ పోస్టులు పెట్టినా తెలంగాణ ప్రజల మనసుల్లో కేసీఆర్ స్థానాన్ని చెరిపివేయడం ఎవరి తరం కాదని ఎంజీ ఆర్ అన్నారు. హనుమంతుడి గుండెల్లో శ్రీరాము డు ఉన్నట్లే తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ భద్రంగా ఉన్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభు త్వం రాజకీయ విమర్శలు, సోషల్ మీడియా ప్రచా రాలపై కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నిక ల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని మన్నె గోవర్ధన్ రెడ్డి హితవు పలికారు.

# జీహెచ్ఎంసీలో విలీనం అనాలోచితం

- ఆదిభట్ల, తుర్కయాంజాల్‌ను కలపడం ప్రజావ్యతిరేక నిర్ణయం
- పన్నులు, ఇంటి పన్నులు పెరిగే అవకాశం
- ఇబ్రహీంపట్నం అభివృద్ధిపై ప్రభావం పడుతుంది



**రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఆదిభట్ల, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడం ప్రజావ్యతిరేక నిర్ణయమని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదిభట్లలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతాల విలీనం వల్ల ఇబ్రహీంపట్నం నియోజకవర్గాని కి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఆదిభట్ల, తుర్కయాంజాల్ ప్రాంతాల ఆదాయం, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు నియోజక వర్గ భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. పరిపాలనా మార్పులతో భవిష్యత్తులో పన్నులు, ఇంటి పన్నులు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొంగరకలాన్‌లో కలెక్టరేట్, ఫాక్స్‌కాన్ వంటి ప్రాజెక్టులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చాయని పేర్కొన్నారు. పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కీలకమైన పరిపాల నా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. నియోజకవర్గ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, విలీనం వల్ల భవిష్యత్తులో నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆయన వెంట మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బుగ్గ రాములు, రాజు తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ స్వీపర్ మృతి

**అమీర్‌పేట్ / బోరబండ :** రోడ్డు దాటుతున్న వృద్ధుడిని గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వెంగల్ రావ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసు ల వివరాల ప్రకారం.. వెంగల్‌రావ్‌నగర్‌కు చెందిన కొల్లూరు రాకేష్ (36) తండ్రి కొల్లూరు కృష్ణ (64) ఎర్రగడ్డ చెస్ట్ ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. గురువారం రాత్రి సుమారు 7:45 గంటల సమయంలో వెంగల్‌రావ్‌నగర్‌లోని ఐసీఐసీఐ బ్యాంక్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా కల్యాణ్‌నగర్ సిగ్నల్ నుంచి ఎస్‌ఆర్‌నగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా, అతివేగంగా నడుపుతూ కృష్ణను ఢీకొట్టాడు.

ఈ ప్రమాదంలో కృష్ణ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడి కోసం దర్యాప్తు చేస్తున్నారు

# యువ కార్మికులకు రూ.30 వేల కనీస వేతనం ఇవ్వాలి

**మేడ్చల్ జిల్లాలో డిమాండ్స్ డే.. డీసీఎల్‌కు వినతిపత్రం**




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** యువ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ యంగ్ వర్కర్స్ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే నిర్వహించారు. జిల్లాలోని పరిశ్రమలు, కంపెనీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్ టర్మ్, ఎన్‌ఎపిఎస్, ఎన్‌ఎటిఎస్, అప్రెంటిస్ తదితర నాన్--పర్మినెంట్ యువ కార్మికులకు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. అనంతరం డీసీఎల్‌కు వినతిపత్రం అందజేశా రు. ఈ సందర్భంగా తెలంగాణ యంగ్ వర్కర్స్ స్టీరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణ ంగా యువ కార్మికులకు కనీసం రూ.30వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్ టర్మ్, ఎన్‌ఎపిఎస్, ఎన్‌ఎటిఎస్ కార్మికులకు సమాన వేతనం, సమాన సౌకర్యాలు కల్పించాలన్నారు. మేడ్చల్ జిల్లా యంగ్ వర్కర్స్ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ కె.ఎస్.ఎస్.మణికంఠ మాట్లాడుతూ.. కార్మికులంద రికీ పి ఎఫ్, ఈఎస్ ఐ, సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు, తాగునీరు, మరుగుదొడ్లు, క్యాంటీన్, రవాణా వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలన్నారు. మహిళా కార్మికులకు సమాన వేతనం, ఉద్యోగ భద్రత, సురక్షితమైన పని వాతావర ణం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల అన్యాయ తొలగింపులు, వేధింపులు, వివక్షను అరికట్టి కార్మిక చట్టాలను ఉల్లంఘించే యాజమాన్యా లపై చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. యువ కార్మికుల హక్కులు, భవిష్యత్తు భద్రత కోసం పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిక్స్‌డ్ టర్మ్ నాన్ రెగ్యులర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, పాలడుగు సుధాకర్, ఎపిరాక్ పరిశ్రమ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రాంబాబు, సహాయ కార్యదర్శి జి.ఎస్.దుర్గాప్రసాద్ యువ కార్మికులు పాల్గొన్నారు.

# రామంతాపూర్ పెద్ద చెరువుకు మహర్దశ

- రూ.19 కోట్లతో 18.23 ఎకరాల్లో అభివృద్ధి పనులు
- పార్కు, చిన్నారుల ఆటస్థలం, ఓపెన్ జిమ్ ఏర్పాటు
- పనుల పురోగతిని పరిశీలించిన హైడ్రా కమిషనర్
- హబ్సిగూడ ప్రజల సమస్యలకు పరిష్కారం



**ఉప్పల్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్త, హైడ్రా అధికారులు ఉన్నారు. మొత్తం 18.23 ఎకరాల విస్తీర్ణంలో రూ.19 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పార్కు, చిన్నారుల ఆటస్థలం, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి తెలిపారు. చెరువు అభివృద్ధితో స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. చెరువు అభివృద్ధి, స్థానికులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై కమిషనర్‌తో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హబ్సిగూడ సీనియర్ నాయకుడు ధర్మానాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎత్తిపోతల పథకం భూసేకరణపై గ్రామసభ

**బొంరాస్‌పేట:** మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణపై శుక్రవారం దుద్యాల్లో గ్రామసభ నిర్వహించను న్నట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. మధ్యాహ్నం 12 గం.కు గ్రామసభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రైతులు తప్పనిసరిగా హాజరై భూసేకరణకు సంబంధించి తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆమె కోరారు.

### ఆరోగ్యమే మహాభాగ్యం..

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**పరిశుభ్రత, పోషకాహారాన్ని నిరంతరం పర్యవేక్షించాలి : డీఎంహెచ్ఓ డా.కె.ఆనంద్**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా పాఠశాలలో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.ఆనంద్ సూచించారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హస్మత్‌పేట్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ఆహార నిల్వలు, స్టాక్ రిజిస్టర్, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. వంటశాలలో ఆహార నాణ్యత, పరిశుభ్రతను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన వాటిని నిరంతరం శుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించి ఆర్‌బీఎస్‌కే బృందాల వైద్య పరీక్షల రికార్డులను తనిఖీ చేశారు. పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, ఆరోగ్య వివరాల నమోదు, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

# కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తాం

**టీపీసీసీ సమన్వయకర్తగా గౌరీ సతీష్ ఎంపిక**

**మొయినాబాద్, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు కృషి చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి నక్కలవల్లి గౌరీ సతీష్ అన్నారు. 33 జిల్లాలకు టీపీసీసీ సమన్వయకర్తలను నియమించగా, సికింద్రాబాద్ జిల్లా సమన్వయకర్తగా తనను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని ప్రజా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలకు వాస్తవాలతో వివరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో తనకు బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి గౌరీ సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

### మున్సిపల్ కార్మికులకు మూడు నెలల

# బకాయి వేతనాలు చెల్లించాలి

**సీఐటియు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్**




**శామీర్ పేట్, సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** మూడు చింతలపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇతర కార్మికులకు మూడు నెలలుగా నిలిచిపోయిన వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు . ఈ మేరకు యూనియన్ ప్రతినిధులు, కార్మికులు మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీతాలు అందక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయ న్నారు. నిత్యావసరాలు, పిల్లల విద్య, వైద్య ఖర్చుల కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి కార్మికుల పీఎఫ్ సొమ్ము ఖాతాల్లో జమ చేయలేదని, వెంటనే బకాయిలను జమ చేయ్యాలని డిమాండ్ చేశారు.

బకాయి వేతనాలను ఒకేసారి విడుదల చేయడంతోపాటు ఇకపై ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీలోపు జీతాలు చెల్లించేలా చర్యలు తీసు కోవాలని కోరారు. అధికారులు తక్షణమే స్పందించి కార్మికులకు న్యాయం చేయ్యాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే.ఉన్నికృష్ణ, మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రశాంత్, బాలయ్య, లక్ష్మయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



# పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు వెడల్పు చేయాలి

**ఎంపీ ఈటల రాజేందర్‌కు కాలనీవాసుల వినతి**

**మల్కాజిగిరి సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** వినాయకనగర్, కాకతీయనగర్ పరిధిలో గతంలో ప్రతిపాదించిన ఆర్‌యూబీ, ఆర్‌వోబీ అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సంతోషిమానగర్, చంద్రగిరి కాలనీవాసులు ఎంపీ ఈటల రాజేందర్ ను కోరారు. ఇటీవల కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం అలైన్‌మెంట్ మార్చి తమను బలిపశువులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలాలి కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం బాధితులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, తహసీల్దార్ వచ్చి ఇక్కడి రోడ్డును విస్తరిస్తున్నామని చెప్పేంతవరకు తమకు అలైన్‌మెంట్ మారిన విషయం తెలియదన్నారు. తీవ్ర రద్దీ ఉండే డీమార్ట్ ప్రాంతంలో రోడ్డు విస్తరించకుండా, ప్రత్యామ్నాయంగా ఉండే చిన్న రహదారిని వెడల్పు చేయాలని చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగించే వినాయకనగర్ చౌరస్తా నుంచి భరత్‌నగర్ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు.

ప్రధాన రహదారిని విస్తరించకపోవడం వల్ల రాత్రి సమయాల్లో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు.కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయకుండా, గత ప్రణాళిక ప్రకారమే వినాయకనగర్ నుంచి భరత్‌నగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి తమకు న్యాయం చేయాలని ఎంపీని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రసాద్ చౌదరి, సాగర్, సీతారామవర్మ, శ్రీధర్, లక్ష్మారెడ్డి, బాలకృష్ణ, సంతోష్, ఫొటో స్టూడియో రమేశ్, చిట్టి, కన్నయ్య, గోపీనాథ్, సంజీవరెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున కాలనీ మహిళలు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతో బంగారు భవిష్యత్తు

- జెఎన్‌టియు వైస్ ఛాన్సర్ డాక్టర్ టి కృష్ణ కుమార్ రెడ్డి
- జోగిన పల్లి బిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా స్నాతకోత్సవం
- విద్యార్థులకు గోల్డ్ మెడల్ పట్టాలు పంపిణీ



**మొయినాబాద్ సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు జీవితాలు ఉన్నాయని విద్యార్థులు ఉద్యోగాలతో పాటు సమాజసేవలో పాలుపంచుకోవాలని జేఎన్టీయూ వైస్ ఛాన్సర్ డాక్టర్ టి కృష్ణ కుమార్ రెడ్డి. జెబిఆర్ఈఎస్ సెక్రెటరీ గాయత్రిలు అన్నారు. గురువారము మొయినాబాద్ మండల పరిధిలోని అండాపూర్ చౌరస్తాలో గల జోగినిపల్లి బిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్టీయూ వైస్ ఛాన్సర్ డాక్టర్ టి కృష్ణ కుమార్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా జేబిఆర్ పిఎస్ జెయింట్ సెక్రెటరీ గాయత్రి ముఖ్య అతిథిని సన్మానించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత చదువుతోపాటు ఉద్యోగాలు చేస్తూ సమాజ సేవలో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ తత్వం ఎంతో పెరిగిపోయిందని దానిని ఎదుర్కొనేందుకు దీటుగా ముందుకెళ్లాలని సూచించారు నేటి సమాజంలో ఎన్నో మార్పులు సాంకేతిక గా వచ్చాయని సూచించారు టెక్నాలజీ ఎంతో పెరిగిపోయిందని దానిని అనుసరిస్తూ ప్రపంచ లో ఉన్న గూగుల్ ఇతర వాటితో పోటీపడే విధంగా ఉండాలని సూచించారు ఇంజనీరింగ్ కళాశాలలో మంచి ఫలితాలు గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు కళాశాల ఎంతో మంచి నాణ్యమైన విద్య అందించడంతోనే ఉత్తీర్ణులుగా ఎదిగారని తెలిపారు అనంతరం జిబిఆర్ఇఎస్ జాయింట్ సెక్రెటరీ జె గాయత్రి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు విద్యార్థుల భవిష్యత్ నేటి సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు మంచి ఫ్యాకల్టీ ప్రాక్టికల్స్ ద్వారా విద్య బోధించడం జరుగుతుందన్నారు గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థుల ఉత్సవం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథి సౌరవ్ వస్తావ్. కళాశాల ప్రిన్సిపల్ ఎన్ సీతారామయ్య హెచ్వోడీలు అధ్యాపకులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాగారంలో "సర్" ప్రక్రియను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**కమాన్ పూర్, సెప్టెంబర్ 10, (జనంసాక్షి):** సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ సవరణ కొరకు నోటీసులు అందుకున్న వారికి పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం నాగారం గ్రామపంచాయతీ పరిధిలో నాగారం, లింగాల పోలింగ్ బూతులకు సంబంధించి నాగారం గ్రామ సర్పంచ్ పొనగంటి కుమార్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన హియారింగు ప్రక్రియను అడిషనల్ కలెక్టర్, (రెవిన్యూ )పెద్దపల్లి బి. రాములు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క నోటీసును జాగ్రత్తగా పరిశీలించివాటికీ తగిన డాక్యుమెంట్స్ తీసుకోని సరి చేయాలనీ ఆదేశించారు. ఓట్లు పోతాయని అపోహ పెట్టుకోవద్దని, మీకు వచ్చిన నోటీసునకు తగిన డాక్యుమెంట్స్ తో మరల అనుసంధానం చేసి, ప్రతి ఓటును సవరించడం జరుగుతుంది అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామ పాలక వర్గం, సూపర్ వైజర్ డి. సతీష్ కుమార్, జిపిఓలు జ్యోతి, అశోక్, పంచాయ తీ సెక్రటరీ ఎ. రాంమోహన్, బిఎల్ఓ లు రేణుక, అమల, బిఎల్ఎలు పాల్గొన్నారు.

# 'యశోద హైటెక్ సిటీ'లో అత్యాధునిక చికిత్స

- ఇన్-హౌస్ నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ ప్రారంభం
- యశోద హైటెక్ సిటీ ఆస్పత్రి లో అనుభవజ్ఞులైన మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ నిపుణుల బృందం
- మీడియా సమావేశంలో డాక్టర్ శిఖర్ కుమార్

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సరంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని డాక్టర్ శిఖర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ యశోద ఆసుపత్రిలో మీడియా సమావేశంలో డాక్టర్ శిఖర్ కుమార్ మాట్లాడుతూ... సాంప్రదాయ 'ఒకే విధమైన చికిత్స అందరికీ' అనే విధానానికి బదులుగా, వ్యక్తిగతీకరించిన వైద్యం ప్రెసిషన్ అంకాలజీ వైపు వైద్యరంగం అడుగులు వేస్తోందని, లక్ష్యిత మౌఖిక చికిత్సలు అనేక రకాల క్యాన్సర్లలో నయం అయ్యే అవకాశాలను, జీవనకాలాన్ని, రోగుల జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరిచాయని తెలిపారు. అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలను అందించాలనే తమ నిబద్ధతలో భాగంగా, హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ ఇప్పుడు ఇన్-హౌస్ నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ సదుపాయాన్ని ప్రారంభించిందని, ఈ అత్యాధునిక సాంకేతికత ద్వారా వేగవంతమైన, ఖచ్చితమైన సమగ్ర క్యాన్సర్ జీనోమిక్ పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. ఆసుపత్రిలోనే ఈ సదుపాయం అందుబాటులో ఉండటం వల్ల జన్యుపరమైన మార్పులను త్వరగా గుర్తించి, ప్రతి రోగి అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన చికిత్సను అందించేందుకు ఆంకాలజిస్టులకు సహాయపడుతుందని, ముఖ్యంగా ఊపిరితిత్తుల, రొమ్ము, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లతో పాటు ఇతర క్యాన్సర్ రోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండనుందన్నారు. ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ నిపుణుల బృందం అందుబాటులో ఉందని, రోబోటిక్ ఆంకోసర్జరీ, భారతదేశంలోనే తొలి అత్యాధునిక రేడియేషన్ థెరపీ వ్యవస్థతో పాటు సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలను ఒకే చోట అందిస్తూ, ప్రపంచ స్థాయి ప్రెసిషన్ ఆధారిత వైద్యాన్ని అందిస్తోందన్నారు. ఇన్-హౌస్ నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ ప్రారంభంతో, యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ ప్రెసిషన్ అంకాలజీ రంగంలో మరో కీలక మైలురాయిని చేరుకుందని, అత్యాధునిక సాంకేతికతతో, రోగి-కేంద్రిత క్యాన్సర్ చికిత్సలను అందించాలనే తమ నిబద్ధతను మరోసారి చాటిచెప్పిందని డాక్టర్ శిఖర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హైటెక్ సిటీ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరెడ్డి, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఇస్రోలో శిక్షణకు సిరిసిల్ల యువకుడు

- వీఎస్ఎస్‌సీలో సిరిగిరి తేజస్విన్ వర్మ ఎంపిక
- ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో ప్రతిభకు దక్కిన అవకాశం



**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** అంతరిక్ష రంగంలో దేశానికి సేవలందిస్తున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో సిరిసిల్ల యువకుడు సిరిగిరి తేజస్విన్ వర్మ శిక్షణకు ఎంపికయ్యారు. ఇస్రోకు చెందిన ప్రతిష్టాత్మక విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ తిరువనంతపురంలో ఏరోస్పేస్ ఇంజనీర్‌గా ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు వీ,ఎస్,ఎస్,సీ అధికారులు తేజస్విని వర్మకు ఆఫర్ లెటర్ అందజేశారు. చెన్నై ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన సిరిసిల్ల పట్టణానికి చెందిన తేజస్విని వర్మ చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్/ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించారు. ఇంజినీరింగ్ విద్య పూర్తిచేసిన అనంతరం ఏరోస్పేస్ రంగంలో తన ప్రతిభను చాటుకునే దిశగా ముందుకు సాగుతున్న ఆయనకు ఇస్రోలోని వీఎస్ఎస్‌సీలో శిక్షణకు ఎంపిక కావడం కీలకమైన మైలురాయిగా నిలిచింది.

సిరిసిల్లకు చెందిన యువకుడు దేశంలోని ప్రతిష్టాత్మక అంతరిక్ష పరిశోధనా సంస్థలో శిక్షణకు ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. తేజస్విని వర్మ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి అంతరిక్ష రంగంలో దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు. యువతకు ఆయన ఎంపిక స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.

# ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించాలి

**భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి : హుజురాబాద్ ఏసిపి మాధవి**



**శంకరపట్నం, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** హుజురాబాద్ డివిజన్ పరిధిలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఏసీపీ వి. మాధవి సూచించారు. శంకరపట్నం మండలంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు ముందు పోలీస్ శాఖ అధికారిక పోర్టల్‌లో గణేష్ ఇంటిమేషన్ ఫామ్ ద్వారా మండపం, నిర్వాహకులు, విగ్రహం, ఊరేగింపు మార్గం, నిమజ్జనం వివరాలను నమోదు చేయాలన్నారు. విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు సీసీ కెమెరాలు, స్వచ్ఛంద సేవకులను ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్ల వినియోగాన్ని నివారించాలని, మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనడం, ప్రమాదకర విన్యాసాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో పోలీసులు సూచించిన మార్గం, సమయం, ప్రదేశాన్ని తప్పనిసరిగా పాటించాలని, పిల్లలు, మహిళలు, వృద్ధులు, ఈత రాని వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు, మత విద్వేషాలకు దారితీసే పోస్టులు, వీడియోలను ప్రచారం చేయవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో రూరల్ సీఐ వి. శ్రీనివాస్, కేశవపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను 'గ్రీన్ సిటీ' గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- పార్టీలకతీతంగా నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** పార్టీలకతీతంగా నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, కరీంనగర్‌ను సుందర, స్వచ్ఛ, హరిత నగరంగా (గ్రీన్ సిటీగా) తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని 34వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు మేయర్ శ్రీకారం చుట్టారు. స్థానిక కార్పొరేటర్ సమీనా పర్వీన్, జమ్ము తదితరులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 34వ డివిజన్ ప్రజలు మేయర్‌కు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం మేయర్ కొబ్బరికాయ కొట్టి, అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ... గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఈ ప్రాంతం నగరంలో భాగమైన నేపథ్యంలో డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తమ పై ఉందని, పనులు చేపడుతున్నామని తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 34వ డివిజన్ అభివృద్ధికి ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.40 లక్షలు కేటాయించినట్లు, యూఐడిఎఫ్ నిధుల నుంచి మరో రూ.50 లక్షలు వెచ్చించి డివిజన్‌లో మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు. నగరంలోని ప్రతి డివిజన్ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం. రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, కరీంనగర్ ను స్వచ్ఛ, సుందర, హరిత నగరంగా తీర్చిదిద్దే దిశగా నిరంతరం కృషి చేస్తామని మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ నెంబర్ నందకుమార్, మున్సిపల్ అధికారులు, స్థానిక డివిజన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## స్కూటీ బోల్తా.. ఒకరు మృతి

**ఇద్దరికి తీవ్ర గాయాలు**

**తాండూరు, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):**



తాండూరు మండలం అంతారం గ్రామ సమీపంలో గురువారం స్కూటీ అదుపుతప్పి బోల్తాప డిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూ రు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన ముగ్గురు ఒకే స్కూటీపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కొడుకుతో సహా తల్లి బావిలో దూకి ఆత్మహత్య

- అన్నకు ఫోన్ చేసి నేను చనిపోతున్నా నా పిల్లలు జాగ్రత్త
- తల్లి మృతదేహం లభ్యం.. బాలుడి మృతదేహం కోసం గాలింపు





**మల్యాల సెప్టెంబర్ 10 (జనం సాక్షి) :** ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం రోజు తల్లి తన కొడుకుతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి తల్లి కవిత మృతదేహం లభ్యం, బాలుడు మృతదేహం గాలింపు వివరాల్లోకెళ్తే మల్యాల మండలం కేంద్రంలోని విద్యానగర్(పంపు)కు చెందిన గుండేటి కవిత(34) గురువారం తెల్లవారుజామున తన సోదరుడు ఆడెపు కొమురయ్య కు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని,తన ఇద్దరు కొడుకులని మంచిగా చూసుకోవాలని చెప్పి అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది.కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించి ఆమె కోసం గాలించగా, సుమారు 5:30 గంటలకు ముత్యంపేట శివారులోని మారుపాక విశ్వనాథ్ బావి వద్ద ఆమెకు సంబంధించిన చెప్పులు,మొబైల్ ఫోన్ గుర్తించి బావిలో పరిశీలించగా కవిత నీటిలో తేలుతూ కనిపించడంతో ఫైర్ సిబ్బంది సహాయంతో ఆమె మృతదేహాన్ని బయటకు తీసి తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి,జగిత్యాలకు తరలించారు.చిన్న బాలుడు శశాంక్ మృతదేహం కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.మృతురాలు కవితకు ఇద్దరు కుమారులు,పెద్ద కొడుకు నిఖిలేశ్ (11),చిన్న కుమారుడు శశాంక్(7) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, అప్పులు మరియు చిన్న కుమారుడి అనారోగ్యం కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన కవిత,తన చిన్న కుమారుడిని బావిలో పడవేసి,అనంతరం తాను కూడా బావిలో దూకి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.ఘటనపై మృతురాలి అన్న ఆడెపు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

## మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం: చేవెళ్ల ఎమ్మెల్యే

**కోటి 55 లక్షలతో సి.సి రోడ్లకు శంకుస్థాపన**



**శంకర్ పల్లి, సెప్టెంబర్ 10(జనం సాక్షి) :** మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలోని పరిధిలోని పలు వార్డులలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన వాటిలో రెండవ వార్డులో 70 లక్షలతో ఆరో వార్డులో 66 లక్షలు 14 వ వార్డులో 19 లక్షలతో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం,ప్రతి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, డిసిసి కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, కౌన్సిలర్స్ బండ్ల గూడెం ప్రశాంత్, చాకలి అశోక్, ఉషా కిరణ్ విజయ్ కుమార్,ఆనంద్ రావు, కో ఆప్షన్ మెంబర్స్ ,బాలకృష్ణారెడ్డి, మహమూద్,రజిని శ్రీనివాస్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు చంద్రమౌళి, నాయకులు శేరి అనంత్ రెడ్డి, కావలి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా పర్యటనలో సీఎం, సోదరుల మధ్య ఒప్పందాలు

- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆరోపణలు
- 200 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయింపు
- అన్నదమ్ముల పేరిట వేల కోట్ల పెట్టుబడుల డ్రామా
- కేంద్రం, బీజేపీ వైఖరిపై నిలదీత
- ప్రశ్నల భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్



**రంగారెడ్డి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరుస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికా పర్యటన పేరిట సొంత సోదరులతోనే ఒప్పందాలు చేసుకుంటూ రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. మహేశ్వరం మండలం రావిర్యాల రెవెన్యూ పరిధిలోని ఫ్యాబ్ సిటీ భూముల్లో బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు గూడెం మైపాల్ రెడ్డి, వెంకటేష్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ సత్యవతి రాథోడ్, జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి పర్యటించిన సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల రెవెన్యూ ఫోర్త్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డికి చెందిన 'టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్' కంపెనీకి ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7 కోట్లకు కట్టబెట్టారని మండిపడ్డారు. విదేశీ పర్యటనలు, పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. "ది గ్రేట్ అనుముల రేవంత్ రెడ్డి.. తన సోదరుడు అనుముల జగదీశ్వర్ రెడ్డితో రూ.1000 కోట్ల పెట్టుబడులు తెప్పించుకున్నట్లు ప్రకటించారు. ఇలా జగదీశ్వర్ రెడ్డికి రూ.1000 కోట్లు, కొండల్ రెడ్డికి రూ.250 కోట్లు కట్టబెట్టడమేనా ప్రజాపాలన?" అని ఆయన నిలదీశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏటీఎంగా మారిందని తరచూ విమర్శించే బీజేపీ నేతలు.. ఈ అన్నదమ్ముల దోపిడీపై ఎందుకు నోరు మెదపడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "తెలంగాణలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుంటే, దొంగను పట్టుకోవాల్సిన కేంద్ర హోంమంత్రి ఎక్కడ ఉన్నారు?" అని నిలదీశారు. ఈడీ, సీబీఐ లు ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. దొంగ రేవంత్ రెడ్డి, చీకటి బీజేపీ ఒక్కటై కలిసి ఆడుతున్న నాటకమని విమర్శించారు. దోచుకున్న డబ్బును దాచుకునేందుకు పొంగులేటి కూడా రాఘవ కన్స్ట్రక్షన్ పేరుతో దోచుకుంటున్నాడని ఆరోపించారు. ఇవన్నీ అడుగుతామని టిఆర్ఎస్ శాసనసభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారని దుయ్యబట్టారు. ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకున్నప్పుడు ప్రధాని మోదీని ప్రశ్నించే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వ్యవహారాలపై ఎందుకు స్పందించడం లేదని, సీబీఐ, ఈడీ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని నిలదీశారు.

ప్రశ్నల భయంతోనే సస్పెన్షన్..

సీఎం రేవంత్ రెడ్డిని చూసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా 'రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్' పేరుతో కొత్త వ్యాపారాలు ప్రారంభించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలను రాబోయే శాసనసభ సమావేశాల్లో తాము నిలదీస్తామనే భయంతోనే తమను సభ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినప్పటికీ తాము భయపడేది లేదని, ప్రభుత్వ అవినీతిని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# 12 ఏళ్ల తర్వాత విద్యా వికాస్ సమితి ట్రస్ట్ కేసులో పురోగతి

**ట్రస్ట్ ఆస్తులను కాపాడతాం..చైర్మన్ శశి ప్రభ మాణిక్ రావు**



**తాండూరు సెప్టెంబర్ 10(జనంసాక్షి) :** విద్యా వికాస్ సమితి ట్రస్ట్ కేసుల విషయమై గౌరవ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టులో హాజరై కేసు విషయంలో విలువైన సమాచారాన్ని సమర్పించడం జరిగిందని ట్రస్ట్ చైర్మన్ శశి ప్రభ మాణిక్ రావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్ట్ కేసుల్లో చాలా వరకు మేమే విజయం సాధించాము. గురువారం జరిగిన కేసులో 12 సంవత్సరాల తర్వాత పురోగతి ఏర్పడింది.

ట్రస్ట్ ఆస్తులను అన్యాక్రాంతం చేయాలని ప్రయత్నిస్తున్న వ్యక్తులకు గురువారం కోర్టులో జరిగిన సన్నివేశమే చెంపపెట్టు లాంటిదని అన్నారు.ముమ్ముందు రానున్న కాలంలో ట్రస్ట్ ఆస్తులను కాపాడి, మాజీ మంత్రి మాణిక్ రావు ఆశయమైన తాండూరు ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పన కార్యక్రమాలకు శ్రీకారం చుడతాము. ఈ ఆస్తులను ప్రజలకు అంకితం చేస్తాము. ఇప్పటికైనా మంచి వైపే విజయం సిద్ధిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ట్రస్ట్ సభ్యులు రామకృష్ణ, రఘు ముదిరాజ్ తదితరులు హాజరయ్యారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

**సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తులకు అవకాశం**

**చేవెళ్ల, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ మొదటి సంవత్సరం (2026--27) ప్రవేశాల గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు కళాశాల కో-ఆర్డినేటర్ కె. సూర్యనారాయణ తెలిపారు. బి.ఏ, బికాం, బి.ఎస్సీ. కోర్సుల్లో ప్రవేశాల కోసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు, సమాన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే డిగ్రీ రెండో, మూడో సంవత్సరం విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును చెల్లించేందుకు కూడా అవకాశం ఉందన్నారు. చేవెళ్ల, పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కో-ఆర్డినేటర్ కోరారు. పూర్తి వివరాల కోసం 9908640914 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# జీడీకే 7 ఎల్ఈపీ గనిలో సీపీఆర్ శిక్షణ

- రెస్క్యూ పోటీల సన్నద్ధతను సమీక్షించిన జీఎం (సేఫ్టీ) కార్పొరేట్



**యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 10 (జనంసాక్షి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) జీఎం (సేఫ్టీ) కార్పొరేట్ శ్రీ కె. సాయిబాబు జీడీకే 7 ఎల్ఈపీ గనిని సందర్శించి, త్వరలో నిర్వహించనున్న జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలకు సంబంధించిన సన్నద్ధతను సమీక్షించారు. పోటీ నిర్వహించే ప్రదేశాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అంతకుముందు మైన్స్ రెస్క్యూ స్టేషన్‌ను సందర్శించిన ఆయన.. రక్షణ బృందాల సన్నద్ధత, రక్షణ పరికరాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. రెస్క్యూ సిబ్బందితో మాట్లాడి, పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్దేశిత ప్రమాణాల మేరకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**అత్యవసర వేళల్లో సీపీఆర్ కీలకం**

అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సామర్థ్యాన్ని మరింత పెంపొందించే సంస్థాగత చర్యల్లో భాగంగా జీడీకే 7 ఎల్ఈపీ గనిలో ఉద్యోగులు, సూపర్‌వైజర్లకు కార్డియో పల్మనరీ రెసుసిటేషన్ (సీపీఆర్) ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమాన్ని శ్రీ కె. సాయిబాబు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండె పనిచేయడం అకస్మాత్తుగా ఆగిపోయినప్పుడు (కార్డియాక్ అరెస్ట్) తక్షణమే సీపీఆర్ అందించడం ఎంతో కీలకమని తెలిపారు. వైద్య సహాయం అందేలోపు తొలి కొన్ని నిమిషాల్లో సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడిన అనేక వాస్తవ సంఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికి ప్రాథమిక సీపీఆర్ పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ శిక్షణ అవసరమని అన్నారు.

జీడీకే 7 ఎల్ఈపీ గనిని సీపీఆర్ శిక్షణ కార్యక్రమానికి పైలట్ మైన్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం దశలవారీగా ఎస్‌సీసీఎల్‌లోని అన్ని గనులు, విభాగాల్లో ఉద్యోగులకు సీపీఆర్ శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెస్క్యూ జీఎం శ్రీ శ్రీనివాస్ రెడ్డి, ఆర్జీ రీజియన్ జీఎం (సేఫ్టీ) శ్రీ మల్లయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీ సత్యనారాయణ, జీడీకే 7 ఎల్ఈపీ ఏజెంట్ శ్రీ విజయ్ కుమార్, రెస్క్యూ సూపరింటెండెంట్ శ్రీ రాజేందర్ రెడ్డి, జీడీకే 7 ఎల్ఈపీ గని మేనేజర్ శ్రీ వేణు కుమార్, ఓవర్‌మెన్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై రైతుల రాస్తారోకో

**కాలిన మోటార్లతో రహదారిపై నిరసన..12 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్**



**రాయికల్ సెప్టెంబర్10 జనం సాక్షి :** రైతులకు ప్రకటించిన విద్యుత్ సరఫరాలో కోతలు విధించడాన్ని నిరసిస్తూ పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు గురువారం రాయికల్ పట్టణంలో ఆందోళనకు దిగారు. పట్టణంలోని విద్యుత్ ఉపకేంద్రం ఎదుట ఉన్న జగిత్యాల-రాయికల్ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ కోతల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన విద్యుత్ మోటార్లను రహదారిపై ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వ్యవసాయానికి కనీసం 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఎప్పుడు నిలిచిపోతుందో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సుధీర్‌రావు, విద్యుత్ శాఖ జగిత్యాల రూరల్ ఏడీఈ సింధూర శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.ఈ నెల 20వ తేదీలోగా సమస్యలను పరిష్కరించాలని రైతులు విద్యుత్ అధికారులను కోరారు. అప్పటిలోగా సమస్యలు పరిష్కారం కాకపోతే రహదారిపై వంటావార్పు తదితర కార్యక్రమాలు చేపట్టి ఆందోళనను ఉధృతం చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

**CHANGE OF NAME**

I, PERALLA HARSHITHA (Old Name in Aadhaar), D/o PERALLA ODELU (17), Residing at Laxmidevi peta Village, Venkatapur Mandal, Mulugu District, Telangana, have changed my name to PERALLA ARSHIKA as per school certificate vide Affidavit dated 08-06-2026 sworn before Notary Public at Hyderabad. The change is to correct a spelling mistake / to match my School Leaving Certificate / Study Certificate / SSC Memo, Date of birth. Hence forth known as PERALLA ARSHIKA for all purposes including Aadhaar update.

Happy Anniversary
జనంసాక్షి 16వ వార్షికోత్సవం
ప్రత్యేక అనుబంధం
జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
11 సెప్టెంబర్ 2026


# ఫ్లోటింగ్ సోలార్‌పై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రిజర్వాయర్లపై ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సౌర, ఫ్లోటింగ్ సోలార్, ఇతర సంప్రదాయేతర ఇంధన వనరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని అన్నారు. దీనిపై త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామని ఆయన చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి సోదాహరణంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కొమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్‌ఎండీ, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు అధిక వ్యయం అవుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినప్పటికీ అందులో కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పారు. ప్రధానంగా దేశీయంగా తయారైన పరికరాలనే ఉపయోగించాలనే కేంద్ర నిబంధనల కారణంగా మెగావాట్‌కు సుమారు రూ.1.30 కోట్ల వరకు అదనపు భారం పడుతోందని వివరించారు. కేంద్రం విధించిన నిబంధనలను సడలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులపై పెట్టుబడిదారుల్లో మరింత ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులను ప్రోత్సహించి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోందని ఆయన శాసనసభకు చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని శాసనసభకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సుమారు 15 వేల మెగావాట్లు ఉండగా.. సెప్టెంబర్ 9 నాటికి అది 19వేల మెగావాట్లకు చేరిందని చెప్పారు. పారిశ్రామిక వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వంటి కారణాలతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని ఆయన వివరించారు. పెరుగుతున్న డిమాండ్ రాష్ట్ర అభివృద్ధికి సానుకూల సంకేతమే అయినప్పటికీ, అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీ భరిస్తోందని డిప్యూటీ సీఎం చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా సుమారు 55 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. దీనికి మరో రూ.5 వేల కోట్ల వరకు వ్యయం అవుతోందన్నారు. మొత్తంగా దాదాపు రూ.19 వేల కోట్లను ఏటా విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని ఆయన సభకు తెలిపారు. భవిష్యత్తులో ఈ భారాన్ని తగ్గించుకుంటూనే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం సోలార్ విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. అమ్రాబాద్ గిరిజన ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సుమారు 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, మైక్రో గ్రిడ్ ద్వారా విద్యుత్ వినియోగించే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పేరుతో పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అవకాశం ఉన్నచోట సోలరైజేషన్, ఫ్లోటింగ్ సోలార్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, ముఖ్యంగా మంథని నియోజకవర్గంలోని కాటారం, మహాముత్తారం వంటి ప్రాంతాల్లోనూ అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. రైతులు, ప్రజలు సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన పెంచుకోవాలని భట్టి విక్రమార్క కోరారు. తమ తమ గ్రామాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రైతులకు ఎమ్మెల్యేలు అవగాహన కల్పించాలని సూచించారు. పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యేలకు ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- తముఖ్యమంత్రిని కోరిన టీజీఈజేఏసీ నేతలు

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈజేఏసీ) చైర్మన్ వి. లచ్చి రెడ్డి, సెక్రటరీ జనరల్ ఒద్దాల రాజశేఖర్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యంగా పీఆర్సీ, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాలపై వచ్చే సోమవారం జరిగే సమావేశంలో సమగ్రంగా చర్చించి, పీఆర్సీ, డీఏ, సీపీఎస్ తదితర డిమాండ్ల అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల టీజీఈజేఏసీ నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీజీఈజేఏసీ నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీజీటీఏ అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి పాక రమేష్,టీజీఆర్ఎస్ఏ అధ్యక్షులు బాణాల రాంరెడ్డి జీటీఓఏటీజీ గరికె ఉపేంద్ర రావు లు ఉన్నారు.

## చెంచు పెంటల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

- మంత్రి సీతక్క ఆదేశాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : చెంచుపెంటల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచుపెంటల్లో తాగునీటి సరఫరాపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గురువారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. చెంచుపెంటలకు మంచినీటి సరఫరాపై అధికారులు మంత్రికి వివరాలు అందజేశారు. నల్లమల అడవుల్లో కేంద్ర పర్యావరణ చట్టాల కారణంగా విద్యుత్ అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఉండటంతో మిషన్ భగీరథ నీటిని పంపింగ్ చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అన్ని చెంచుపెంటలకు తాగునీటి సరఫరా జరుగుతోందని వివరించారు. ప్రతి చెంచుపెంటలో పర్యటించి అక్కడి తాగునీటి పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. సమీక్షలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ జి. లలిత, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్. జగన్మోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. విజయసే, అసిస్టెంట్ ఇంజనీర్లు ఈ. సందీప్, ఎస్‌కే. అక్బర్ పాషా పాల్గొన్నారు.

## 19న కోదాడలో మెగా జాబ్ మేళా

- ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఏర్పాట్లపై సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష



హైదరాబాద్, సెప్టెంబర్ 10,( జనం సాక్షి) : సూర్యాపేట జిల్లాతోపాటు ఉమ్మడి నల్లగొండ, పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సెప్టెంబర్ 19వ తేదీ శనివారం కోదాడలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ ఉపాధి మేళాకు 200 నుంచి 250 కంపెనీలను ఆహ్వానించి, వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతీ రెడ్డి, ఇండస్ట్రీస్ ఠ కామర్స్ అడిషనల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య,సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,ఎస్.పి నరసింహ సంబంధిత శాఖల అధికారులు, కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విద్యావంతులైన యువతలో నిరుద్యోగం నేడు సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్లలో ఒకటని మంత్రి పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు."విద్యావంతులైన నిరుద్యోగ యువత, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రతిరోజూ చూస్తున్నాం. ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఇప్పుడు మంత్రిగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నేను నిరంతరం ప్రయత్నిస్తున్నాను. నిజమైన ఉపాధి అవకాశాలను అందించి, వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే ఈ మెగా జాబ్ మేళా ప్రధాన లక్ష్యం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.గత ఏడాది అక్టోబర్‌లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని మంత్రి గుర్తుచేశారు. ఆ మేళాలో సుమారు 200 కంపెనీలు పాల్గొనగా, దాదాపు 40 వేల మంది నిరుద్యోగ యువత పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిలో దాదాపు 20 వేల మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, సుమారు మూడు వేల మంది ఉద్యోగాలు పొందడం లేదా తదుపరి దశ ఇంటర్వ్యూలకు ఎంపిక కావడం జరిగిందని వివరించారు.హుజూర్‌నగర్ జాబ్ మేళా విజయంతో స్ఫూర్తి పొంది, అంతకంటే భారీ స్థాయిలో కోదాడలో ఉపాధి మేళాను నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువతను విస్తృతంగా సమీకరించాలని అధికారులను ఆదేశించారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఇతర ప్రాంతాలతోపాటు పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన యువత కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు.ఇంజినీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఐటీఐలకు ప్రత్యేక బృందాలను పంపించి, ముఖ్యంగా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను జాబ్ మేళాకు ఆహ్వానించాలని మంత్రి ఆదేశించారు.సోషల్ మీడియా, స్థానిక ప్రచార కార్యక్రమాలు, ఇతర సమాచార వేదికల ద్వారా జాబ్ మేళా వివరాలు ప్రతి అర్హుడైన నిరుద్యోగ యువతకు చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

## తాతా మధును అరెస్టు చేయాలి

**టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్**



హైదరాబాద్ (జనం సాక్షి) : స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైనవని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మధు యాష్కీ మాట్లాడుతూ.. సౌమ్యుడు, అందరి పట్ల ఎంతో గౌరవ మర్యాదలతో వ్యవహరించే స్పీకర్‌ను అసభ్య, అనుచిత పదాలతో దూషించడం ఎవరు నేర్పిన సంస్కృతి.? అని ప్రశ్నించారు. వారి తల్లిని కూడా ఉద్దేశించి దూషించడం దుర్మార్గమని, అహంకారంతో మాట్లాడాదని పేర్కొన్నారు. దళితుడైన స్పీకర్ గారి పై ఇంతటి వివక్ష, అసభ్య పదజాలం వాడుతారా..? అని ప్రశ్నించారు. దళితులంటే కేసీఆర్ కు, ఆయన పరివారానికి మొదటి నుంచీ చిన్న చూపేనన్నారు. దళిత ముఖ్యమంత్రి అని మోసం చేసిందని, దళితుడిని ఉపముఖ్యమంత్రి గా నియమించి.. ఓర్వలేక తొలగించాదని ఆరోపించారు. దళితులు ఉన్నత స్థానంలో ఉంటే ఓర్వలేనితనం కేసీఆర్, ఆయన పరివారంది అన్నారు. ఒకప్పుడు కారంచేడు లాంటి దుర్మార్గాలకు కారణమైన వారసుడే ఈ తాతా మధు అని, మీజ తాతా మధుపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి.. అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. అతని సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. గౌరవ స్పీకర్‌ను దూషించినందుకు కనీసం కేసీఆర్, ఆయన పార్టీ క్షమాపణ కూడా చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. ఇది వారి అహంకారానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన మోసాలకు దళితులు బీఆర్ఎస్ ను దూరం పెట్టారని, ఇకముందు కూడా ఆ పార్టీకి అదే గతి పట్టనుందన్నారు.

## ఆర్టీసీ బస్సు బీభత్సం

- పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు
- ఘటనలో రెండు కార్లు, ఆటో ధ్వంసం



అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 10(జనంసాక్షి) : హైదరాబాద్ శివారులో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న బైకును తప్పించేందుకు ప్రయత్నించిన సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు నియంత్రణ కోల్పోయినట్లు సమాచారం. ఆ తర్వాత రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు అక్కడ నిలిచి ఉన్న వాహనాలను ఢీకొట్టింది. బస్సు బంకులోకి వెళ్లే క్రమంలో రెండు కార్లు, ఓ ఆటోను ఢీకొట్టింది. అంతేకాకుండా డీజిల్ పంపునకు కూడా బస్సు ఢీకొనడంతో బంకు పరిసరాల్లో ఒక్కసారిగా భయానక పరిస్థితి నెలకొంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ బంకు వద్ద పెద్దగా జనసంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ పెను ముప్పు తప్పింది.బస్సు అదుపుతప్పి బంకులోకి దూసుకెళ్లిన మొత్తం ఘటన అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డైంది. ప్రస్తుతం ఈ దృశ్యాలు బయటకు రావడంతో ప్రమాదం ఎలా జరిగిందనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. బైకును తప్పించబోయే సమయంలోనే బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ పరిస్థితి, ప్రమాద సమయంలో వాహనం వేగం, ఇతర సాంకేతిక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల ఉండగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గాపురం స్టేజ్ సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల క్యాబిన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.






Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370